అనుచితాలు అనురాగాలు



లింగం వీరభద్రయ్యచౌదరి

అనుచితాలు -
అనురాగాలు



లింగం వీరభద్రయ్యచౌదరి

ప్రథమ ముద్రణ : ఏప్రిల్ 1976

స్వామ్యములు గ్రంథకర్తవి

ముద్రణ : త్రివేణీ ప్రెస్, మచిలీపట్నం - 1



మూల్యము : 6 రూపాయలు

Sole Distributors :

త్రివేణీ పబ్లిషర్సు

మచిలీపట్టణము - 1



శ్రీ ఎస్. సంజీవదేవ్ గారు

కృతిభర్త

అంకితం

మేధాసంపన్నుడు, బహుభాషాకోవిదుడు,

తార్కిక, తాత్విక చింతనుడు, లలితకళా విశారదుడు,

అభిమానించే మిత్రుడు

శ్రీ ఎస్. సంజీవదేవ్ గారికి

ఆత్మీయతతో

— లింగం వీరభద్రయ్య చౌదరి

1-4-1976

పెడసనగల్లు
దివి తాలూకా
కృష్ణా జిల్లా

విషయసూచిక

		పుటలు
	ప్రస్తావన	
1.	రామ తురంగం	1 — 5
2.	పండు పడ్డాతైంది	5 — 10
3.	ద్రౌపది ప్రశ్న	10 — 15
4.	పెను వేప విత్తు	16 — 21
5.	ఆత్మస్తుతి - పరనింద	21 — 28
6.	రక్తి - విరక్తి	28 — 36
7.	రాద్ధాంతం - సిద్ధాంతం	37 — 40
8.	రంధి, రట్టడి, రొష్టు	40 — 43
9.	పోరు, శతపోరు	43 — 46
10.	వాచాలత్వం	46 — 48
11.	ఈర్ష్యాసూయలు	49 — 51
12.	సహాయంపొంది శత్రువైనాడు	51 — 60
13.	నన్ను పుట్టించ మన్నానా?	60 — 62
14.	కృతఘ్నత	63 — 71
15.	ఫాలాక్షుడు	72
16.	రతి	73 — 74
17.	రమణీయం	74 — 76
18.	రంగు, వాసన, రుచి	77 — 83
19.	ఎందరో మహానుభావులు	83 — 85
20.	చెణుకులు	85 — 92

၁၀.	နှာခေါင်းရောဂါ	၉၃—၉၅
၁၆.	ကြောင့်ခေ နှလုံးရောဂါ	၉၅—၉၉
၁၉.	ဒဏ်ရာ၊ ပြဿဒါး၊ ထား	၁၀၀—၁၀၁
၂၂.	ဝမ်းချုပ်ခြင်း	၁၀၂—၁၀၄
၂၅.	ဗိုက်ကိုက်ခြင်း	၁၀၄—၁၀၆
၂၈.	ဗိုက်မှုတ်ခြင်း	၁၀၆—၁၀၇
၃၁.	ဗိုက်ရေဝင်ခြင်း	၁၀၇—၁၀၉
၃၄.	ဗိုက်ကြီးခြင်း	၁၀၉—၁၁၀
၃၇.	ဗိုက်ပူခြင်း	၁၁၀—၁၁၂
၄၀.	ဗိုက်ထဲတွင် အရည်ဖြစ်ခြင်း	၁၁၂—၁၁၃
၄၃.	ဗိုက်နာခြင်း	၁၁၃—၁၁၅
၄၆.	ဗိုက်ရောဂါ	၁၁၅—၁၁၆
၄၉.	ဗိုက်အောင့်ခြင်း	၁၁၆—၁၁၈
၅၂.	ဗိုက်အောင့်ခြင်း	၁၁၈—၁၂၀
၅၅.	ဗိုက်အောင့်ခြင်း	၁၂၀—၁၂၂
၅၈.	ဗိုက်အောင့်ခြင်း	၁၂၂—၁၂၄
၆၁.	ဗိုက်အောင့်ခြင်း	၁၂၄—၁၂၆

ప్రస్తావన

ఈ చిన్న పుస్తకానికి ఉపోద్ఘాతం లేక పీఠిక అనవసర మనిపిస్తున్నది. 1974 మార్చిలో నేను 1250 పేజీలుగల నా "స్వవిషయం" మూడవభాగం పూర్తిచేసినప్పుడు, ఇంకను వ్రాయటాని కవకాశముంటుందని అనుకోలేదు. అప్పటికే నాకు 76 సంవత్సరాలు నిండవచ్చుచున్నవి. వృద్ధాప్యంవల్ల, అనారోగ్యం వల్ల నా జీవితం క్షీణదశలో పడింది. కాని ఈశ్వరేచ్ఛవల్ల, శ్రీ షిరిడీ సాయిబాబా కరుణవల్ల కొంత తగ్గుస్థాయిలోనైనా, జీవితం ఇప్పటికినీ కొనసాగుచున్నది. అవీ ఇవీ పుస్తకాలు కొంటున్నాను. వానిని కొంతవరకైనా చదువుచున్నాను. అయితే ఎక్కువసేపు చదువలేకపోవుచున్నాను. విసుగెత్తి, ఏదైనా వ్రాస్తే విసుగు తగ్గిపోతుందనే ఊహాకులోనౌచున్నాను. పైగా, విశ్రాంతిగా కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, పుస్తకాల్లోని విషయాలు, రేడియోలో వినిన సంగతులు గుర్తుకు, మననానికి వస్తుంటవి. ఆలోచనలు రగుల్తుంటవి. ఊహలు రేకెత్తుచుంటవి. భావవికాసం కల్గుచుంటుంది. అందువల్ల ఏవో గిలుకుటం జరిగింది. ఆ గిలికినవే ఇందులోని రచనలు. గొప్పగా చెప్పుకోవలసినవి కావు.

అయినా. సామాన్య పాఠకులు కొందరికైనా నచ్చ నచ్చును. కథావస్తువులు చాలావరకు హెచ్చుస్థాయిలోనివి కాక పోయినా, భావపటిమ తక్కువైనా, ప్రబోధాలు, ధార్మికచింతనలు, సాంఘికప్రయోజనాలు లేకపోయినా, ఉబుసుపోకకు చదివే సామాన్యపాఠకులకు కొంత కాలక్షేపానికైనా ఉపకరించవచ్చని అభిప్రాయం కొంత, బొత్తిగా నీరసించిపోలేదని నాకు నేను ధైర్యం చెప్పుకొనుటకు ముఖ్యంగా, ఈ పుస్తకంలోని రచనలను, బహిర్గతం చేయించుచున్నాను.

పాఠకలోకం సానుభూతితో గ్రహించెదరు గాక!

దివితాలూకా, పెడనగల్లు
కృష్ణాజిల్లా
1-4-1976

లింగం వీరభద్రయ్య చౌదరి

നിവേദനം

౧

రామతురంగం

భరతఖండంలో ఉత్తరాపథాన్న గుర్రా లున్నాయి. దశరథుడు తన పదిరథాలకు గుర్రాలనే పూన్చియుంటాడు. కై కేయితండ్రి కేకయరాజు అశ్వాధిపతి, అనగా అనేక తురంగాలను కల్గినవాడు. పెంచి అమ్ముకోనేవాడు. కాబట్టి ఉత్తరహిందూస్థానంలో గుర్రాలు దండిగానే వుండేవి. కాని, దక్షిణాపథంలో అనగా వింధ్యకు దక్షిణభారతంలో గుర్రా లున్నట్లు కన్పడదు. రావణు డంతటివాడే తన రథాలను కంచరగాడిదలతో నడిపించేవాడు. అయితే, గుర్రాలులేనిదే కంచరగాడిదల పుట్టుక వుండదు కదా! రావణుడు ఎక్కడనుండో ఈ గుర్రం-గాడిద సంకరజాతిని దిగుమతి చేసుకొని యుంటాడు. రామునకు గుర్రాలు పూనిన రథా లలవాటు. రావణునితో యుద్ధం చేయవలసినప్పుడు రథమే గాక, గుర్రం కూడా ఎక్కటానికి దొరకకపోయె. పైగా రావణుడు తన రథం నుండి యుద్ధంచేస్తున్నాడయ్యె. రాముడు 8 అడుగుల ఎత్తైనవా డంటారు. అయినా, రావణుడు కూడా ఆజానుబాహుడే కాబట్టి, రథంమీద నుంచుంటే రాముని కతడు తన తలపైగా నుంచున్న ట్లనిపించింది. ఆ యుద్ధభూమి సమతలం కాబట్టి, తా నే గుట్టమీదనో, చెట్టుమీదనో ఎక్కి యుద్ధంచేయటానికి వీలు లేకపోయింది. చుట్టూ చూచాడు, ఒకప్రక్కగా హనుమంతుడు కన్పడ్డాడు. అతడు కూడా ఎత్తైనవాడు. బహుశా రాముని అంత ఎత్తైనవాడేమో. అతన్ని పిలిచి "హనుమంతా, చూడు రావణున్ణి, అతడు రథంమీద ఎక్కి నాకు చాలా పైఎత్తులో వున్నాడు. అతనితో భూమి మీద నిల్చుండి తలెత్తి, బాహువు

లెత్తి పైకి బాణాలు వదలి యుద్ధంచేయా లంటె కష్టంగా వున్నది. దీని కేదైనా ఉపాయం లేదా?" అన్నాడు. రాముడు కపటి, తన ఉద్దేశాన్ని చప్పున బైటబెట్టేవాడు కాడు. నీ భుజాలమీద నెక్కించుకో అని అంటే, హనుమంతు డేమనుకొంటాడో, సమ్మతిస్తాడో లేదో. తాను బైటబడటం బాగుండ దనుకొన్నాడు. అంజనపుత్రుని మనస్తత్వం ఇప్పటికి బాగా అర్థంచేసుకొని యున్నాడు. అతని బానిస దృక్పథాన్ని, ఆ విధమైన వర్తనను గ్రహించియే యున్నాడు. తనంటే పడిచస్తాడు. దేవునివలె పూజించుకుంటున్నాడు. తన మాటకుగాని, ఇష్టానికిగాని భిన్నమైన మాట, నడత ఎరుగడు. మిక్కిలి అణకువతో అడుగులకు మడుగు లొత్తుచుంటాడు. నిజానికి, తన పాదాలను చక్కగా రాచి, సవరించి, తనశ్రమను తీర్చుతూంటాడు. మొన్న సీతాన్వేషణకై లంకకు వెళ్లి సీతతో మాట్లాడివచ్చిన దగ్గరనుంచి, మరీ ఎక్కువగా వినయ విధేయతలను చూపిస్తున్నాడు. తన అభిప్రాయాన్ని గ్రహించియే యుంటాడు. అతడే నా భుజాలమీద కెక్కించుకుంటాను, మీరు అనుకూలంగా రావణునితో యుద్ధంచేయగలరని ముందుకు వస్తా డనుకొన్నాడు. తన చుట్టుప్రక్కలవాళ్లు మనస్తత్వాన్ని బాగా గ్రహించిన రాముని అంచనా తప్పుకాలేదు. హనుమంతుడు, "శ్రీరామప్రభూ, నే నింత ఎత్తున వుండగా మీకాందోళన ఎందుకు? నా భుజాలమీద మిమ్ములను భద్రంగా కూర్చోబెట్టుకొంటాను. రావణుడైతే రథ మెక్కినా నిల్చుండే యుద్ధంచేయాలి, మీరేమో కూర్చుండే యుద్ధం చేయవచ్చును. ఇదుగో ఎక్కం"డని ప్రార్థేయపడ్డాడు. రాముడు గంభీరంగా తలూపి, చిరునవ్వు నవ్వాడు. హనుమంతుడు మోకాలుదండ వేయగా, రాముడు సులభంగా అతని భుజాలమీద కెక్కి ఒక కాలటు, ఒక కాలిటు వేసి సుఖాసీనుడైనట్లు భాసిల్లాడు. ఈ విధంగా హనుమంతుడు "రామరావణ యుద్ధతురంగం" అయ్యాడు. రామభక్తుల కెంత పరవశించవలసిన సన్నివేశం! తమ భక్తిని కొంతైనా హనుమంతునికి మళ్లించారు, అంత మంచి స్వామి కార్యం నెరపినందులకు.

అడవుల్లో వుండి హనుమంతు డాటవికు డైనాడు. వనాల్లో తిరిగి వనేచరుడు లేక వానరుడైనాడు. కాని, అతడు వాయుదేవుని పుత్రుడుకదా ! అతని తల్లి అంజన వానరస్త్రీ అయినా, హనుమంతునకు చాలావరకు తండ్రి వాయుదేవుని శక్తి సామర్థ్యాలు, తెలివితేటలు, భాషాపాండిత్యం, శాస్త్రజ్ఞానం అబ్బాయి. కాని ఆటవిక యైన తల్లి మనస్తత్వంకూడా వచ్చింది. లేకపోతే, రామదాసు డెందు కయ్యాడు? అయితే, ఆటవికి జన్మించి ఆటవికులలో పెరిగినవాడైనా, వట్టి ఆటవికుడుగా ఆంజనేయు లెప్పుడు వర్తించలేదు. రామలక్ష్మణులు ఋష్యమూకపర్వతాన్ని చేరినప్పుడు, ముందుగా వెళ్లి వారిని పలకరించినవాడు హనుమంతుడే. తాను చెప్పింది వాళ్లకు తెలిసి, వాళ్లు చెప్పింది తనకు తెలిసిం దన్నమాట. అనగా రామలక్ష్మణుల మాతృభాష లోనే ఆంజనేయులు మాట్లాడాడు. రాముడు త్రేతాయుగంవాడు గనుక, కీస్తుకు పూర్వం చాలా వేల సంవత్సరాలనాటి వాడని చెప్పుతారు. కాదు, భారతయుద్ధానికి ఏ ఐదు వందలో, వెయ్యి సంవత్సరాలనాటి వాడో అని కొందరి అభిప్రాయం. కీస్తుకుపూర్వం వేలసంవత్సరాల భాషకు, రెండువేల సంవత్సరాల భాషకు భేద మున్నది. అతి ప్రాచీ నార్యులు ఏదో భాష మాట్లాడి యుంటారు. దానిని ఆర్యభాష అందాం. తర్వాత దానిని పరిష్కరించగా సంస్కృతమైనది. కాబట్టి, హనుమంతుడు ఆర్యభాషలోనైనా, సంస్కృతంలోనైనా సంభాషించి యుండాలి. రామలక్ష్మణులకు చిత్రకూటంలోనే గాక, పంచవటంలో కూడా ఆటవికుల పొత్తు కలగలేదు. వారికి ఆటవికులతో సంబంధం కలిగింది కిష్కింధప్రాంతంలోనే. జటాయువు ఆటవికుడే కాని, అతనినుండి ఆటవికుల భాషను నేర్చుకొనటాని కవకాశం లేదు. పంచవటప్రాంతంలో రాక్షసు లుండిరిగాని, ఏ జటాయువో తప్ప, ఆటవికు లున్నట్లు కన్పడదు. కాబట్టి మొట్టమొదట (జటాయువుని మినహాయించి) రామలక్ష్మణులు కలసికొన్న వానర, లేక ఆటవిక హనుమంతుడు వారి భాష మాట్లాడా డంటే, హనుమంతుడు ఆటవిక రూపం; వేషంలో వున్నా నిజమైన ఆటవికుడు కాదని

అనుకోవాలి. వాయుపుత్రుడే గాక, వాయువు ద్వారా శివుని వీర్యానికి జనించినాడని, బ్రహ్మ, ఇతర దేవతలనుండి వరాలు పొందాడని, సూర్యుని వద్ద శాస్త్రాలు నేర్చాడని, సంగీతంలో నిపుణుడని పురాణాలు చెప్పుచున్నవి. అటువంటివాడు ఆటవికు డౌతాడా? ఆటవికుని వలె మూతి ఎత్తు వగైరా, ఇంద్రుని వజ్రాయుధం దెబ్బవలన కలిగినట్లున్నవి. ఎట్లు జూచినా, వాయుపుత్రుడు ఆటవికు డని నాకు తోచటం లేదు. ఆటవికులతో కలసి యున్నంత మాత్రాన అతనిని ఆటవికునిగా ఎంచుటకు వీలు లేదని నా గట్టిఅభిప్రాయం.

సరే, హనుమంతుడు ఆటవికుడు కాదు. బాగా శాస్త్రాలు, గీస్త్రాలు చదువుకొన్నవాడు. సంగీతవిద్వాంసుడు. అప్పటి ఆర్యభాష తెలిసినవాడు (సీతతో కూడా ఆర్యభాషలోనే సంభాషించాడు కదా). ఇంత విజ్ఞానం, శక్తులు, లక్షణా లున్నవాడు రామునికి బానిసెట్లైనాడు? పైగా, గుర్ర మెట్లైనాడు? ఇది వాల్మీకి కల్పన కాదుగదా? రాముని గొప్పవానినిగా, విష్ణువు అవతారంగా చెప్పటానికి ఆంజనేయుని వంటి శాస్త్రజ్ఞుణ్ణి, ప్రతిభాశాలిని, ప్రజ్ఞావంతుణ్ణి రామపాదపూజ చేసి మోక్షం పొందినట్లు ఆనందించే వాణ్ణిగా చేశాడా అని నా గట్టిసందేహం. రాముని సృష్టించి ఆదర్శమూర్తిగా, ఎదురులేని వీరుడుగా, ధర్మశాస్త్రాలు మూర్తీభవించినవాడుగా, ప్రజారంజకుడుగా, ఆర్తత్రాణపరాయణుడుగా తయారుచేసిన వాల్మీకి, రామ లక్ష్మణ భరతుల పేరున, హనుమంతుని పేరున ఆర్యజాతి ధర్మాలను, వారిలో పాతుకొనియున్న దాస్యపద్ధతిని బోధించి కై కేయి, మంథర, రావణ పాత్రల నెపాన ఇతర ధర్మాలను, సరణులను నిరసించి, ఇతరులు ఆర్యసంఘ ధోరణులను, నియమాలను, ఎత్తుగడలను పాటించుట కోసం ఎత్తు ఎత్తియుండవచ్చు ననుకోవాలి. అయితే, ఈకాలపు రామభక్తులు కూడా హనుమంతుడు వానరుడని, తోకున్నదని, రాముణ్ణి దేవుణ్ణిగా కొలిచాడని, అడ్డమైన సేవలు చేశాడని చెప్పటం ఏమి బాగున్నది? పైగా రాముణ్ణి మోసే గుర్రంగా, అనగా ఒక జంతువుగా, ఎంచటం ఏమి సబబు? పోనీ, హనుమంతుడు కోతే,

తెలివిగలవాడైనా, చదువుకొన్నవాడైనా కోతి కోతేకదా! కోతి జంతువుకాబట్టి ఇంకొక జంతువైన గుర్రంవలె రామున్ని మోశాడని తలుస్తున్నా రనుకొందాం. అంతటితో ఊరుకుంటే బాగుండును. తమ రామభక్తిలో ఆంజనేయున్ని కూడా, భగవత్స్వరూపున్ని చేశారు కదా! రాముడు మహా భగవంతుడు, హనుమంతుడు ఛోటా భగవంతుడు. రామున్ని అంటకాగి వుండేవాడు కాబట్టి, రామునికి పెద్ద కొబ్బరికాయ అయితే, హనుమంతునకు చిన్న కొబ్బరికాయ కొట్టాలి, తప్పదు. విశేష మేమిటనగా, హనుమంతు డిట్లా వుంటాడని (చూడనే లేదనుకొండి) విగ్రహాలు ప్రతిష్ఠించి, దేవాలయాలు కట్టించి పూజాపునస్కారాలు చేయటం, మధ్వసంప్రదాయమున్నవారికి రాముని కంటె, హనుమంతుడే గొప్పవైవంలాగు పూజలు, ప్రార్థనలు ఎక్కువ జరుపుచుండటం చూస్తున్నాము. రామసంకీర్తన మెట్లున్నా, హనుమస్సంకీర్తన ఎక్కువైనట్లున్నది. రేడియోలో 'హనుమాన్ చాలీసా' అని వారానికి రెండుమూడు సార్లైనా సంకీర్తన వస్తున్నది. హనుమంతుని కోతిగా గాక, ఈ భక్తులు గొప్ప గుణములున్న మహాపురుషుడని ఎందుకు పూజించ కూడదు? నిస్స్వార్థపరుడు, నిగర్వి, సేవాతత్పరుడు, కార్యసాధకుడు అని ఎందుకు కీర్తించ కూడదు?

1

పండు పడతైంది

పార్థుడు మత్స్యయంత్రం పడగొట్టాడు. ద్రౌపదిని గెల్చుకొన్నాడు. పాండవు లైదుగురు ద్రౌపదిని వెంటబెట్టుకొని తమ విడిదికి చేరారు. చేరటంతోనే, "అమ్మా, పండు తెచ్చామే" అని కేకవేశారు. ఇంటిలోపలున్న కుంతి, "మీ రైదుగురు పంచుకొనండిరా" అన్నది. "పండంటే నిజంగా పండుకాదే అమ్మా, పడతి, ద్రౌపదే" అన్నారు. బైటికి వచ్చింది. ద్రౌపది కుంతి

కాళ్లకు నమస్కరించింది. "రా అమ్మాయీ, రా" అని లోపలి కామెను తీసుకువెళ్లింది. "పం డనుకొన్నాను. బంగారం వంటి పడుచుపిల్ల. సరే, తీరా నోరు జారాను, నా మాట ఉత్తది కా కూడదు. కాబట్టి మీ రైదుగురూ ఈ పడతిని చేసుకొనండి" అన్నది. సందేహాలు రాగా, వ్యాసుడనే కృష్ణద్వైపాయనుడు వచ్చి, "తల్లి మాట నబద్ధం చేయబోకండి. ఇది పూర్వాచారం. తప్పులేదు, చేసుకొం" డని సలహా ఇచ్చాడు. సరే, తల్లి మాట తప్పుతుందా, వ్యాసులవారి సలహా త్రోసివేయగలమా అని ఐదు గురూ ద్రౌపదిభర్త లైనారు.

ద్రుపద మహారాజు తన కూతురు కృష్ణ పెండ్లికి మత్స్య యంత్రాన్ని పణంగా పెట్టి, పోటీలో గెల్చినవానికి పిల్ల నిస్తానని ప్రకటించాడు. ఎక్క డెక్కడో పొట్టలు చేతబట్టుకొని తిరుగు చున్న పాండవులు ఈ వార్త విని, ఏమో ఎవరి అదృష్ట మెట్లు న్నదో, పైగా పార్థుడు మిక్కిలి సమర్థుడైన విలుకాడు కదా అని తల్లిని వెంటబెట్టుకొని ద్రుపదుని రాజధానికి చేరుకొన్నారు. ఒక కుమ్మరి నాశ్రయించి, అత నింటిలో ఒక ప్రక్క వసతి నేర్పరచు కొన్నారు. పోటీ రోజు వచ్చింది. బ్రాహ్మణుల వేషాలు వేసు కొని, తల్లికి నమస్కరించి ఆమె ఆశీస్సులను పొంది, రాజమంది రానికి చేరారు. అదృష్టవశాత్తు మధ్యముడు మత్స్యయంత్రాన్ని పడగొట్టాడు. ద్రౌపది అతని సొత్తయింది. సంతోషంతో విడిదికి చేరారు.

ఈ కొడుకు లీ పట్టణ మెందుకు చేరింది, ఎందుకు వాళ్లు బైటికి వెళ్లింది పృథకు తెలుసును. ఏమైందో, ఎప్పుడు వస్తాగో అని ఎదురుచూస్తూనే వున్నది. తలుపుచాటునుండో, కిటికీ సందులనుండో వాళ్లరాకను గమనించి యుంటుంది. వాళ్లతో వచ్చే యువతిని చూచి యుంటుంది. పిల్ల వాటంగా కన్పడింది. నడక తీరు, రీవి గ్రహించింది. ఇంకేం, తన ప్లానుకు తగిన ఆడదే దొరికిం దని సంతోషించి, ఏమీ ఎరగనట్లు ఇంట్లోకి వెళ్లి ఉండి పోయింది.

పందెంలో గెలిచేది ఆడదిగాని ఏదో ఫలంకాదని, తన కూతురు ద్రౌపది పణమని ద్రుపదుడు చాటించిన దానిని బట్టి తెలిసియేయున్నదికదా! ఒకవేళ ఆ పణాన్ని గెల్వలేకపోతే, తన మూడో కొడుక్కు-కూడా కొరకలేని పన్నైతే ఆ సందడిలో పండ్లు పంచిపెడ్తారా? బ్రాహ్మణులని పంచిపెడితే ఐదుగురుకు అయిదు పండ్లిస్తారు గాని ఒక్క పం డ్లెట్లిస్తారు అని కుంతికి తోచియుండ దంటే నమ్మగలమా? ఒక్క పండుతో వస్తే, ఉసూరు మంటూ మొగాలు దిగజార వేసుకొని ఓడిపోయామే అనే సిగ్గుతో దిగులుతో ఇంటికి చేరుకొంటారు గాని, వచ్చీ రావటంతోనే సంతోషంతో "అమ్మా పండు తెచ్చామే" అని కేక వేస్తారా? "పండేమిటిరా, పణ మేమయిం"దని గాబరాగా కుంతి బైటకు రాదా? లోప లెక్కడో వుండి మతిమరపు మనిషివలె అందరూ పంచుకొండంటుందా?

అసలు కుంతికి అర్జును డొక్కడే కొడు కంటారు. యుధిష్ఠిరుడు, భీముడు చేరదీసినవారట. నకుల సహదేవులు సవతికొడుకులుకదా! ఒకవేళ పెద్దవాళ్లిద్దరు కూడా కుంతికి బుట్టియున్నా, పుట్టింది త్రివిష్టపం (టిబెట్టు) ప్రాంతంలో. కుంతి మధురప్రాంతానికైనా, మాద్రి మద్రప్రాంతానికి చెందినదైనా వాళ్లు చాలా సంవత్సరాలంతకు ముందు, పిల్లలు పుట్టిన తర్వాత కొన్ని సంవత్సరాలు, టిబెట్టుప్రాంతంలోనే ఉండిపోయారయ్యె. పైగా బిడ్డల జన్మలకు కారకులైనవారు ఇంద్రుడు నగైరా అక్కడివారేనయ్యె. అక్కడి ఆచారంప్రకారం బహుభర్తృత్వం ఉండిందయ్యె. ఒక ఆడదాన్నే కట్టుకొంటే వీళ్లందరు ఎవరి కాపురం వాళ్లు పెట్టుకొని, తనను వేరుచేయరూ? తన మాట కొనసాగుతుందా అని కుంతి ఆలోచించి యుంటుంది.

వ్యాసుడనే కృష్ణద్వైపాయనుడు సంకీర్ణుడు. పల్లెకారి పడుచు మత్స్యగంధికి కానీనుడుగా ఏటిబడ్డునో, మధ్యనో పుట్టాడు. కౌరవ పాండవుల కుభయులకు వాళ్ళ తండ్రులద్వారా మూల పురుషుడైనా, ఆరెండు కుటుంబాలను సమంగా ఆదరించవలసి యున్నా, పాండవులనే అభిమానించాడు. దుర్యోధనాదులు పతి

వ్రతయగు గాంధారికి, ఆమె భర్తయగు ధృతరాష్ట్రనివలన జన్మించారు. వాళ్లది శాస్త్రీయమైన, ధర్మపథానుగామియైన జన్మ. ఇక పాండవులదో, తన జన్మవంటి సంకర జన్మ. సంకరుడు, సంకరులను గాక మేము సత్యంగా పుట్టా మని గర్వించే దుర్యోధనాదుల నభిమానిస్తాడా? పైగా దీనదశలో, దిక్కు-గానక పలుచోట్లు తిరుగుచున్న పాండవులు తనపాదపూజ చేయుచున్నాను. తనమాట కెదురుచెప్పరు. రాజ్యంలో స్థిరపడి, ఇంటిపట్టున గొప్పగా అధికారం చెలాయిస్తున్న కౌరవులు తన్నెట్లును ఖాతరుచెయ్య రనుకొన్నాడు. "మీ అయిదుగురు ఈ స్త్రీ ననుభవించండని. ఇది పూర్వాచారమే" అని దుస్సలహా ఇచ్చాడు.

ఎప్పుడైనా వ్యాసుడు ధృతరాష్ట్రునితో నీ తమ్ముని కొడుకులతో పో రెందుకు, వాళ్ళను బొత్తిగా తీసిపారెయ్యకు మన్నాడేమోగాని, సర్వసామాన్యంగా భారతంలో వ్యాసుని సలహాలన్నీ పాండవులకే. ఆయనతోబ్బ సంప్రదింపులన్నీ పాండవులవే.

భారత పాత్రలలో ద్రౌపదిగాక ఒకని కంటె ఎక్కువ మగవాళ్ళతో సంపర్కంపెట్టుకొన్న ఆడది కుంతినితప్పించి (మాద్రి లెక్కలోకిరాదు) మరొకరు కన్పడరు. కన్యగానే వ్యభిచరించి, కనిన కొడుకును గంగలో పారవేసిన స్త్రీ కుంతి తప్ప మరొకరు కన్పడరు. నల్గురితో వ్యభిచరించిన కుంతి, ద్రౌపది ఐదుగురికీ భార్య ఎందుకు కాకూడదని అనుకొని వుంటుంది.

ద్రౌపది అంగీకరించిందా, ద్రుపదు డొప్పుకొన్నాడా అనే ప్రశ్నలు వస్తవి. అసలు సంగతి కృష్ణ ద్రుపదుని కూతురు కాదు. యజ్ఞం చేయగా, హోమగుండంలోని అగ్ని నుండి ఉద్భవించిందట. మనిషి ఎక్కడైనా అగ్నిలో పుట్టుకొని వస్తుందా? అదంతా ఋషులనే పేరుతో వ్యవహరించిన మోసగాళ్లు తంతు. హిమవత్పర్వత సానువులలో పెరిగిన పిల్లను రహస్యంగా తీసుకొనివచ్చి, తెరచాటున దాక్కొబెట్టి, హోమగుండంలోనుండి పుట్టుకువచ్చిందని బొంకారు. ద్రుపదుడు నమ్మాడో లేదోకాని, ఆ బూటకాన్ని అంగీకరించాడు. ఈ యాజ్ఞసేని చాలాగ్రంథం కలది. ఆమె ఇంద్రసేన పేరుతో మౌద్గల్యుడనే ఋషిని పెళ్లిచేసుకొని ఉండిందట.

అత డామె కామాన్ని తీర్చలేకపోయాడట. భర్తను విడిచిపెట్టి అక్కడక్కడ తిరుగుచుండగా, ని న్నంతదాన్ని చేస్తాం, ఇంతదాన్ని చేస్తాం అని ఆశపెట్టి, ఋషిమోసగాళ్లు తీసుకొని వచ్చి ద్రుపదున కంటగట్టారట. ఈ కథ నిజమైతే, అంత కామాతురతకు ఒక మొగు డేమి చాల్తాడు? దిట్టమైన ఐదుగురు మగవాళ్లు దొరికితే వద్దంటుందా? పైగా ఆమె ఎక్కడ పుట్టిందోకాని, కొండ ప్రాంతాల్లో పెరిగి వ్యవహరించిన దాయె. అక్కడి పద్ధతులు ఒక స్త్రీ ఒక రిద్దరు కంటె ఎక్కువమంది అన్నదమ్ముల కుపచరించటం, వారి సాంగత్యాన్ని పొందటం, వాళ్లతో కలసిమెలసి వుండటం మామూలే నయ్యె. అందువలన ఎందు కభ్యంతరం చెప్పుతుంది? పూర్తి అంగీకారంతోనే ప్రథమ సంగమ రాత్రుల్లో ఐదుగురికి ఐదు రకాల వస్త్రాల, ఆభరణాల, వేషాలతో ప్రత్యక్షమైనది.

ద్రుపదునికి అత్యాశాపరుడు, కఠినచిత్తుడైన ద్రోణునితో బద్ధవైరం వచ్చింది. యౌవనోత్సాహంలో ప్రబలిన స్నేహా దార్ఢ్యంతో అనాలోచితముగా ద్రుపదుడు తాను రాజైన తర్వాత ఈ బీదబ్రాహ్మణునకు రాజ్యంలో భాగ మిస్తా నన్నా డనుకొండి. ఏమాత్రం విచక్షణాజ్ఞానమున్నవాడైనా ఇది ఏమి సబబు, ఏదో కుర్రతనాన అన్నాడు గాని నేను నిజంగా ఆశించవచ్చునా అనుకొనక, దురాశాపరుడగు ద్రోణుడు వెళ్ళి "నీ విస్తానన్న మాట ప్రకారం రాజ్యంలో భాగ మి"మ్మని ద్రుపదు నడిగాడు. ఉత్సాహంలో ఏమో అంటే ముక్కట్టుకున్నా డేమిరా అని వింత కలిగి, వేళాకోళం చేశాడు. రాజ్యం లేదు పొమ్మన్నాడు. క్రోధం, కక్ష తనసొమ్ముజేసుకొన్న ద్రోణుడు తాను ఆకాశాన నిర్మించు కొన్న మేడలు కూలిపోయాయే అని మనస్సును దహింపజేసు కొంటూ, పాముపగ బట్టి తన విలువిద్యాశిష్యులైన పాండవులను వెంటబెట్టుకొని ద్రుపదునిమీద డండెత్తి, పార్థునిచేత అతనిని బంధింపజేసి, తన ఎదుటకు లాగించి, వెనుకకు విరిచికట్టిన చేతులతో ఎదుట నిలబెట్టించి ఎత్తిపొడుపులు, వేళాకోళాలు చేసి రాజ్యంలోని కొంత ముఖ్యమైనదానిని లాక్కొని విడిచి

పెట్టాడు. మహారాజు, మానధనుడైన ద్రుపదునకు తల కొట్టి నట్లైనది. ఇంత బ్రతుకు బ్రతికి ఈ ఒక్క బ్రాహ్మణుని చేతిలో అవమానం పొందానే అనే క్రోధం ఒళ్లంతా నిండిపోయింది. పగసాధించాలని ఎదురుచూస్తుండినాడు. మత్స్యయంత్రం పరీక్షలో నెగ్గినవాడు పాండవమధ్యముడని తెలిసికొని అతడు తన అల్లుడౌచున్నాడు, అనన్యసామాన్యమైన అస్త్ర శస్త్రనిపుణుడు, అతని అండవలన ద్రోణునిమీది తన పగను సాధించవచ్చని సంతోషపడ్డాడు. తన కూతురు ఒక అర్జునుడికేకాక, వాళ్లన్న దమ్ములలో మిగిలిన నల్గురికి కూడా భార్య కావాలట అని తెలిసినప్పుడు కించపడ్డా, అసమ్మతి పొడసూపినా మాయలమాటకారి వ్యాసుడున్నాడుకదా! భారతంలో పైకి చెప్పకపోయినా, వాళ్లు టిబెట్ ప్రాంతం పద్ధతులు అలవర్చుకొన్నారు. పోనీలే, నీకార్య సాధనకు తతిమ్మా నలుగురు కూడా తోడైతే మరీ మంచిదికదా అని నూరిపోసి యుంటాడు. ద్రుపదుడు వ్యాసుని మాటలకు మెత్త బడ్డాడు. పైగా అర్జునుడు ఇష్టపడ్డాడుకదా! ఇప్పుడు వద్దంటే అర్జునుడు కూడా నా కీ పిల్ల అక్కర్లేదనవచ్చును అని సందేహించి, తలూపి వుంటాడు. ఈవిధంగా "పండు పడతైంది."

౪

ద్రౌపది ప్రశ్న

యుధిష్ఠిరుడు పాచిక లాటకు కూర్చున్నాడు. దుర్యోధనుని తరఫున అతని మేనమామ శకుని అభిముఖుడై ఆసీను డయ్యాడు. ఆట ప్రారంభమైంది. పందాలు కాచారు. మొదట పాండవజ్యేష్ఠుడే గెల్చుకొన్నాడు. శకుని ఆరితేరిన ఆటకాడు. నక్కజిత్తులమారి. ప్రత్యర్థిని ప్రోత్సహిస్తేనేగాని, మొదట గెలుపుచూపిస్తేనేగాని అతనికి ఆట నిషా బాగా ఎక్కదు. ఎక్కితే సాహసం పెరుగుతుంది. ద్విగుణోత్సాహంతో కన్నుమిన్ను తెలియకుండాపోతుంది. విచక్షణ లేకుండా ఒడ్డుతాడు. అప్పుడు బాగా బోల్తా కొట్టించవచ్చును అని

తలంచాడు. ధర్మజునకు జూదం సరదా చాలా హెచ్చు. అది పిచ్చిక్రింద తయారైంది. తాను బాగా ఆడేవాడైనా అత డుత్త మోత్తమ ఆటగాడుకాదు. అతని కా విషయం తెలియదు. పైగా శకుని పాచికలాటలో ఎంత గొప్ప ప్రావీణ్యుడో, ఎత్తుకు పైఎత్తు ఎంతనేర్పుగా వేయగలడో, తొందరపడకుండా, స్థిమితంగా అవతలి వాని ప్రవర్తనను గమనించి దెబ్బతీయగలడో యుధిష్ఠిరునకు తెలియదు. అందుచేత గెల్పు నాదే అని సంభ్రమంతో పెద్దపెద్దగా ఒడ్డట మారంభించాడు. ధనాగారాలు, వస్తువాహనాలు, మేడలు, మిద్దెలు, చివరకు రాజ్యం కూడా పోయింది. తన, తన తమ్ముల భూషణాలు, కిరీటాలు, విలువైన దుస్తులు ఎగిరిపోయాయి. తెల్ల మొగంవేసి, మొండిధైర్యం తెచ్చుకొని తమ్ముళ్లను కాచాడు. ఆ ఎత్తులు విఫలమై పోగా, తనను పందెంపెట్టాడు. ఆ ఆట కూడా ఎదుటివానిదే అయింది. ఇంకేముంది, శకుని విరగబడి నవ్వుచూ "ధర్మరాజా, ఇంకేమైనా మిగిలిందేమో గుర్తుకు తెచ్చుకో" అన్నాడు. అప్పుడు ఉమ్మడి భార్య ద్రౌపది గుర్తుకు వచ్చింది. మంచి, చెడు అనుకోకుండా నిస్పృహతో ఆమెను కూడా ఒడ్డాడు, ఈ ఆటైనా గెలిస్తే తన పరువు దక్కుతుందనుకొన్నాడు. ఆ పరువూ దక్కలేదు. దుర్యోధనాదులు సంతోషం పట్టలేక ఒకరినొకరు కౌగిలించుకొని కేరింతలు కొట్టారు. పంచపాండవులు కుక్కినపేనువలె అయిపోయి తలలు వంచుకొన్నారు.

పాండవులు బానిసలైపోయారు. వీళ్లచేత చాకిరి చేయించుకోవటం సులభమైనది కాదు. పైగా భీముడుద్దండుడు. వీళ్లు సౌకరి చేయకపోయినా, వేలకొలది బానిసలున్నారు. అసలు విషయ మదికాదు. వాళ్ల రాజ్యం, సంపదలు లాక్కొన్నాం, వాళ్లు బికారులై పోయారు. అదే చాలు. ఇక వాళ్లేట్లా చస్తే మాత్రం పట్టించుకోవలసినదిలేదు. కాని, ద్రౌపది బానిస కావటం దుర్యోధనునికి కావలసింది. ఆనాడు ఇంద్రప్రస్థంలో తన్నెంత ఎగతాళి చేసి చిన్న బుచ్చింది! ఆ మదం ఇప్పుడణగగొట్టాలి అనుకొని సౌకరును పిలిచి "ద్రౌపదిని సభకు పిల్చుకొనిరా" అని పంపాడు. సౌకరు వెళ్లి "అమ్మా, మా దుర్యోధన మహారాజులుంగారు మిమ్ములను

తీసుకొని రమ్మన్నా " రన్నాడు. తన దాసీవల్ల, జూదంలో తా మోడిపోయిన సంగతి తెలిసికొని దీనావస్థలో వున్న ద్రౌపది, " నే నిప్పుడు రజస్వాలను (ముట్లులో వున్నాను), రావటానికి వీలులే " దని జవాబు చెప్పి వచ్చినవానిని పంపివేసింది. దుర్యోధను నకు కోపం ముంచుకు వచ్చించి. దాసీదాని కెంతపొగరు ! రాజాజ్ఞ తిరస్కరిస్తుందా అని ఒక పెద్దనౌకరును పిలిచి, "లాక్కురా" అని ఆజ్ఞాపించాడు. అతడు వెళ్లి " మా మహారాజులుగారు చాలా కోప్పడుతున్నారు. జూదంలో మిమ్ము నొడ్డి మిమ్ములను కూడా ధర్మరాజుగా గోడిపోయారు. అందువల్ల మీరు మా రాజుగారికి బానిసయ్యారు. బానిస యజమాని ఆజ్ఞ తిరస్కరించ కూడదు, వెంటనే రావలసినది. అవసరం వస్తే లాక్కొనిరమ్మన్నా " రని చెప్పాడు. ద్రౌపదప్పటికి జూదం వివరాలు తెలిసికొని యుండి నది. తమ్ములను ఓడిన తర్వాత, తనను కూడా ఒడ్డి ఓడిపోయా డని తెలుసుకొన్నది. ఓడిపోయి బానిస అయినవానికి స్వతంత్రు రాలైన భార్యను జూదంలో పణంగా పెట్టటానికి హ క్కెక్కడుంది అనుకొన్నది. వచ్చిన నౌకరుతో " వెళ్లి మీ రాజుతో ముం దిది తేల్చుకొనిరా. ధర్మజుడు తన్నోడి నన్నోడెనో, లేక నన్నోడి తన్నోడెనో ముందు తేలితేగాని నేనిక్కడనుండి కదలను, వెళ్లు " అని గట్టిగా చెప్పి పంపివేసింది. ఆ నౌకరు తనకు సరిగా అర్థం గాక తలగోక్కొనుచు, ద్రౌపదిచెప్పిన ప్రశ్నను దారిలో మరచి పోకుండా మననంచేసుకొంటూ సభాస్థానానికి చేరాడు. ఒంటరిగా వచ్చిన నౌకరును చూచి దుర్యోధనుడు గద్దించాడు. " మహా రాజా, ఆమె ప్రశ్నొకటి వేసింది, అది తేలేవరకు రానన్న " దన్నాడు. " ఏమి టాప్రశ్న " అని దుర్యోధను డెగిరిపడ్డాడు. ప్రశ్నను వల్లించాడు నౌకరు. దుర్యోధను డాశ్చర్యపడి వెంటనే ఉగ్రుడయ్యాడు. అతని సోదరులు, ఆప్తమిత్రుడు కర్ణుడు కళ్లెర్ర జేసుకొన్నారు. వాళ్ల మొగాలు జేవురించాయి. ఆ దర్బారు హాలు లోని భీష్ముడు, ద్రోణుడు వంటి పెద్దలు ఆశ్చర్యచకితులైనారు. పాండవులు ఆలోచనలోపడ్డారు. కుయుక్తిపరుడగు యుధిష్ఠిరుడు సందు దొరికేట ట్లున్నదే అనుకొని గంభీరంగా వుండిపోయాడు.

అగ్గిమీద గుగ్గిలం వేసిన ట్లైనది రారాజుకు. తమ్ముని దుశ్శాసనునితో "నీవు వెళ్లి ఆ క్రొవ్వెక్కిన దాసీని జుట్టు పటుకొని ఈడ్చుకురా" అని పంపాడు. దుశ్శాసనుడు చండశాసనుడు. అయినా, ఒకమాత్రాన ద్రౌపది పట్టుబడ్డదా? పెనుగులాడి, రక్కి, కొరికి నానా భీభత్సం చేసింది. అయినా, మహా బలశాలి, పరాక్రమవంతుడైన దుశ్శాసనుడు ఎంతగడుసుదైనను, సాహస వంతుడాలైనను, బలిష్ఠావయవములు కలదైనను ద్రౌపదిని జుట్టు మెలివేసి పట్టుకొన్నాడు. ఇక ఆమె లొంగక తప్పలేదు. రోషకషాయితాక్షియై బుసలు కొడుతూ, పట్టుబడ్డ నల్లత్రాచువలె మెలికలు తిరుగుచూ వెంటబడింది.

ఆ దృశ్యం చూచి కౌరవ సహాయులు, సానుభూతులు కూడా దిగ్భ్రాంతిచెంది కలవరం పొందారు. అయినా, దుర్యోధనునికి భయపడి కిమ్మనలేక పోయారు. ఇక కౌరవ అన్నదమ్ములలో మిత్రులలో ఆహ్లాదకలకలాలు చెలరేగాయి. ఇకఇకలు పకపకలతో దర్బారు ప్రతిధ్వనించింది. కర్ణుడు ఎకసెక్కాలాడాడు. కన్నుగీటి, మీసాలు దువ్వుకొన్నాడు. ఏమో, మోజు పడ్డాడో, స్నేహితుడి మీద ఉన్న అభిమానమో. పాండవులకు తల దిమ్మెక్కింది. ధర్మజుడు ఎర్రబారిన ముఖంతో కొయ్యవలె బిగిసిపోగా, అర్జున నకుల సహదేవులు లజ్జతో మొగాలు చిట్లించుకొనుచు క్రుంగిపోగా, భీముడు ఎరుపెక్కిన కళ్లతో, కుటిలమైన కనుబొమ్మలతో, పటపటలాడే పళ్లతో ఊగిసలాడిపోయాడు. గదమీద చేయివేసి అన్నవంక దృష్టి సారించాడు. వద్దని యుధిష్ఠిరుడు సన్నగా తలాడించాడు. భీముడు బోనులో చిక్కిన సింహంవలెఅయిపోయాడు.

ద్రౌపది శోకార్తయై కంపిత శరీరంతో గోజుచు భీష్మ ద్రోణుల నుద్దేశించి, "ఇదే మన్యాయం, నా ప్రశ్నకు సమాధాన మివ్వకుండా, అన్యాయంగా ఈ దౌర్జన్య మేమిటి? మహారాజు పుత్రికను, వీరుల సతీమణిని, నన్నింత అవమానంగా జుట్టుపట్టుకొని ఈడ్చుకు వస్తే చూస్తూ ఊరుకుంటారేమిటి? నిజంగా నేను దాసినయ్యానా? ధర్మజుడు తనను ఓడిపోయి, తర్వాత నన్ను ఆటలో ఒడ్డలేదా? తన స్వతంత్రతపోయి బానిసఅయినవాడెట్లు ఇంకొకరిని

బానిస చెయ్యగలడు? ఆ ధర్మసందేహం తీర్చం" డని ఘంటా పథంగా అడిగింది. భీష్ముడు "నీ వడిగిన ధర్మం మిక్కిలి సూక్ష్మ మైనది. చప్పున తెమిలేదికాదు. అయినా, స్త్రీకి స్వతహాగా స్వాతంత్ర్యం లేదు. ఇతర ఆస్తులవలెనే భార్యకూడా ఒక ఆస్తి. భర్త దాసుడైతే దాసుని సొమ్ము దొరకు సంక్రమిస్తుంది. కాబట్టి దాసులైన పాండవుల ఆస్తివైన నీవు నీ భర్తలతో బాటు నీవు కూడా దాసీ వయ్యావు" అని అభిప్రాయం (నిర్ణయం) చెప్పాడు. దుర్యోధనాదులు హర్షధ్వానాలు చేశారు. పాండవులు దిగాలుపడి తలలు వంచుకొన్నారు.

భీష్ముడు పాండవులయందు అభిమానం కలవాడే. అయినా, ధర్మానికి లోబడాలికదా! ఇంత పెద్ద బహిరంగసభలో ఒక ఆడది వేసిన ప్రశ్నకు తాను ధర్మశాస్త్రం ప్రకారం జవాబు చెప్పాలి. తా నెప్పుడైనా స్త్రీకి స్వాతంత్ర్యం వున్నదని విన్నాడా? ధర్మ శాస్త్రాలేమి చెప్పుచున్నాయి? "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అని ఘోషించడంలేదా? శైశవ, బాల్య, కౌమార దశల్లో తల్లిదండ్రులకు, యౌవనంలో గృహిణిగా భర్తకు, వయస్సు మళ్లిన తర్వాతనో, భర్త గతిస్తేనో కుమారునికి లోబడి ఉండాలి కదా! వారి ఆధీనంలో వుండి అణగి మణగి వారి చెప్పుచేతల్లో ఉండాలికదా! రాజపుత్రి అని, పాండవుల ధర్మపత్ని అని ఆమె భర్తలసొత్తు కాదు, స్వతంత్రురాలని చెప్పితే సరిపోతుందా? అది ధర్మమౌతుందా అనుకొని పైవిధంగా ద్రౌపది దాసీదే అని తీర్పు చెప్పాడు. భీష్ముడు శాస్త్రిపారంగతుడు. శాస్త్రి పండితులకు సందేహాలు, చాదస్తాలు త్రోసుకు వస్తాయని మనకు తెలుసును. పైగా, అసమాన యుద్ధవీరుడేగాని మానసికంగా పిరికివాడేమో! అంబ విషయంలో, గురువగు పరశురాముని విషయంలో ఏమాత్రం గుండె చలించినవాడు కాదు. అయినా, శిశుపాలుడు ధర్మజుని రాజసూయంలో చెప్పినట్లు నపుంసకుడేమో! నపుంసకునికి స్త్రీ లంటే చెప్పరాని అసూయ, ద్వేషం ఉంటవి. ఇట్టిది సామాన్యంగా నపుంసకుని చిత్తప్రవృత్తి. దీనిని భీష్ముడు కూడా అధిగమించలేకపోయాడు. అమ్మో, ఇప్పు డీమెకు సంది స్తే స్త్రీలు కొంప లుం డనిస్తారా అని భయపడ్డా డనుకుంటాను.

ఇక ద్రోణుడి విషయంలో, ద్రుపదుని పరాభవించి అతని రాజ్యంలో కొంత లాక్కొన్నా, ఆ కుటుంబం మీద తన కక్ష పోలేదు. అర్జును డొక్కడే తన కభిమాన శిష్యుడుగాని తతిమ్మావా రంత చెప్పుకోవలసిన శిష్యులు కారు. భీము డెప్పుడూ తలతిక్క వాడే. చీటికి మాటికి దుర్యోధనుణ్ణి అవమానించి బాధించాడు. దుర్యోధనుడు తన కాశ్రయమిచ్చి, తనను సిరిసంపదలతో నింపి గొప్పగా గౌరవించుచున్నాడు. తన ప్రేమను పూర్తిగా చూరగొన్న తన ఏకైక పుత్రుడు అశ్వత్థామకు ప్రాణమిత్రుడు. కాబట్టి, తన కెందు కని ఊరుకొన్నాడు. పైగా, భీష్ముడు కల్పించుకొని ఒక తీర్పివ్వగా ఈ చండప్రచండ కురువృద్ధుని కాదనగలడా? పైగా, ద్రోణుడు కపటి. తన పబ్బం గడుపుకొనేవాడు. తన ప్రియ శిష్యుడని చెప్పుకొనే అర్జునుని గారాబు పుత్రుని, మిక్కిలి పిన్నవయస్కుని పదిమందిని కూడగట్టుకొని నిర్దాక్షిణ్యంగా చంపినవాడేకదా! అతని అభిమానాలు తన అవసరానికి వీలున్నంతవరకే. అందువల్ల ద్రోణుడు ద్రౌపది గోడుకు పల్లెత్తలేదని, మన మాశ్చర్యపడ నవసరంలేదు.

వాల్మీకి రాముడు శంబుకుని చంపటం, నిండు గర్భవతి సీతను అడవిలో విడిచిపెట్టటం ఆ కాలపు సమాజ, రాజకీయ పద్ధతులను గుర్తించుకొని, మనలో కొందరం వాల్మీకి రాముని భక్తులం కానివాళ్లం కూడా రాముని తూమిస్తాం. ఆలాగే, భీష్ముని తీర్పు ఆ కాలపు సమాజ పరిస్థితుల కనుకూలంగా వున్నదే అని సరిపెట్టుకొన వచ్చును. అయినా, ద్రౌపది ప్రశ్నలోని సమంజసాన్ని ఒప్పుకోక తప్ప దనిపిస్తున్నది. ద్రౌపది కప్పుడు జరిగిన పరాభవాన్ని తలుచుకొంటే మనస్సు వికలత చెంది, ఒప్పకానికి బల మిస్తున్నది.

పెను వేప విత్తు

పాండవులలో అందరి కంటె పెద్దవాడు యుధిష్ఠిరుడు. ఈయనను ధర్మరాజని కూడా అంటారు. ఈయన్ను ధర్మాధర్మాలను విచారించే దేవత్వం కలవాడు+ యమధర్మరాజువలన్ను పుట్టా డంటారు. అందువలన ధర్మరాజు (భూలోక) అన్నాగో, లేక ధర్మతత్పరుడని, ధర్మాచరణుడని ధర్మరాజన్నా రేమో తెలియదు. యోగిపుంగవుడు వేమన, యుధిష్ఠిరుడు యమధర్మరాజువలన పుట్టినాడని నమ్మాడో లేదో కాని, ధర్మరాజు పేరతనికి తగదని ఘంటాపథంగా చెప్పాడు. అంతకంటె ఇంకొకడుగు ముందుకేవేసి "పేరు ధర్మరాజు, పెను వేప విత్తయా" అని నిరసించాడు.

ఈ పాండవధర్మరాజు వట్టి స్వార్థపరుడు. పూర్తిగా కుటిలుడు. అయితే మాంచి బుర్ర కలవాడు, దూరదృష్టి కలవాడు. మధురభాషి. ఎవరి నెట్లాశ్రయించవలెనో, ఎవరి నెట్లు స్తోత్రించి సుముఖులనుగా చేసుకొనవలెనో, ఏ యే సందర్భాలలో ఏ యే విధంగా ప్రవర్తించి కార్యసాధన చేసుకొనాలో బాగా తెలిసిన వాడు. మంచిమాటలు చెప్పటంలో, నీతి ధర్మపన్నాలు చదవటంలో ఘటికుడు. వీలును బట్టి అవతలివారి బలహీనతలు కనిపెట్టి నేర్పుగా టోకరా కొట్టేస్తాడు.

స్వార్థపరత్వానికి మొదటి రకం తార్కాణం, ద్రౌపదిని తన స్వంతంచేసుకొనటం. పాపం శ్రమపడి, నిత్యసాధనచేత విలువిద్యలో అనన్యసామాన్యమైన నైపుణ్యం సంపాదించి, దాని ఫలితమో అన్నట్లు మత్స్యయంత్రాన్ని భేదించి ద్రౌపదిని గెల్చుకొన్న ఫల్లునునికి ఆమె సౌందర్య యూవనాలు దక్కకుండా తల్లిని, వ్యాసుని కట్టుకొని, పూర్వాచారప్రకారం ముందు పెద్దవానికి పెళ్లికావాలని ధర్మాలు వల్లింపజేసి, ఆ యువతిని తన స్వాధీనం చేసుకొన్నాడు. అర్జునుడు పాండవు లైదుగురిలో మూడవవాడు.

రెండోవాడు భీముడున్నాడుకదా! అర్జునునికంటె అతడు పెద్దవాడు గనుక, అతడు కూడా ద్రౌపదిని అర్జునుని కంటె ముందు అనుభవించాలి. గెలుచుకొన్న అర్జునునకు బొత్తిగా లేకుండా చేస్తారా? ఇక నకుల సహదేవు లంటారా, మారుటి తమ్ముల కన్యాయం చేస్తారా? వాళ్లకు కూడా భాగ మివ్వాలి. పైగా, వ్యాసులవారు పెలవిచ్చినట్లు అన్నదమ్ము లెందరున్నను ఒకే స్త్రీని వివాహమాడి, ఉమ్మడిభార్యనుగా సంగమంచేయవచ్చును, సంసారంచేయవచ్చును. ఇది పురాతన సనాతనధర్మం.

రొట్టలువేసుకొంటూ ఆ మదవతిని సంవత్సరంపాటు యుధిష్ఠిరు డనుభవించాడు. నారదులవారి నిర్ణయంప్రకారం ఒక చాంద్రాయణం అనగా నెల తర్వాత ద్రౌపది సాలి తీర్చుకొన్న తర్వాత రెండోవాడు భీముని వశం అయింది. ఎప్పు డెప్పుడా అని ఎదురుచూస్తున్న వాయుపుత్రుడు దొరికిందేచాలని పాంచాలిని ఉక్కిరిబిక్కిరి చేశాడు. ఒక సంవత్సరం, అనగా పండ్రెండు నెలలపాడుగునూతా ఆమెను అనుభవించాడు. అక్కడితో, 25 మాసాలు గడచిపోతాయి. చాంద్రాయణవ్రత మనే నెపంతో ఇంకొక నెల గడచిపోయింది. 26 మాసాలు నిండిన తర్వాతగాని, తాను పందెంలో మహావీరులను మించి గెలుచుకొన్న పార్థుని పాంచాలి చేరలేదు. ఎంత గట్టిపుటకైనా, ఇద్దరు ప్రేమికులు రెండు సంవత్సరాలు సుష్టుగా అనుభవించిన స్త్రీ కన్నె వలె అంత ఇంపు సొంపుగా ఉంటుందా? పాండవుల పత్ని అయినప్పటికే నిండు యౌవనం పొందిన యువతి యుధిష్ఠిరుని చేతిలో పరిణత పొంది యుంటుంది. రాక్షసి హిడింబ సంపర్కానుభవంవలన, రాక్షస రతిని నేర్చుకొన్న మహావీర్యవంతుడు భీముని కౌగిలిలో బిగువుతనం కొంతకు గొంతైనా సడలి యుంటుంది. ఇక అర్జునునకు దక్కింది బాగా వుతుకులు తిన్న బట్టవంటి దై యుంటుంది. అయితే, మాసరజస్వలలవలన స్త్రీ యౌవనం పుంజుకొంటుం దంటారు. కాబట్టి, అర్జును డంతగా నిరుత్సాహపడియుండ డనుకొందాం. ఇక నకుల సహదేవులకు 'దొరికిందే చాలు, బొక్కిందే కూడు'

అనే మనోప్రవృత్తితో తమ వంతు కాలాన్ని సద్వినియోగం చేసుకొని యుంటారు. సరే, ఈవిధంగా జరిగిందే అనుకొందాం. ఇది ఎంతకాలం జరిగిందో, అసలు జరిగిందో లేదో మనకు నిజం తెలియదు. భారతం ద్రౌపది గోజు కొకని చొప్పున గోజుగోజు దుస్తులు, నగలు, వేషధారణ మార్చి చప్పున చూచువారి కిం కొక యువతి అన్నట్లుగా, ఐదుగురిని వివాహమాడిం దని చెప్పుతుంది. కాని నారదుని నిర్ణయంప్రకారం విధిగా 13 మాసాల కొకరు చొప్పున ఇతర మగలతో సంసారంచేసినట్లు అది (భారతం) తెల్పదు. ప్రస్తావన వచ్చినప్పుడల్లా ద్రౌపది యుధిష్ఠిరుని అధీనంలోవున్నట్లు, అతనికి సపర్యలు చేస్తున్నట్లు కన్పడుతుంది. ఒక బ్రాహ్మణగోరక్షణాతురతలో ధనుస్సుకొరకు పార్థుడు చెంత నున్న ధర్మజుని గృహం ప్రవేశించగా, తన గడువుకాలంలో ఇల్లు సొచ్చాడని, ప్రాయశ్చిత్తం విధించి దేశాటనానికి పంపి అర్జునుని బెడద వదిలించుకొన్నాడు. గెల్చుకొన్నధర్మాన, నిజమైన భర్త ఫల్గునుడే అని అతనియందు ద్రౌపదిమనస్సు లగ్నమైయున్నదని భయమేమో. పండ్రెండేండ్లు వనవాసంలోను, ఒక యేడజ్ఞాత వాసంలోను ద్రౌపదిని అంటగాగి దగ్గరపెట్టుకొన్నది ధర్మరాజే. ధర్మజునిప్రక్క నెల్లప్పు డుండేది ద్రుపదుని పుత్రికయే. విరాటుడు కంకుని వేషంలో వున్న ధర్మజుని సారెతో కొట్టగా మొగమునుండి స్రవించిన రక్తాన్ని వెంటనే తనచీరను చింపి, ఆ గుడ్డతో తుడిచి కట్టుగట్టి అనునయించింది ద్రౌపదియే. నకులుడు, సహదేవుడు గుర్రాలను, గోవులను కాచుకుంటూ విరాట్‌నగరంలోనే లేరు. వలలు డనే భీముడు వంటచేయటంలో మునిగిపోయేవాడు. కొజ్జ బృహన్నలవేషంలో ఆడపిల్లలకు నాట్యంనేర్పుతూ అర్జును డుండి పోయేవాడు. ఇక ఖాళీగా మిగిలింది జూదగాడు యుధిష్ఠిరు డొక్కడే. సరే, అజ్ఞాతవాసంలో సైరంధ్రిగా విరటునిభార్య సుదేష్ణకు సేవచేయటంలోనే ద్రౌపదికాలం హరించిపోయిం దనుకోండి. అజ్ఞాతవాసకాలాన్ని విడిచిపెడితే వనవాసం పండ్రెం డేళ్లు యావత్తూ ద్రౌపది ధర్మరాజుతో గడపినట్లున్నది. ఇది నారదుని సలహా ననుసరించి పెట్టుకొన్న నియమభంగం కాదా?

అప్పుడు మాత్రం ఇతర నల్గురకు ఆమె భార్య కాకపోయిందా, సహచర్య, సంగమధర్మం లేకుండాపోయిందా? దీనినిబట్టి చూస్తే పైమాటకు, కళ్లనీళ్లు తుడవటానికితప్ప ద్రౌపది ఇంచుమించు పూర్తిగా ధర్మరాజుని పిలువబడ్డ పాండవాగ్రజుని సొత్తుగానే వుండినది. ధర్మాచరణానికని సలహా లిచ్చే గురువే కాకుండా తాతయైన వ్యాసునికి తా నిచ్చిన మాటకు వ్యతిరేకంగా, ఇతర తమ్ముల కేగాక గెల్చుకొన్న అర్జునుని కూడా కాకుండాచేసి తా నొక్కడే అనుభవించి, సేవలను పొందిన యుధిష్ఠిరుని ధర్మ రాజనవలెనా, పెద వేప విత్తు అనవలెనా?

అతని కుటిలత్వానికి సాక్ష్యం, భీష్ముని కథ. తాత, తన నభిమానించి కురుసామ్రాజ్యానికి యువరాజును చేయించినవాడు, తా మంటే ఎంతో ఆప్యాయంగా ఉండేవాడు, పూజింపదగినవాడు పైగా వంశంలో పెద్ద అని అభిమానం, కృతజ్ఞత లేకుండా నక్కవినయాలు చూపుతూ చల్లగా ఆయన వద్దకు చేరి నీ వింత వాడవు, అంతవాడవు అని పొగడి, "తాతా, నీవు యుద్ధరంగంలో వున్నంతకాలం మేము అగ్నిలో శలభాల్లాగ మాడిపోతాం. ఇంద్రాదిదేవతలైనా ని న్నెదిరించి నిల్వలేరు. ఇక అర్భకులం మే మెంత? నీవు మరణం పొందితే గాని ఈ యుద్ధంలో మేము నెగ్గలేం. నీకు స్వచ్ఛందమరణప్రాప్తి వున్నదికదా! నీ వే విధంగా చచ్చేది నాకు తెల్పవే" అని ప్రార్థేయపడ్డాడు. భీష్ముడు మెత్తబడి స్వామిద్రోహ మనికూడా విచారించకుండా, "ఒరే అబ్బాయీ, నేను శిఖండితో యుద్ధంచేయను. అతని నెదుట బెట్టుకొని చాటుగా అర్జునుణ్ణి నిశితబాణాలు గుప్పించమను. అవి శిఖండి పరంగా వస్తవిగనుక, నేను మారుబాణాలు వెయ్యను. అంతటితో నేను పడిపోతాను. అప్పటి కప్పుడే చావకపోయినా, యుద్ధాని కిక పనికిరాను" అని చెప్పేశాడు. ఈ కుటిలనీతితో భీష్ముని పోరు తప్పించుకొన్నాడు. భీష్మునితో సమానమైనవాడు ధను రాచార్యులు. తమ కందరకు విలువిద్య నేర్పినవాడు ద్రోణాచార్య లున్నాడు. అతడు భీష్మునివంటి మెతకబుద్ధి, చీకిన (సెన్సైల్) బుద్ధి కలవాడు కాదు. అర్జునునిబట్టి పాండవుల యందు కొంత

అభిమానం చూపించేవాడేగాని, 'ఎక్కడన్నా బావగాని వంగ తోటవద్ద కా' దన్నట్లు యుద్ధంలో, నిర్మొగమాటంగా, తన విలువిద్యానైపుణ్యం, శౌర్యప్రతాపాలు చూపి పాండవసేనను నాశనం చేస్తున్నాడు. పాండవులను చావగొట్టుచున్నాడు. నిర్దాక్షిణ్యంగా అభిమన్యుని చంపటానికి ప్రధానపాత్రినాడు. ద్రోణుడు రణరంగంలో వున్నంతకాలం తమకు జయంకాదుగదా, చావు తప్పదు. అందుకని ఏనుగు నెపంగా అశ్వత్థామ చచ్చాడని ద్రోణుడు వినునట్లుగా అరిచాడు. తన ప్రాణం, ఏకైకపుత్రుడు అశ్వత్థామే నిజంగా మరణించాడని నమ్మి ద్రోణుడు అస్త్రసన్యాసం చేసి, ధ్యానసమాధిలో మునిగిపోయాడు. ఈ అదనుచూచుకొని ధృష్టద్యుమ్నుడు గొంతు కోసేశాడు. అన్యతమాడనని శపథం పట్టిన యుధిష్ఠిరుడు, తమ విజయంకోసం అబద్ధమాడి, తన కుటిలత్వాన్ని బైటబెట్టుకొన్నాడు.

ధర్మజుని కపటం ఇం కొకరూపంలో కూడా బైటపడుతుంది. మంచిమాటలతో, కల్లబొల్లిఏడ్పులతో గొంతులుకోస్తాడు. తన కార్యసాధనకొరకు, అపాయంనుండి తప్పించుకొనుటకు ఎన్ని నటనలనైనా చేస్తాడు. మొసలికన్నీళ్లు కారుస్తాడు. బాలుడని ఎరిగియుండి, ఎదుర్కొవలసిన మహావీరులు, యుద్ధనిపుణులు, ద్రోణ కర్ణులని తెలిసియుండి అభిమన్యకుమారుని అనునయమైన మోసం మాటలతో తండ్రిలేని సమయం చూసి, యుద్ధానికి ప్రేరేపించి రణరంగానికి పంపుతాడు. అతడు చనిపోగా, అర్జునుని కోపతాపాల కెక్కడ గురికావలసివస్తుందో అని కల్లబొల్లి ఏడ్పులు చాలా ఏడ్చాడు.

యుధిష్ఠిరుడు సహజంగా పిరికివాడు. నీతులు, ధర్మాలు ఇంటిపట్టున హాయిగా కూర్చొని చెప్పగలడేకాని, రణరంగంలో వెనుకప్రక్కనే ఉండినాడు. కర్మించాలక కర్ణుడు తటస్థపడి వీపుపగులగొట్టాడు. కుయ్యోమొర్రో అని పారిపోయి ఇంట్లో దాక్కొని అర్జునుడు రాగానే "నీవు నన్ను కర్ణునిచేత కొట్టిస్తావా, ఇంత చేతకానివానికి గాండీవ మెందుకు, తగులబెట్టరాదా" అని ఆక్రోశంతో తిట్టాడు. వీరుడైనవా డెప్పుడూ శత్రువుచేత

ఓడింపబడ్డా, అవమానాన్ని భరించుకుంటూ హుందాగా వుంటాడు గాని ఆడది మగని మీద విరుచుకుపడ్డట్లు, ఇం కొకనితో నీవు నన్ను కాపాడలేదని గగ్గోలు పెట్టడు. పాండవాభిమానులు ధర్మజుడు శౌర్యప్రతాపాలు కలవాడు కాడా, శల్యు నెట్లా చంపకల్గాడు, శల్యుడు కూడా వీరుడు, యుద్ధనిపుణుడేకదా అన వచ్చును. శల్యుడు వయస్సు మళ్లినవాడు. పైగా అంతకుము దెన్నిరోజుల నుండో యుద్ధంలో అలసట చెంది యున్నాడు. కర్ణసారథ్యం అతని ఆత్మగౌరవంమీద దెబ్బకొట్టింది. పైగా తా నిచ్చినమాటప్రకారం, కర్ణుని నిరుత్సాహపరచటంలో తన శాయశక్తుల నుపయోగించవలసివచ్చింది. సుక్షత్రియుడైన తాను సారథిగా, రథికుడగు కర్ణుని కించపరచటం, నిరుత్సాహ పరచటం, మనోసంక్షోభాన్ని కల్గించింది. ఈ పరిస్థితుల్లో శల్యుని శక్తి క్షీణించి యుండినది. ఇక యుధిష్ఠిరుడో తమ్ములమీద, సేనాధిపతులమీద కార్యం విడిచిపెట్టి, తా నింటిలో కల్లబొల్లి మాటలు చెప్పుతూ, ఒళ్లు ఏమాత్రం పులవకుండా యుండినాడు. ఇక తప్పదని బైలుదేరినా, ఎక్కడ చస్తానో అనే భయంతో అలసట చెంది యుండని తన శక్తినంతా కూడదీసికొని చావుదెబ్బ కొట్టాడు. అంతమాత్రాన అతడు మహావీరుడని గాని, శౌర్య ప్రతాపాలు కలవాడని గాని అనుకొనటాని కవకాశంలేదు.

పాండవపక్షపాతు లేమిచెప్పినా, మహాయోగి వేమనమాటలే నిజం. "పేరు ధర్మరాజు, పెను వేప విత్తయా" అన్న ఆయన వాక్కు తక్కువ సరిపోతుంది.

ఆత్మస్తుతి - పరనింద

తనగొప్పలు చెప్పుకోవటం ఆత్మస్తుతి. ఇతరులను వెధవ లనటం పరనింద. తనగొప్ప చెప్పుకోనిదే, ఇతరులను తక్కువగా చెప్పటం కుదరదు. ఇతరులు తక్కువ వారంటేగాని తన ఆధిక్యం

వెల్లడికాదు. అందువల్ల, తనను తాను శ్లాఘించుకొనేవాడు పొరుగువారిని నిందించక మానడు. కాబట్టి ఆత్మస్తుతికి, పరనిందకు అవినాభావ సంబంధ మున్నది, ఒక నాణానికి ఒక ప్రక్క బొమ్మ, రెండో ప్రక్క బొరుసు ఉన్నట్లు. ఈ రెంటిలో ఏది ఒకటున్నా దోషంక్రింద లెక్క. రెండూ ఉంటే మహాదోష మని చెప్పాలి.

తాను సాధించిన కార్యాలను, చేసిన మంచి పనులను, తన కుపద్రవం సంభవించినప్పుడు తప్పించుకొన్న చాకచక్యాన్ని, తన తెలివితేట లుపయోగించి పెద్దలను సంతోషపెట్టిన సమయాలను, పద్ధతులను, తన సాహిత్య, లలితకళాభిజ్ఞత, ఇతరుల ఆమోదాన్ని ఏ ప్రశంసావాక్యాలతోళ్ళ పొందినది సందర్భశుద్ధిగా ఇతరులతో చెప్పటం, తనజీవితాన్ని కొంతవరకైనా సార్థకం చేసుకొన్నాడని తృప్తిని వెలువరించటం ఆత్మస్తుతి కానేరదు. నే నన్ని చేశాను, ఇన్ని సాధించాను, గొప్పవాడను, నా క్రింద ఇతరులు జలాదూరు అనే అహం వెలిబుచ్చకపోతే ఆత్మస్తుతి అనలేము. మహాత్ములు కూడా తమ ధ్యేయాన్ని సాధించినప్పుడు సంతోషపడతారు. నిష్కామ కర్మతలుకూడా ఏ ఫలాపేక్ష లేకుండా తాము నమ్మిన కార్యాన్ని చేయగలిగామని తృప్తినొందటం ఆత్మస్తుతిక్రిందకు రాదు. పరనింద విషయంలో నింద వేరు, విమర్శ లేక లోపాలను ఎత్తిచూపటం వేరు. దుర్బుద్ధితో, అసహనంతో, కక్షతో సంగతి సందర్భం లేకుండా, ముందు వెనుకలు చూడకుండా వాడు వెధవ, వీడు నీచుడు, వాడు దొంగ, వీడు దుష్టుడు అని వాగటం తప్పకుండా నిందే. మంచి గుణాలను పేర్కొంటూ, తనకు తోచిన వేవో కొన్నిలోపాలను తెల్పటం నిందక్రిందకు రాదు. సుహృద్భావంతో తెల్పినవి, ముఖ్యంగా మిత్రులని ఎంచుకొనే వారి విషయంలో, వారి వివిధ సుగుణాలను ఏకరువుబెట్టునప్పుడు, ఈ సుగుణాలన్నీ వున్నవాడు, ఈ లోపంకూడా లేకుంటే ఇంకా బాగుంటుంది అనటం ఏవిధంగానూ నిందగా ఎంచ వీలులేదు. నింద పూర్తి నిందే. మిశ్రమనింద ఉండదు.

ఆత్మస్తుతి, పరనిందలలో ఆత్మస్తుతియే ఎక్కువ చెడ్డది. కోపతాపాలకు, దుస్సంఘటనలకు లోనైన మానవనైజం, నిందకు

పూనుకొంటుంది. తండ్రి తనయుని, తనయుడు తండ్రిని, అన్న దమ్ములలోను, అక్క-చెల్లెళ్లలోను ఒకరి నొకరిని నిందించుకొనటం జరుగుతునే వుంటుంది. కర్ణునిచే అవమానింపబడిన ధర్మజుడు అర్జునునివీరోచిత విరుచుకుపడి దుర్భాష లాడలేదా? ఆ సందర్భంలో ధర్మస్వరూపు డని నమ్మి, భక్తి తాత్పర్యాలతో సేవించే యుధిష్ఠిరుని, అర్జునుడు తెగటార్చటానికి సంసిద్ధుడు కాలేదా? పైగా, అభిమన్యుని చావుకు కారకు డైనాడని నిందించలేదా? కాబట్టి మానవ బలహీనతలను బట్టి కోపావేశాల్లో తొందరపాటున నింద లేక నిష్ఠురం పెల్లుబకవచ్చును. అయితే ఆత్మస్తుతిపరుడు అనవసరంగా, అకారణంగా తన గొప్ప చెప్పుకొనే సందర్భంలో ఇతరులను దూషించటం, తప్పకుండా తప్పే. పోతే, ఆత్మస్తుతి మానవసహజమైనది కాదు. ఇది అందరకు కల్గే వ్యాధి కాదు. ప్రత్యేక వ్యక్తులు ఈ చెడ్డపద్ధతికి అలవా టౌతారు. ఆత్మస్తుతిని వినేవారి కది దుర్గంధంగా, సహింపరానిదిగా వికారం కల్గిస్తుంది. కడుపునిండా చెడుగాలు లున్నవారుగాని, ఈ కంపును వెళ్లగ్రక్కరని తోస్తుంది. ఆత్మస్తుతిపరులకు ఆత్మవిశ్వాసం లేదని చెప్పాలి. సరుకులేని కాళీ డబ్బావంటివారు. తమ స్థాయిమీద నమ్మకంలేని పిరికితనంతో దానిని కప్పిపుచ్చటానికి ఆ కాళీ డబ్బాను నిరంతరం వాయించుకుంటుంటారు.

తాను గొప్పవాడ నని నమ్మి, ఆ నమ్మకంలో తాను చేసిన ఘనకార్యాలు చెప్పుకొన్నా, ఇతరులను దూషించనివా రుంటారు. తన కన్యాయం జరిగితే కోపోద్రేకంచేత ఫలానావాడు చెడ్డవాడు, ద్రోహి, వగైరా అని నిందించినా, నే నింతవాణ్ణి, అంతవాణ్ణి అని ప్రగల్భాలు పలుకనివా రుంటారు. అట్టివారి విషయం ఇందులో ప్రస్తావనకు రాదు. అసలైన ఆత్మస్తుతిపరుణ్ణి, సిసలైన పరనిందకుణ్ణి గురించి మాత్రమే చెప్పుచున్నాను.

నరసింహారావు కొంత పేరుపొందిన డాక్టరు. కొంత డబ్బు సంపాదించాడు. నెలసరి రాబడి మధ్యరకంగా బాగానే వున్నది. తండ్రి కష్టపడి తనకు వైద్యవిద్య చెప్పించాడు. కాని, డబ్బేమీ మిగల్చలేదు. తండ్రి వెంకయ్య చాలా బీదకుటుంబంలోనివాడు.

ఆయన తండ్రి ఆయనకు యుక్తవయస్సు వచ్చేటప్పటికి పాక ఇల్లొకటి మాత్రం వదలి పరలోకాని కేగాడు. ఇంట్లో బియ్యం, పప్పు, వుప్పు వగైరా చిల్లరసామానులు ఏ కొద్దో ఉండినవి. వెంకయ్యంతగా చదువుకొనకపోయినా, ఇంగ్లీషు ముక్కలు నేర్చుకొనకపోయినా సహజంగా తెలివితేటలు కలవాడు. చాకచక్యం, దక్షతకలవాడు. లెక్కాడొక్కా తెలిసినవాడు, మంచిమాటలతో కుయుక్తి పన్నాగాలతో ఎదుటివారిని బోల్తాకొట్టించే సామర్థ్యం కలవాడు. తండ్రిపోయిన క్రొత్తలో, ఎటుచూచినా దిక్కు కన్పడక, తమ వీధిలో వున్న ప్లీడరు నాశ్రయించి అతని వద్ద గుమాస్తాగిరి చేద్దామా అనుకొన్నాడు. కాని సామాన్య రాబడి గల ఆ కొద్దిపాటి ప్లీడరు ఇచ్చేది తన కుటుంబానికి చాలదు. పైగా అణగి మణగి అడ్డమైన చాకిరీ చేయాలి. ఆయన కక్షిదారులను మెహర్బాని చేసి, నాలుగు డబ్బులాయనకు సంపాదించిపెట్టకంటె, తనే సలహాలిచ్చి వాళ్లను కోర్టుకు తీసుకొనిపోతే ప్లీడరు గుమాస్తాకి వచ్చే జీతంకంటె ఎక్కువే ముట్టుతుంది అని ఆలోచించి, చెట్టు క్రింద ప్లీడరైనాడు. మంచిమాటలతో చేరదీసి, హుషారు కలిగే సలహా లిచ్చి, కల్లబొల్లి మాటలతో, రెండోవైపు కక్షిదార్ల నిరసనతో, ధైర్యం నూరిపోసి, తగాదా చావకుండా, కక్షిదారు నిస్పృహ చెందకుండా కేసులను కొనసాగించి సాధ్యమైనంత వరకు రాబట్టుకొనేవాడు. తన కుటుంబం సుఖజీవనం చేయటానికి, తన పెద్దకొడుకు నరసింహారావు చదువు కొనసాగి ఆయన డాక్టరవటానికి తగినంత డబ్బు సంపాదించటమే కాకుండా త నిద్దరు ఆడపిల్లలకు గౌరవంగా పెళ్లి, పేరంటాలు జరిపించాడు. పాక ఇల్లూడదీసి పెంకు టిల్లు వేయించుకొన్నాడు. ఇంతలో కాలం క్రొనుకు రాగా దేహాన్ని విడిచిపెట్టాడు.

డాక్టరు నరసింహారావు తండ్రి చనిపోవకముందు ప్రాక్టీసు నారంభించి నిలద్రొక్కుకునే స్థితికి వచ్చాడు. కష్టపడి, వచ్చిన దానిలో పొదుపుచేసుకొని, తమ్ముని చదువును కొనసాగిస్తూ జీవితంలో పుంజుకొన్నాడు. స్థిమితపడినంతనే మేనమామ కూతురుని వివాహమాడి గృహస్థుడైనాడు. ఈ స్తవాసి మంచిదని, వైద్యం

శ్రద్ధగా చేస్తాడని, రోగులను మర్యాదగా పలుకరించి వారి బాధలను తెలుసుకొంటాడని కొంత పేరు వచ్చింది. అయినా అతడు సామాన్య యమ్. బి. బి. యస్. డాక్టరు. ఆ చిన్న పానులో యమ్. డి. లు, యమ్. యస్. లున్నారు. విదేశాలకు వెళ్లి డిగ్రీలు సంపాదించుకొన్న డాక్టరు లున్నారు. ఆ డిగ్రీల మోజు చూచి ధనవంతులు, పెద్ద ఉద్యోగస్థులు వాళ్లవద్దకే వెళ్తారు. తన వద్దకు రారు. తనది మధ్యరకం ప్రాక్టీసు మాత్రమే. కాలం దొర్లిపోతుంటే పిల్లా జెల్లా కల్గారు. వాళ్లు పెరుగుచున్నారు. తిండితోబాటు బట్టలు, చదువు ఖర్చులు పెరిగిపోతున్నా తన సంపాదన ఖర్చుకు తగినట్లుగా పెరగటం లేదు. జీవితం కొంత భార మనిపిస్తున్నది. తాను కొన్ని సంవత్సరాలుగా ప్రాక్టీసుచేస్తున్నాడు. తన హస్తవాసి మంచిదని, రోగుల కష్టసుఖాలను శ్రద్ధగా కని వింటాడని కొంత పేరు వచ్చింది. అయినా, తనకు ప్రాక్టీసు పెరగటం లేదు. ఈమధ్యనే బల్లకట్టిన డాక్టర్లకు కూడా రోజురోజుకూ రోగులు రావటం ఎక్కువౌతున్నది. వాళ్లకు నా డిగ్రీకంటె పెద్ద డిగ్రీ లున్నాయని కదా! అనుభవం, హస్తవాసి, మాటమంచి పనికిరాకుండా పోతున్నవి ఈ డిగ్రీల డాబుక్రింద. డాక్టరు నరసింహారావుకు కోపం కల్గింది. రోషం పెరిగింది. అసూయ విజృంభించింది.

ఇక చేతులు ముడుచుకొని కూర్చుంటే లాభంలేదు. ప్రచారం మొదలుపెట్టాలి. నేను మంచి డాక్టరు నని, నా హస్తవాసి మంచిదని, రోగుల నాదరించి శ్రద్ధతో వైద్యంచేస్తానని పదిమందికి తెలియజేయాలి. వాళ్లు మాత్రం తాము పెద్దడాక్టర్లమని, పెద్దపెద్ద బోర్డులు వేసుకొని టాం, టాం వేసుకొనటంలా! ఇంకొక ఆలోచన వచ్చింది. తన గొప్పతనం చెప్పుకొన్నంత మాత్రాన చాలదు. ఆ పెద్ద డిగ్రీలవాళ్లని నిరసించాలి. వాళ్ల కనుభవం చాలదు, హస్తవాసి మంచిదికాదు, ఫలానా డాక్టరు ట్రీటుచేసిన రోగులు చనిపోయారు, ఫలానా డాక్టరు మందిచ్చిన రోగులు తేలుకొననేలేదు, ఫలానా డాక్టరు వ్యాధినిర్ణయం తప్పుడుగా చేసి ఏవో ఖరీదుగల మందులు వ్రాసి యిస్తే, మందులు పనిచేయక

పోవట మేగాక మందులు తీసుకొన్నవాళ్లు మంచానపడ్డారు, ఈ డాక్టర్లు డాబు డీబులే గాని వైద్యం సరిగా చేయరు, చేయలేరు, పైగా రోగులను మర్యాదగా చూడరు, రోగి ఆత్రుతనుబట్టి ఆ వంకా ఈ వంకా బెట్టి డబ్బు బాగా గుంజుకుంటారు, ఘరానా డాక్టరు నని చెప్పుకునే ఫలానా అతడు మరీ ఘోరం, శస్త్రచికిత్స చేయాలని ఆపరేషన్ బల్లమీద పడుకోబెట్టి ఏదో అటూ ఇటూ కెలికి, ఇంత డబ్బిస్తేనేగాని ఆపరేషన్ పూర్తిచేయనని అప్పటి కప్పుడు డబ్బు లాగుతాడు—ఇటువంటి వన్నీ బైటబెట్టాలి. వాళ్ల చేతకానితనం, వాళ్ల డబ్బు దురాశ, వాళ్ల దురహంకారం లోకానికి చాటాలి అని నిశ్చయించుకొన్నాడు. డాక్టరు నరసింహా రావు అనుకొనిన సంగతుల్లో కొంతవరకైనా నిజమున్నమాట వాస్తవమే. తాము నిపుణుల మని, స్పెషలిస్టుల మని, విదేశాలకు వెళ్లి గొప్ప అనుభవం, నేర్పు సంపాదించుకొని వచ్చా మని చెప్పుకొనే డాక్టర్లు కొందరు తమ పవిత్ర వైద్యధర్మాన్ని మరచి తప్పుడు పద్ధతులకు, ధనసంపాదనకు అలవాటైనమాట నిజమే. రోగులను అమర్యాదగా కసరి, దిగులుతోవున్నవారికి మరింత వ్యథను కలిగించటం కూడా వున్నది. అయితే, డాక్టరు నరసింహా రావు కామెర్లు వచ్చినవాడో, రంగు కళ్లద్దాలు పెట్టుకొన్నవాడో అయ్యాడు.

తన కిష్టులైన బంధువు లున్నారు. తన నాశ్రయించి యుండిన ప్రాతరోగు లున్నారు. వాళ్లకు ఏవో ఆశలుపెట్టి, వాళ్ల నుపయోగించుకొన్నాడు. వాళ్లచేత ప్రచారం కొన సాగించాడు. మావాడు చాలా అనుభవం కలవాడు, బీదసాద లైన రోగులకు స్వల్ప ఫీజుతో, ఒక్కొక్కప్పుడు డబ్బేమీ పుచ్చు కొనకుండా వైద్యంచేస్తాడు, అతని హస్తవాసి మహా దొడ్డది, ఏ కేసు పట్టినా రహితంకానిది లేదు, అందువల్ల రోగు లందరూ అయన్ని దేవుణ్ణిగా చూస్తారు వగైరాలతో బంధువులు ప్రచారం చేశారు. ప్రాతరోగులు "అబ్బో ఆయనే, బంగారం. దేవుడంటివాడు. మా కెంత శ్రద్ధగా వైద్యంచేసి సులువుగా నయంచేశాడు. పైగా మే మిచ్చినంత మాత్రమే పుచ్చుకొన్నాడు గాని అంతివ్వండి,

ఇం తివ్వండని అడిగాడా, ఇచ్చింది చాలదని రుసరుస లాడాడా, డాక్టరంటే ఆయన్నే చెప్పుకోవాలి'' అని చాటించారు. అంతటితో ఊరుకొంటే తప్పుపట్టవలసింది లేదు. ''ఇదిగో చూడండి, ఈమధ్య మా బంధువు లొకరు, అదుగో పెద్దపెద్ద డిగ్రీ లున్నాయని బల్లకట్టుకొన్నాడే ఆయన వైద్యం కొరకు వెళ్లాడు. వట్టి మందులు చాలవు, శస్త్రచికిత్స చేయా లన్నాడు. మావాడు భాగ్యవంతుడు. పెద్దడాక్టరు సలహా యిస్తే వద్దంటాడా? తనకు కావలిసింది తన వ్యాధి రహిత మవటమేకదా! తీరా చికిత్సచేయించుకొంటే నయం కానేలేదు. ఇంకా బాధపడుతునే వున్నాడు. డబ్బుమట్టుకు సంచులు ఖాళీ అయ్యాయి. ఇం కొకటి, నాకు తెలిసిన మా వూరి వా రొక రున్నారు. ఆయన భూవసతి బాగా వున్నవాడు. ఆయన కేదో వ్యాధట. 'డాక్టరు నరసింహారావు ఘటికుడు, ఆయన వైద్యం చేయించుకో'మంటే, 'నా వ్యాధికి ఆయన చాలడు, విదేశాలకు వెళ్లి నిపుణత సంపాదించుకు వచ్చిన ఆ డాక్టరువద్దకు వెళ్తా' నని వెళ్లాడు. ఎన్ని నెలలనుండో మందు పుచ్చుకొంటున్నాడు. రకరకాల మందులు వాడుచున్నాడు. ఇంతవరకు నయంకాలేదు. పైగా, ఈ డాక్టర్లు డాబు కోసం ఎంతెంత ఖరీదు మందులో వ్రాసి యిస్తారు. ఫీజు జాస్తిగానే పుచ్చుకొంటారు. ఆ, చెప్పటం మరచిపోయాను. ఈమధ్య ఎవరో చెప్పారు. పొరుగూరి షాహుకారు కొడుక్కు జబ్బుచేస్తే, డబ్బున్నదికదా అని పెద్దడిగ్రీ లున్న ఒక డాక్టరు వద్దకు తీసుకొనివెళ్లాడట. వారం రోజులు తిరుగకుండానే బల్లమీదున్న కుర్రాడు బల్లమీదనే హరీ అన్నాడు.'' ఈవిధంగా ఇతరడాక్టర్లను నిరసిస్తూ ప్రచారంసాగింది.

ప్రచారం బొత్తిగా వాళ్లమీద విడిచిపెడితే ఎలా అని డాక్టరు నరసింహారావు తానుకూడా పూనుకొన్నాడు. తనవద్దకు వచ్చిన రోగులతోనే గాక, తనను చూడవచ్చిన స్నేహితులు, పరిచయులు, వారితోవచ్చిన వారితో, ''ఓ చూడండి, ఈమధ్య ఎన్నిగడుసు కేసులు నయంచేశా ననుకొన్నారూ. పాపం, ఒకతణ్ణి ప్రాణం పోతుండగా తీసుకొనివచ్చారు. అరగంటలో ఇక ఘరవాలేదనిపించాను. వారం రోజుల్లో పూర్తిగా నయమయి, నవ్వుకుంటూ

ఇంటికి వెళ్లిపోయాడు. ఈమధ్య ఒకాయన, 'డాక్టరుగారూ, ఈ ఊళ్లో డాక్టర్లం అని డాబేవా రందరికి చూపించాను. ఏవో మందులు వాడాను. వాళ్లు వట్టి బూటకంవాళ్లుగా వున్నారు. డబ్బు ఖర్చైందిగాని, నా రోగం మిగిలే వున్నది. ఈమధ్య నాకు తెలిసినతడు కనబడి మీ సంగతి చెప్పి మీ హస్తవాసి మంచిదని, మీ వద్దకు వెళ్లమన్నాడు' అని దీనంగా చెప్పుకొన్నాడు. ధైర్యంచెప్పి, వారంపదిరోజుల్లో బాగుచేశాను. ఈ పెద్ద పెద్ద డిగ్రీలున్నవాళ్లున్నారే, వాళ్లకు డాబులేగాని అనుభవం తక్కువ. వాళ్లక్లబ్బులేమో, జలసాలేమో! రోగులను శ్రద్ధగా చూడటానికి వాళ్లకు టైమెక్కడేడ్చింది? పైగా హస్తవాసి మంచిదికాదు. డబ్బు వందలు గుంజుకుంటారుగాని మర్యాదగా కూడా చూడరు. ఎంత చెప్పినా నా అనుభవం వాళ్లకెందుకు వస్తుందండీ. నే నేకేసు పట్టినా ఇంతలో రహితం అవుతుంది. నా హస్తం అమృతహస్తమని ఊరకనే పేరువచ్చిందా? ఈమధ్య ఏవిధంగా వైద్యం చేస్తే రోగులకు సులువుగా నయమౌతుందో, ఏ యే రోగి కేవిధంగా చికిత్స చేయాలో వగైరా వ్రాసి, మెడికల్ జర్నల్‌కు పంపాను. డబ్బుసంపాద నెట్లున్నా, నా పేరు కీర్తులు పెరిగిపోవటండీ. వాళ్లకు డబ్బొస్తుందేమోగాని, ఛస్తేమాత్రం మంచిపేరు వస్తుందండీ. డబ్బు లెక్కేమిటండీ, వెధవ డబ్బు, సాని సంపాదిస్తుంది" అని డబ్బావాయించుకున్నాడు. తోటి డాక్టర్లను నిరసించాడు డాక్టరు నరసింహారావు.

దీనినే మనపెద్దలు ఆత్మస్తుతి, పరనింద అన్నారు. పాత కాల జాబితాలో చేర్చారు.

౯

రక్తి - విరక్తి

రక్తి కట్టింది, విరక్తి కల్గింది. మనస్సు లగ్నమైంది, మనస్సు వికలమైంది. సంతోషం కల్గినది, ఏహ్యం ఆవరించుకొంది. మొదటిది కన్నులకు, చెవులకు పండుగచేసింది. రెండోది మనస్సుకు,

బుద్ధికి అసహ్యం పుట్టించింది. రెండూ హృదయ సంబంధ మైనవే. భిన్నభిన్న ప్రవృత్తులు, స్వరూపాలు. ఒకటి లలితకళలకు సంబంధించినది, రెండోది వ్యక్తుల విషయమైనది.

పనిలేని కాలంగదా రెండు మూడు రోజులు సినిమా చూచివద్దా మని పట్నంవెళ్లాను. చదువని నేను కొద్దో గొప్పో వెలగబెట్టిన రోజుల్లో స్నేహితుడైన రామారావు కన్పించాడు. అతడు కూడా ఇంటివద్ద ఏమీ తోచ కిటు వచ్చాడట. మే మిద్దరం కలిసివెళ్లి ఒక హోటల్‌లో దిగాం. సాయంత్రం మాంచి సంగీత కచేరి ఉందంటే సాయంత్రం అక్కడకు చేరాం. గాయకురాలిని చూడటంతోనే ఆకర్షించింది. ఆమె రాగాలాపన ప్రారంభించిన తోడనే హృదయం రంజిల్లింది. కృతులు, కీర్తనలు, సంకీర్తనలు పూర్తిఅయ్యేటప్పటికి నేను మైమరచాను. శ్రోత లందరు ముగ్ధులై హర్షధ్వానాలు చేశారు. బైటికి వెళ్లుచు, ఎంత శ్రావ్యగానం, ఏమా గాత్రమాధుర్యం, కచేరి బలే రక్తికట్టిం దని పొగడుచూ బైటికి నడిచారు.

మర్నాడుదయం మ్యూజియంలో మంచి చిత్రపటాలు, గొప్ప శిల్పాలున్న వంటున్నారు, వెళ్లి చూచివద్దాం అని బైలుదేరి వెళ్లాం. ముఖద్వారం ప్రక్కనే కొన్ని శిల్పా లమర్చబడి ఉన్నాయి. బాగున్నవిరా అనుకుంటూ లోపలికి వెళ్లాం. ఒహో, ఎన్నెన్ని రమ్యమైన పటాలు, ఎంత సొగసైన బొమ్మలు కళ్లు జిగేలు మనే రంగులు, అవయవ పొందికలతో, సుందరవదనాలతో, లావణ్యసంపదతో మనస్సు నుప్పొంగించే, ఉత్తేజపరచే చిత్ర లేఖనా లెన్నివున్నాయి! కొన్ని రంగుల కలయిక ప్రాముఖ్యంగల చిత్రాలు చప్పన అర్థంకాకపోయినా, ఎంత తేజోవంతంగా వున్నవి! ఇక శిల్పాల సంగతి చెప్ప నక్కరయే లేదు. చలువ రాతిలో చెక్కిన బొమ్మలు, నల్లరాతిలో, ఎర్రరాతిలో (యిసుక రాలు) మలచిన విగ్రహాలు, ఎంత అద్భుతంగా వున్నవి! కొన్ని విగ్రహాలను చూస్తే కౌగిలించుకొనాలని బుద్ధిపుడుతుంది. కొన్ని టిని ముద్దుపెట్టుకొనా లనిపిస్తుంది. కొన్నిటికి ప్రణామం చేయాలనే

భక్తిభావం పుట్టుకువస్తుంది. ఆహా, ఈ చెక్కటం నైపుణ్యం! సజీవాలుగా చేసిన శిల్పి భావనాబలం ఎంత గొప్పగా ఉన్నది! కొన్ని దారువుతో చేసిన బొమ్మలున్నవి. మనుష్యాకారంలోనే గాక చెట్లు, పశువులు, మృగాల రూపంలో సృజింపబడిన వున్నవి. చేతి నైపుణ్యమేగాక, భావనాబలసంపద లేనిదే, రసజ్ఞుడు కానిదే ఈవిధంగా శిల్పి రూపొందించకలడా! ఒకప్రక్క రత్నకంబళులు, రంగు రంగుల ప్రాచీన దుస్తు లున్నవి. ఎంత మనోహరంగా వున్నవి! ఈ మ్యూజియం ఎంత అభిరుచిని కల్గించింది, ఎంత రక్తి నిచ్చిం దని మే మిద్దరం ఉల్లసిస్తూ మా హోటలుకు దారితీశాం.

సాయంత్రం 5½ గంటలైంది. "ఆ సినిమా హాలులో మాంచి సినిమా చూపిస్తున్నారట" అని రామారా వనగా "ఇంకేం వెళ్దా"మని బైలుదేరాం. చేరుకునేటప్పటికి జనం మూగివున్నారు. ఎలాగో నేను కిటికీకి చేరుకుని రెండు టిక్కెట్లు కొన్నాను. లోపలికి వెళ్లి సావకాశంగా కూర్చున్న పావుగంటకు సినిమా మొదలైంది. ఇం కొక పావుగంటకు చూడదలచుకొన్న చిత్ర మారంభమైంది. సాగుతున్నకొద్దీ ఎన్నెన్ని దృశ్యాలు, ఎన్నెన్ని తళుకుబెళుకులు, ఎంత రమ్యమైన సన్నివేశాలు! హృదయాన్ని కదిలించే సంఘటనలు, ఎంతో హాయిని గొల్పే పాటలు, చాతుర్య వంతమైన సంభాషణలు. స్త్రీ పురుష నటకు లెంతో చాకచక్యంగా, సమర్థవంతంగా సన్నివేశాలకు సంఘటనలకు తగినట్లు నటించారు. సినిమా చాలా బాగున్నది. మిక్కిలి రక్తికట్టించింది అనుకుంటూ హోటలుకు చేరాం.

ఆ మరుసటి రోజు అటూ ఇటూ తిరిగి సాయంత్రానికి ప్రసిద్ధి కెక్కిన ఫలానా నాట్యకత్తె నృత్యం అట, తప్పకుండా చూడవలసిందే అని బైలుదేరాం. సినిమాహాలు ముంద రున్నంత రకరకాలజనం లేరు గాని ఎక్కువమందే కన్పించారు. నర్తకి వయస్సులో నున్న యువతి. అందచందాలు, అవయవపొందిక లున్నామె. నా కెందుకో ముందు నాట్యంచేసే ఆమె నచ్చాలి. ఆమె బాగాలేకపోయినా, వయస్సురానిదైనా నృత్యం రక్తికట్టదని నా భావం. మరీ చిన్నపిల్లలు రంగస్థలంపైకి వచ్చి 'మధురా

నగరిలో' వంటి మోహా సంబంధమైన పాటలు, చేతులు త్రిప్పు కుంటూ పాడుతుంటే అసహ్యం వేస్తుంది. సందర్భానుసారంగా పాత్ర ఉండాలికదా! సరే, రామారావు, నేను ఆమె మంజుల నృత్యభంగిమలలో, వయ్యారపు నడకలలో, రమ్యమైన అభినయం లో, రంజింపజేసే హస్త పదవిన్యాసములలో, ఆమె చిరునవ్వుతో కులికే వదన కవళికలలో ఆనందసాగరంలో మునిగినట్లు మునిగి పోయా మంటే నమ్మండి. ఆమె భామకలాపం, మండూకశబ్దం, చివరకు పామునృత్యం మమ్మలను మిక్కిలి ముగ్ధులను చేసింది. ఎంత బాగా నృత్తం, నృత్యం చేశా రామె! ఎంత ముద్దులు గురిపించారు! వంతలు కూడా చాలా చక్కగా సహకరించారు. ఎంత రక్తికల్గించిం దీ నృత్యకళాస్రవంతి అని సంతోషిస్తూ బైటకు వచ్చివేశాం.

ఇన్ని చూశాంకదా, ఇక మిగిలింది నాటకం చూడాలని ఉబలాటపడ్డాం. విచారించగా ఫలానా హాలులో ఈ రాత్రి ఫలానావారి నాటక మున్నది, నటకులు బాగా పాడేవారు, నటించే వారు, పైగా స్త్రీ పాత్రను ప్రసిద్ధినొందిన ఫలానా తార ధరిస్తుంది అని తెలిసింది. ఇంకేం అని, మరునాడు రాత్రి పెందల కడనే ఆ హాలుకు చేరుకొన్నాం. హాలు క్రిక్కిరిసి వుంది. కొంత ఆలస్యంగానైనా ఆట ప్రారంభమైంది. మామూలు పాత్రధారుని ఉపోద్ఘాతం (నాంది) వగైరా అయిపోయాయి. కథానాయకుడు ఎలుగెత్తి పాడుచు, రంగస్థలం ప్రవేశించాడు. పద్యాన్ని చాలా హాయిగా పాడాడు. వేషం ఆకర్షణీయంగా వున్నది. నటన కూడా బాగున్నది. కథ సాగింది. రకరకాల నటకులు వచ్చారు. దృశ్యాలు (సీన్లు) జరిగిపోయాయి. నాయిక ప్రవేశించింది. ఆమె వేషధారణ పాత్రకు మిక్కిలి తగినట్లున్నది. ఆమె హావ భావ విలాసాలు ఆకర్షణీయంగా వున్నవి. మిక్కిలి నేర్పుగా తనపాత్రను నటించింది, హాయిగా పాడింది. చిరునవ్వులు చిందించింది. సందర్భానుసారంగా కతినోక్తు లాడింది. కన్నీళ్లు పెట్టుకొంది. ఒకసందర్భంలో శోకమూర్తి అయింది. ఇతర నటకులు కూడా సమయానుకూలంగా నటించారు. ఎట్టకేలకు ప్రేక్షకుల

హర్షధ్వానాలతో నాటకం ముగిసింది. ఎంత బాగున్నది! నాయికా నాయకు లెంతచక్కగా నటించారు! ఎంత హాయిగా పాడారు. ఇతరులు కూడా సముచితంగానే పాడారు, నటన చేశారు. మొత్తంమీద భలే రక్తికట్టింది నాటకం అనుకుంటూ బైటికి నడిచాం.

మా వూరు వెంకట్రావు ఇంచుమించు నా వయస్సువాడే. మేము ప్రక్కప్రక్క ఇంటివాళ్లం. చిన్నప్పటినుండి ఒకరి నొకరి నెరుగుదుం. మా పొలాలు, వాళ్లపొలాలు దగ్గరదగ్గర. మరిన్ని కొన్నికొన్ని ప్రక్కప్రక్కనే. మాకూ వాళ్ళకు సరిహద్దుగట్లు చాలా వున్నాయి. చదువుమీద శ్రద్ధలేక హైస్కూళ్లుతోనే చదువు మానివేశాం. మా తండ్రు లున్నంతకాలం కొద్దీ గొప్పా వ్యవసాయంలో వారికి తోడ్పడ్డాం. అప్పు డప్పుడు సినిమాల కని, నాటకాల కని అనతిదూరంలో వున్న చిన్న పట్టణాలకు వెళ్లి కొంత కాలక్షేపం చేసినా, మొత్తంమీద ఏ పిచ్చిపనుల్లోకి దిగలేదు. కాల మొకరీతిగా ఉంటుందా? మా తండ్రులు ఒకరి తర్వాత మరొకరు కాలగర్భంలో కలసిపోయారు. వెంకట్రావుకు, నాకు పిల్ల జెల్లలు కల్గారు. కొలది సంవత్సరాలు మా జీవితాలు ఏ ఎగుడు, దిగుడు లేకుండా సాగాయి. నేను ఇల్లు కనిపెట్టుకొని వ్యవసాయం చూచుకొంటూ కాలం గడుపుతున్నాను. వెంకట్రావు తండ్రి చనిపోయిన తర్వాత మూడు నాలుగు సంవత్సరాలు సవ్యంగానే వుంటూ వచ్చాడు. నిత్యం ఎప్పుడో ఒకప్పుడు మేము కలుసుకుంటూ వుండేవాళ్లం. ఈ మూడు నాలుగు సంవత్సరాలలో మా స్నేహం మరింత గాఢమైంది. ఒకరి కొకరు సాయంచేసుకొంటూ తోడుగా వుండే వాళ్లం. తర్వాత మొదట ఒకటి రెండు రోజులు, తర్వాత వారాలు కనబడేవాడు కాదు. ఫలానా పనిమీద ఫలానా చోటికి వెళ్తున్నానని, వెళ్లానని ఇదివరలో చెప్పినట్లు చెప్పేవాడు కాడు. కనబడినప్పు డడిగితే ఏవో సాకులు చెప్పేవాడు. క్రమేపి మొగం తప్పించేవాడు. ముక్తసరి, ముభావం అతనిలో కొట్టవచ్చినట్లు కనబడేది. నాలో కొంత ఆశ్చర్యం,

బాధ కల్గాయి. రోజులు గడచినకొద్దీ మనిషి రూపంలో కూడా మార్పు కనబడింది. ఆలోచనలో పడ్డాను. మా వూళ్లోనే ఒక రిద్దరు చెడు అలవాట్లకు లోనైనవా రున్నారని నాకు చూచా యగా తెలుసును. ఒకనా డటు ప్రక్కకు వెళ్లి ఆరాతీయగా వాళ్లు, వెంకట్రావు కలసి తిరుగుచున్నారని తెలిసింది. ఇంకేం, ఏవో చెడ్డ అలవాట్లు ఇతనికి కూడా పట్టుబడ్డాయి అనుకొని, నాకు బాగా తెలిసిన దగ్గ రింటివాణ్ణి అడుగగా "ఫలానా వాళ్లు జూద గాళ్లు, క్రౌగుబోతులు, ముండల ముఠాకోర్లు అని నీకు తెలియదా? మీవాడు వాళ్లలో కలిశాడు. ఈమధ్య మూడుముక్కలా టని మొదలుపెట్టి వీళ్లని, వాళ్లని మోసగిస్తున్నాడట. పైగా కరెన్సీ నోట్లు రెట్టింపుచేస్తా మని, అది మీ కిస్తామని పైన క్రింద కొన్ని మంచినోట్లు పెట్టి మధ్య కాగితం ముక్కలు పెట్టి డబ్బు తీసుకొని దొంగకట్టలను ఇస్తున్నారట. ఈ ముఠాలో ఒకడు పోలీసు వేషం వేసుకొని హఠాత్తుగా వచ్చినట్లు వచ్చి డబాయించగా, డబ్బు తీసుకొన్న మోసగాళ్లు, దొంగకట్టలను తీసుకొని సిసలైన డబ్బిచ్చిన అమాయకులు చెల్లాచెదరైపోతారట. మన వూళ్లో మొదట వాళ్లు మాత్రమే. కొంతకాలంనుండి నీ స్నేహితుడు వెంకట్రావు కూడా ఆ మోసగాళ్ల ముఠాలో చేరాడట. ఇంకేం క్రౌగుడు, జూదం, ముండలు అలవా టయ్యాయి. వీళ్లు ఇతర దొంగతనాలుకూడా చేస్తున్నా రేమో అని నా అనుమానం" అని

చెప్పాడు. నా కెంతో వ్యథ కల్గింది. కొంచెమో గొప్పో ఉన్న వాడు, సలక్షణంగా సంసారం గడుపుకొనుచుండిన వాడు ఈ విధంగా చెడిపోవట మేమిటా అని బాధతో ఆ రాత్రి సరిగా నిద్ర పోనేలేదు. రెండు మూడు రోజులకు వెంకట్రావు మాట వినపడి అతని ఇంట్లోకి వెళ్లి "ఇది ఏం బుద్ధిరా, ఇటువంటి పనులు చేయటానికి నీ మన స్సెట్లొప్పింది? ఇల్లు, ఒళ్లు పాడుచేసు కొంటావా, జైలుకు పోవాలని ఉందా" అని గట్టిగా చివాట్లు పెట్టాను. మొదట మాట్లాడకపోయినా, తలెత్తి చురచుర చూస్తూ "నీకెందు కోయి నావూసులు. నాబ్రతుకు నేను నా కిష్టం వచ్చినట్లు

బ్రతుకుతాను. నా బ్రతుకు పద్ధతి కూడా నీవే నిర్ణయిస్తావా? నీ కెవ రిచ్చా రీ అధికారం" అని తిరగబడ్డాడు. సౌమ్యంగా మాట్లాడకపోతే భ్రమించుతుం దని, "అదికాదురా వెంకట్రావు, నేను స్నేహితుణ్ణి గనుక చెప్పుతున్నాను. మనవంటి మంచికుటుంబం లోని వైతులం, ఇంత వున్నవాళ్ళం, పిల్లాజెల్లాతో సుఖసంసారం చేసుకొంటున్నవాళ్లం ఇట్టి పనులుచేస్తే అపకీర్తిపాలైపోమా? పైగా ఇల్లు గుల్లకాదా? ఒళ్లు చెడిపోదా" అని నేను చెప్పిన సముదాయింపు మాటలు అతని చెవి కెక్కలేదు. కోపం, క్రోధం పెల్లుబ్బినవేకాని తగ్గలేదు. వాని నిర్లక్ష్యం, వ్యతిరేకభావం, చిటమటలు చూచి, నా మనస్సు వికలమైంది. ఇకిప్పు డేమి చెప్పినా లాభంలేదని నా యింటికి వచ్చేశాను. స్నేహితుడు కదా, పాడైపోతుంటే చూస్తూ వూరుకుంటే ఎట్లా అని, తిరిగి ఒకటి రెండు సార్లు చెప్పి చూశాను. లాభం లేకపోయింది. పైగా నామీద ఉగ్రుడౌతూ, "నా జోలి నీ కెందు" కని చీదరించాడు. అంతటితో ఛీ ఈ వెధవతో జోక్యంపెట్టుకోవటమే తప్పని ఆవంక చూడటమే మానివేశాను. ఎప్పుడైనా తటస్థపడ్డా అతడు తలవంచుకొని పోయేవాడు. నేను పలకరించేవాడను కాదు.

ఇ దిట్లుండగా, వ్యవసాయంపనులు వచ్చాయి. సాగు చున్నాయి. ఇతర పొలాల సంగతి చూచుకొని వెంకట్రావు మా సరిహద్దు పొలాలకు వెళ్లగా, మా సరిహద్దుగట్లు అతనిప్రక్క నరికి మా ప్రక్కకు వేసివున్నాయి. నౌకరుని పిలిచి ఇదేమి టనగా, "వెంట్రావుగారు దగ్గరుండి ఈపని చేయించారు. మేము వద్దంటున్నా వినిపించుకోలేదు. మేము పనుండి ఆ ప్రక్కపొలాలకు వెళ్లాం. మీకు చెప్పుదా మనుకొంటుంటే మీరే చూచా" రన్నాడు. ఇం కొకసారి మా చేలకు వచ్చే నీటిని బోదెకడ్డం కట్టి, తన చేల్లోకి దింపుకొన్నాడు, మా చేలోకంటే అతని చేలో నీ రెక్కువగానే వున్నా. మరొకసారి తనకు వెళ్లే తోవవున్నా తన బండిని నా చేను మధ్యగుండా తోలుకొని పోయాడు క్రొత్తబాట వేసినట్లు. పైగా సరిహద్దు గట్లమీది మా ప్రక్క మొక్కలను క్రొక్కుకొంటూ మా ప్రక్క భాగాన్ని దిగజారునట్లు క్రొక్కుకుంటూ నడవటం

మొదలుపెట్టాడు. నామీద కష్టి వహించి, ఈ విధంగా నాకు నష్టంకల్గే పనులకు పూనుకొన్నాడు. ఈ పనులతో నాకు అతని మీద అసహ్యమేగాక, విరక్తి పుట్టింది.

మా జ్ఞాతివర్గంలో ఒకాయన వున్నాడు. ఆయ నొకప్పుడు నా యందు మిక్కిలి అభిమానం చూపించినవాడే. నా కంటె పెద్ద అవటంవల్ల, నాతో మిక్కిలి ఆప్యాయంగా మాట్లాడుచుండటంవల్ల నే నాయనయందు బంధుప్రీతితోనేగాక గౌరవభావంతో వుండే వాడను. ఆయ నేదైనా పని చెప్పితే, శ్రమ అనుకోకుండా నా చేతికి కొంత దండుగైనా చేసిపెట్టుచుండేవాడను. ఆయనకు క్రమేణా ధనకాంక్ష పెరిగింది. మంచీ చెడ్డా లేకుండా డబ్బు సంపాదించటమే ధ్యేయంగా పెట్టుకొన్నాడు. ఒకప్పుడు "తమ్ముడూ, నా కత్యంతవసరము వచ్చింది. ఒక్క వెయ్యి రూపాయలుంటే సర్దరా" అని అడిగాడు. మారు మాటాడక తెచ్చియిచ్చాను. ఇది చేబదులల్లే వున్నది, నోటు గీటు వ్రాయ మనటం బాగుండదని ఆ వూసెత్తలేదు. ఆయన డబ్బు త్వరలోనే తిరిగి ఇస్తా డను కొన్నాను గాని నెలలు గడచినా ఇవ్వలేదు. ఒక వేళ మరచి పోయా డేమో అని, "అన్నా, నా కవసరం వచ్చింది. ఆ వెయ్యి ఇవ్వం" డన్నాను. "తమ్ముడూ, ఇప్పుడు కొంచెం ఇబ్బందిలో వున్నాను. తర్వాత ఇస్తా"నన్నాడు. ఇలా చాలా సార్లడగటం, ఆయన వాయిదాలు వేయటం సంవత్సరాలు గడచిపోయాయి. ఇక ఇవ్వడని నిరాశచేసుకొన్నాను. ఆయనయం దుండిన గౌరవభావం అదృశ్యమవటమే గాక, అసహ్యంతో బాటు విరక్తి కల్గింది.

మా బంధువర్గంలో ఒకరు 'బావా' అంటూ వస్తూ పోతూ, ఏ గడ్డిపరకలో, జనపకట్టలో పట్టుకుపోతుండేవాడు. పోనీలే, బీదవాడుకదా అని సరిపుచ్చుకొనేవాడను. ఒకనా డూడిపడి "బావా, నీ అక్క, పిల్లలు నీరసించిపోతున్నారు. ఒక్క చుక్క కూడా మజ్జిగ దొరకటంలేదు. మా గేదె ఎండిపోయింది. ఇంకొక గేదెను కొనటానికి శక్తిలేదు. నీవద్ద ఈమధ్య ఈనిన పడ్డవుంది కదా, నీ కింకా మంచి పాడిగేదెలు రెండు మూడున్నాయికదా, ఈ సాయం చేస్తే నేను జన్మాంతం మరచిపోను. ఆ పడ్డను నేను

తోలుకుపోయి ఈ పాడి త్రాగి, నా కుటుంబం గట్టెక్కుతాం'' అని ప్రాధేయపడ్డాడు. అతని దీనాలాపాలు చూచి, మనస్సు కరగి సరే అన్నాను. తోలుకుపోయాడు. అంతే, నేను దానిని తిరిగి చూడ లేదు. కొన్ని నెలలకు చేతులు నలుపుకొంటూ వచ్చాడు. ''పడ్డి చచ్చిపోయింది, ఎన్నిమందులో వాడాను. లాభం లేకపోయిం'' దని కళ్లనీళ్లు పెట్టుకొన్నాడు. సరే, అదృష్టం లేకపోతే ఏం చేస్తాం అని సరిపుచ్చుకొన్నాను. ఆ బంధువు అంతదూరంలో లేని ఇంకో ఊరివాడు. తర్వాత ఆ యూరివా రొకరు కన్పించగా, ఆ బంధువు విషయా లడిగి, ''పాపం, అతనివద్ద వున్న పడ్డి చచ్చి పోయిందటగా'' అన్నాను. ''ఎబ్బే, చావట మేమిటి, ఎవళ్లో బేరగాళ్లు రాగా అమ్మేశా'' డన్నాడు. అదివరకే ఈతడు బంధుత్వం మిషమీద తరుచూ అవీ ఇవీ పట్టుకుపోతున్నా డని దుగ్ధ లేకపోలేదు. ఈ దగా వినటంతోనే, ఏహ్యంతో పాటు విరక్తిభావం మనస్సును నింపింది.

స్నేహితుడు, జ్ఞాతి, బంధువు చెడుగా నడచా రనో, నష్టపెట్టా రనో, దగాచేశా రనో వ్యథపెట్టుకోవట మెందుకు? నీ రక్తం పంచుకొన్న చెల్లెలు, నీ కూతురే మంచీ చెడూ లేక పీక్కుతినటం, పైగా సాధించటం జరిపిస్తు వుంటే ఏదో కట్టి పెట్టలేదనో, ఏ లాంఛనాలో జరుపలేదనో, కోరింది చేసిపెట్టలేదనో ఎడ ముఖం, పెడ ముఖం పెట్టటం, చీటికి మాటికి గిల్లి కజ్జాలు పెట్టుకోటం, అలిగి పోట్లాడి పోవటం అలవర్చుకొంటే, ఛీ, ఛీ చెల్లెలైతే, కూతురైతే మాత్రం మంచి, చెడు తెలియక, చిన్నా పెద్దా లేకుండా దులపరించటం, సాధించటం చేస్తే మనస్సు బాధపడదా, విరక్తి పుట్టదా?

రక్తి ఎంత హృదయాహ్లాదకర మో, విరక్తి అంత మనస్సును పాడుచేసేది అని తత్వచింతనలో దిగాను,

౯

రాద్ధాంతం - సిద్ధాంతం

సుబ్బారావు భార్య అందించిన పకోడీలు, కాఫీ పూర్తిచేసి చేతిగడియారం చూచుకొని 4½ అయింది, అలా చెరువుగట్టుకుపోతే చల్లని గాలి తగుల్తుంది, అక్కడికి చేరిన వాళ్లతో కబుర్లు చెప్పుకొని కాలక్షేపం చేయవచ్చని బైలుదేరాడు. వాళ్లూ వీళ్లూ తాపీగా కూర్చొని ఏ వేవో మాట్లాడుకుంటున్నారు. తానూ వెళ్లి చదికిలపడ్డాడు. అంతలో పద్మారావు వచ్చాడు. వాళ్లిద్దరు సమ వయస్కులు, స్నేహితులు. అయితే ఒకరికి మించి మరొకరు వితండవాదులు. దేవుడు, దయ్యం లేదనే ఘటికులు. ఎవరే మెక్కువని వాదులాడే రకం. వాళ్లలో వాళ్లు అప్పు డప్పుడు కీచులాడు కొనుచున్నా, అది సరదాకా అనునట్లుంటుంది. ఉండిన స్నేహం ఊడిపోలేదు. వాళ్లిద్దరి మనోభావాలు, చేష్టలు ఇంచుమించు ఒకే మాదిరివి అవటంచేత, ఏవో స్వంతమైన పట్టుదలలలో భేదాభిప్రాయాలు వచ్చినా సర్దుకు పోయేవాళ్లు. కాని, ఎవరైనా వాళ్ల ఉమ్మడి అభిప్రాయాలకు, నమ్మకాలకు భిన్నంగా వుంటే, కలసికట్టుగా అవతలి వ్యక్తిపై దండెత్తుతారు. ఉదాహరణకు, ఆ వూరిలోని రామశాస్త్రి, తాను వేదాలు, శాస్త్రాలు చదువుకొన్నానని, గొప్ప సంస్కృత పండితుడ నని, నిత్యదైవారాధకుడనని గట్టి నమ్మకం కలవాడు. నమ్మకంతో సరిపెట్టుకొంటే ఏ తగాదా వుండదు. కావాలని అవకాశం వచ్చినప్పుడల్లా, ఈ వూళ్లో నాస్తికు లెక్కువైపోతున్నారు, దైవచింతనే లేదు, దేవాలయం పాడుపడిన ట్లున్నది, పెద్దల మని చెప్పుకొనేవాళ్లు కించిత్తైనా పట్టించుకోవటం లేదు, ఈ వూరి కెప్పుడో వినాశకాలం వస్తుం దని వాపోవుచుంటాడు. ఆయన అభిప్రాయాలు వెలిబుచ్చే తీరు ఇతరుల కెట్లున్నా సుబ్బారావు, పద్మారావులకు బొత్తిగా గిట్టలేదు. సందుదొరికితే ఆయనమీద విరుచుకు పడాలని ఎదురు చూస్తుండినారు.

ఇంతలో కర్మించాలక, ప్రక్కనేవున్న దేవాలయం నుండి రామశాస్త్రి బైటకు వచ్చాడు. ఇంకా 5 గంటలైనా కాలేదు, కొంచెంసేపు చెట్టుక్రింద కూర్చుని, చెరువునుండి వచ్చే చల్లనిగాలి హాయి ననుభవించి వెళ్దామని అటుప్రక్కకు తిరిగాడు. తీరా పదిబారలు నడచిన తర్వాత, ఒక ప్రక్కగా కూర్చుని మాట్లాడు కొనుచున్న ఆ యిద్దరి యువకులను చూచాడు. తిరిగి పోదామా అనుకొని, ఛా, వాళ్లకు భయపడిన ట్లౌతుంది. పైగా ఆప్రక్క నరసయ్య, పుల్లయ్య వగైరా పెద్దలున్నారుకదా అని అటు ప్రక్కకు నడిచాడు. ఇంతలో సుబ్బారావు, పద్మారావులు రామశాస్త్రిని చూచారు. వాళ్లమనసుల్లో గుప్పున రాగద్వేషా లంకురించాయి. రెండు మూడు రోజుల క్రితమే రామశాస్త్రి ఈ యూళ్లో యువకులు కొందరు దేవుణ్ణి నిందిస్తూ, అసలే దేవుడు లేడు, అంటున్నారట, వాళ్లకు నరకం తప్పదని గుడిలో పదిమందితో అన్నాడట. అదేదో తేల్చుకొందామని రామ శాస్త్రిని రమ్మని కేకవేశారు. పిలిస్తే వెళ్లకపోవటం బాగుండదని వెళ్లి ప్రక్కగా నిల్చొని, "ఏం, ఎందుకు పిల్చా"రని అడిగాడు. సుబ్బారా వందుకొని "ఏమయ్యా, నీవు వేదాలు, శాస్త్రాలు చదువు కొని యుండవచ్చును. పండితుడవై వుండవచ్చును. ఇంగితజ్ఞానం లేని చదువు తగులబెట్టనా? మంచి చెడు ఆలోచించకుండా మమ్మ్లలను ఈమధ్య నానామాట లన్నావట. మా పేర్లు బైటపెట్టక పోయినా, యువకులంటే మాత్రం నీ విసుర్లు మాయిద్దరి మీదేకదా! నీ అభిప్రాయాలు, నమ్మకాలు నీకున్నట్లే, మా అభిప్రాయాలు, నమ్మకాలు మా కుంటవి. నీ ఊసేమైనా ఎత్తుతామా. మా జోలి మీ కెందు" కని ఖస్సు మన్నాడు. రామశాస్త్రికి కోపం పెల్లుబికి వస్తున్నా, సంబాళించుకొని, "ఏమిటీ దౌర్జన్యం? నేను మామూలుగా ఈ కాలపు యువకులను గురించి అన్నాను గాని మిమ్మ్లలను పేరుబెట్టి నిందించానా? గుమ్మడికాయ దొంగంటే బుజాలు తడుముకొన్న ట్లున్నది. పైగా ఈమధ్య పేరుబెట్టకపోయినా, న న్నాడిపోసుకున్నారటగా! ఈ యూళ్లో ఒక పండితుడ నని, దైవభక్తుడ నని విర్రవీగే ఒకాయన తా నేమో

బ్రహ్మాండనాయకుడ నని, జ్ఞాన విజ్ఞానా లన్నీ తన సొమ్మే నని, నీతి ధర్మాలు తన స్వంతం అని ప్రగల్భాలు పల్కుచున్నాడట. అతని కెప్పుడో బుద్ధిచెప్పుతాం అని కారుకూతలు కూశారట. దాని కేం చెప్పుతా'' రన్నాడు. పద్మారా వందుకొని, ''ఏమిటయ్యా, కారుకూత లంటావు. ఎవరికీ ఈకాలంలో పనికిరాని ప్రాత తుక్కు చదివినంత మాత్రాన ఎవరి నుద్ధరించినట్లు? కూనిరాగాలు తీయటానికి, కాలం వృథాచేయటానికి, గొప్పలు చెప్పుకొనటానికి పనికివస్తుం దేమో! నీవు గుళ్లోకినిత్యం వెళ్లి కొంగజపాలు చేసినంత మాత్రాన, నీతివంతుడ వైపోయావా? అసలు దేవుడు హృదయంలో వున్నాడని చెప్పుతారు కదా! హృదయంలో వుండే దేవుణ్ణి రాతిబొమ్మతో కొలిస్తే నీవాసించే స్వర్గమో, మోక్షమో ఎట్లా వస్తుంది? బూటకంతో అజ్ఞానులను మోసగిద్దా మనే నటనకాకపోతే ఇదంతా ఏమిటి? వేదాలు, శాస్త్రాలు చదువు కొన్నవాడికి బ్రహ్మజ్ఞానం ఉంటుం దంటారు. బ్రహ్మజ్ఞానికి ఈ దేవాలయ మనే కట్టడాలు, అందులోని కృత్రిమ దేవుళ్లు అవసరమా'' అని ఝూడించాడు. శాస్త్రి తెల్లబోయి, అంతలో నిలదొక్కుకొని, '' ఏమి టాపొగరుబోతు కూతలు? దుర్మార్గులకు, దుష్టులకు దేవాలయాలు, దేవుళ్లు కృత్రిమంగానే కనబడుతవి. భగవంతుడు లేనిదే భూమిమీది రకరకాల జీవులు, ఆకాశంమీది సూర్యచంద్రులు, నక్షత్రాలు పుట్టి వుండవని, నిల్చి వుండవని, మూర్ఖులకు, అజ్ఞానులకు ఏమి బోధపడుతుంది? కామెర్లు వచ్చిన వాడికి లోకమంతా పచ్చగానే కనబడుతుందట. మీ దుష్ప్రవర్తన, మీ దుష్టాలోచనలు మిమ్ముల నీస్థితికి తెచ్చాయి. ఏవో నాలుగు ఇంగ్లీషు ముక్కలు చదివినంత మాత్రాన మీవంటి శ్రోత్రియులకు, వేదవేదాంగ విదులకు ధర్మపన్నాలు చెప్పటాని కర్హత సంపాదించారా'' అని ఛెడా మడా తిట్టాడు. దానితో వాళ్లిద్దరు రెచ్చిపోయి రామశాస్త్రిని కొట్టటానికి సిద్ధమైనారు. అంతలో ఈ వాగ్వివాదం వింటూ, తమాషాగా వున్న దన్నట్లు చూస్తూ, వినోదించుచున్న నరసయ్య, పుల్లయ్య, మరికొందరు శ్రుతిమించి రాగానపడుతున్న దని గ్రహించి చప్పున అడ్డంవచ్చి,

సుబ్బారావును, పద్మారావును అవతలికి త్రోసి, "ఎందుకండీ రామశాస్త్రిగారూ, ఈ కుర్రవెధవలతో తగాదా ? మీ దారిని మీరు వెళ్లం" డని పంపించివేశారు. ఆ యువకులతో "ఒరే, మీరు నవనాగరికులై దేవుడు లే డంటున్నారు సరే. మీ రెందుకు ఉన్నాడని నమ్మేవారిని దూషించాలి? మీ కున్నట్లే అవతలివాళ్లకు వాళ్లనమ్మకా లుంటాయి. మీ నమ్మకా లెంత మీకు గొప్పో, వాళ్ళ నమ్మకాలు వాళ్ళ కంత గొప్ప. ఈ దృష్టి లేని మీకు మంచి చెడు ఎలా తెలుస్తుంది? ఇతరుల అభిప్రాయాలను మీరు సహించ లేనిది, ఇతరు లెట్లు మీ అభిప్రాయాలను సహిస్తారు" అని చివాట్లుపెట్టారు. వా ళ్లిద్దరూ చురచుర చూస్తూ, "మహా చెప్పాచ్చారు నీతులు, మిమ్ముల నెవరు కల్పించుకోమన్నా" రంటూ విసురుగా వెళ్లిపోయారు.

రంధి, రట్టడి, రొష్టు

వెంకమ్మ, పుల్లమ్మ పోట్లాడుకుంటున్నారు. పుల్లమ్మ గేదె రాత్రి వెంకమ్మ దొడ్లోకి వచ్చి మే తంతా తిని, ఆమె గేదెల మీద దాడిచేసి పోయిందట. ఆ సాయంత్రం వెంకమ్మ మేక పుల్లమ్మ ఆవరణలోని కూరమొక్కలను కొరికేసిం దట. పూల మొక్కలను ధ్వంసం చేసిందట. ఇవి ఇట్లా వుండగా, వెంకమ్మ ఇంట్లో పనులుచూచుకొని ముంగలివాకిలికి వస్తే పుల్లమ్మ కోడి ముగ్గులను చిందరవందరగా త్రొక్కటమేగాక, 'ఇస్సా, ఇస్సా' అని అదిలిస్తుంటే పెంటవేసి మరీ పారిపోయిందట. ఇంకేం, వెంకమ్మకు చిర్రెక్కింది. గావుకేకలు పెడ్తూ, తిట్టటం మొదలు పెట్టింది. కేకలు, తిట్లు విని న పుల్లమ్మ రయ్‌మని బైటికి వచ్చి ఎదురొక్కన్నది. "ఎందు కంత అరుస్తూ నోరు పాడేసు కుంటున్నావూ ? అక్కడికీ మా ఆయన కట్టుకొయ్యకు భద్రంగానే కట్టాడు. దాని దుంపతెగ, ఎట్లా త్రెంచుకొందో, మేము

చూశామా, పెట్టామా? ఏ అర్ధరాత్రో ప్రక్కనున్న మీ దొడ్లోకి దడి తోసుకొని వెళ్లిందికావును. మీరు దడిని గట్టిగా కట్టుకోకుండా మమ్మల నంటే ఏమున్నది? గొడ్డుకు ఇవన్నీ తెలుస్తాయా? రాత్రిపూట మేము చూశామా? మమ్మలను తిడుతున్నావుగాని, నిన్న సాయంత్రం, ఇంకా వెలుగుండగానే మీ మేక వచ్చి మా కూర మొక్కలను కొరికివేసి, పూలచెట్లను పాడుచేసి పోయిందికదా, దాని కేం చెప్పుతావ్? నోరున్నదని గయ్యాళి గంపలాగా మా మీద విరుచుకుపడతా వెందుకు" అని మాతి త్రిప్పి, చేతులు ఝాడించింది. వెంకమ్మ వూరుకుంటుందా? "ఒసే నీ పొగ రణగ. క్రొవ్వెక్కి చిందులు త్రొక్కతా వేమే? గేదెను కావాలనే మా దొడ్లోకి తోలావు, పైగా మేమెంతో బందోబస్తుగా కట్టుకొన్న దడిని ఓటి దంటావా? బంగారంవంటి దడిని విరగగొట్టింది. అది గాక, మీ కోడి నాముగ్గు లన్నీ పాడుచేసి పెంటవేసి మరీ పోయింది. మీరు కోళ్లను పెట్టుకోవటం మా గుమ్మాలు పాడుచేయటానికేగా? తెల తెల్లవారకముందే ఎవడి సొమ్మని కోళ్లను పొరుగిళ్లకు తోలుతావు? పైగా పోట్లాడటానికి వచ్చావా? నీకు సిగ్గులేదే లంజా" అని బొబ్బలుపెట్టింది. పుల్లమ్మకు తామసం ముంచుకు వచ్చింది. "ఒసే గుడిసేటిదానా, క్రొవ్వెక్కింది, లంజా అంటావా? నీకే క్రొవ్వెక్కింది, క్రిందా పైనా కూడా. నీవు పదిసార్లు లంజవు. నీ అమ్మ లంజ, నీ ముత్తవ లంజ, నీ కూతురు లంజ. లంజతనం అంతా మీ వంశంలో పెట్టుకొని నన్ను లంజంటావా? పెంటముండా. నా కోడి బజారువెంట తిరుగుతూ నీ గుమ్మంమీదుగా వెళ్లింది కాబోలు. అంతమాత్రానికే ఈ గంతులూ చిందులూనా? కోడికేం తెలుస్తుంది నీ వంటి చెడ్డముండ గుమ్మం తొక్కకూడదని? సరే. నా కోడి నంటావు, మొన్న మీ కుక్కేమి చేసింది? మా దొడ్లోకి వచ్చి కుడితితొట్టిలో జొరబడి మా కుడితంతా త్రాగి మలంవేసి పోయింది. పోనీలే, పొరుగిళ్లై నప్పుడు ఇటువంటివి జరగకుండా వుంటాయా, ఇంతమాత్రానికి తగాదా ఎందుకని ఊరుకుంటే ప్రొద్దున్నే ఈ గల్లంతు మొదలుపెట్టావా" అని గర్జించింది.

వెంకమ్మ అసలు గయ్యాళి. ఊరుకొంటుందా? "ఒసే రంకుముండా, మా అమ్మ, అమ్మమ్మ, కూతురు, మావంశ మంతా లంజలంటావా? ఎవరి వంశం ఎటువంటిదో అందరికీ తెలుసును. నీ అక్క ఆ సాయెబ్ గాడిని తవులుకు పోయిన సంగతి తెలియదనుకొంటావా? మీ అమ్మకు ఆ సాలె వైద్యునితో సంబంధం ఉండిందని అందరికీ తెలిసిందే. బహుశా వాడికే పుట్టావేమో? నీ కూతురు ఆ చదువుకునే కుర్రాడితో విచ్చలవిడిగా తిరుగుతుంటే ఏ మనుకోవాలి? అవ్వ! ఇన్ని రంకులు పెట్టుకొని మమ్మ లంజలంటావా" అని నిప్పులు రాల్చింది. పుల్లమ్మ మొదట నిర్ఘాంతపోయి నిలద్రొక్కుకొని బలం, రోషం పుంజుకొని, వెంకమ్మ మీద మీదకు వెళ్లుచూ, "ఒసే ఛండాలం ముండా, ముదనష్టం ముండా, గురివిందగింజ ముడ్డిక్రింద నలుపెరగనట్లు కాకుకూతలు కూస్తావేమే? ఎవ డెరగడు నీ సంగతి, మీ వాళ్ల సంగతి? అంతా పత్తిత్తులుగా మాట్లాడతావు. ఈమధ్యనేకదా వూరంతా గుప్పుమన్నది? రాత్రి పడుకొన్నదానివల్లా ఎక్కడికో, ఎవరితోనో లేచిపోగా నీ మొగుడు, నీ అన్నలు నాలుగు రోజులు దేశమంతా వెదికి, ఎవరితోనో ఒక హోటల్‌లో వున్న నిన్ను పట్టుకొని చావబాది ఇంటికి లాక్కొచ్చారుకదా! పిల్లలున్నారని, చిన్న సంసారం కనుక తిరిగి పెళ్లి చేసుకోలేక, నీ మొగుడు తిరిగి ఇంట్లో పెట్టుకొన్నాడు అభిమానం చంపుకొని బైటపెట్టుకోకుండా. ఏమీ జరుగనట్లు ఊరుకున్నాడు. నీకు సిగ్గు, ఎగ్గు వుంటే అంతపని జేసినదానివి ఏ మొగంపెట్టుకొని బ్రతుకుచున్నావే? ఇక మీ వంశం అంటావా, మా వంశంకంటె హీనాతిహీనంకదా! మీ అమ్మ సంగ తటుంచి మీ నాయన బ్రాగుబోతు, జూదగాడు, ముండలముఠాకోరు. అమధ్య పోలీసులు జూదంలో పట్టుకొని ఖైదులో పెట్టలా? రోగాలు తగిలించుకొని ఆస్పత్రిలో నెలలతరబడి పడియుండలా? బ్రాగి దెబ్బలాడుకుంటే తల పగల్లా? సిగ్గు శరం లేకపోతే సరి. మా వంశాన్నే తిడతావా" అని చేతులు త్రిప్పుతూ, రొప్పుతూ మీదకు వెళ్లగా, వెంకమ్మ రయ్యని కలబడి పుల్లమ్మ జుట్టు పట్టుకొన్నది. పుల్లమ్మ వెంకమ్మ జుట్టు అంది పుచ్చుకొని ముందుకు

వంగలాగి వీపుమీద నాలుగు గ్రుద్దింది. వెంకమ్మ సమఉజ్జీయే, పుల్లమ్మను క్రిందకు పడద్రోసి నాలుగు తన్నింది. పుల్లమ్మ గభాలున లేచి వెంకమ్మమీద కలబడింది. ఇద్దరు పెనుగులాడి క్రిందబడ్డారు. ఒకరి నొకరు తిట్టుకుంటూ, రక్కుకుంటూ, గ్రుద్దుకుంటూ, కరుచుకొంటూ, జుట్టు పీక్కుంటూ, ఒళ్లంతా చెమటలు పోసి, చీరెలు జారి, సగం వివస్త్రులై రొప్పుచుండగా, వాళ్లూ వీళ్లూ పోగయ్యారు. చీకటితోనే పొలం వెళ్లిన వెంకమ్మ భర్త, దొడ్లో ఏదో పనిలో వున్న పుల్లమ్మ పెనిమిటి హడా హుడిగా వెళ్లి వాళ్లిద్దరిని విడదీసి నాలుగు తిట్టి, ఇంట్లోకి తీసుకు పోయారు.

ఈ రగడకు, రాద్ధాంతానికి, రంధికి, రట్టడికి చూచిన వాళ్లంతా విస్తుపోయారు. వెంకమ్మ గుట్టు, పుల్లమ్మ రొష్టు ఊరంతా చెప్పుకోసాగారు.

Donated by:
SAHITYA SAMRAT, KALAPRAPOORNA
Dr. Eripuraneni Venkateswara

౬
పోరు, శతపోరు

పోరు సామాన్యమైనది. కలహం వంటిది. శతపోరు యుద్ధం. ప్రక్కింటి వారితోనో, ఊళ్లో ఎవరితోనో తగాదాపడటం పోరు. రణరంగంలో చంపుకోవటం లేక చంపించుకోవటం శతపోరు. వాలి సుగ్రీవుల కలహం పోరు, రామరావణ యుద్ధం శతపోరు.

ప్రక్కింటి రాజమ్మ రామమ్మ మీదికి ఝుయ్‌మని వచ్చింది. రాజమ్మ దొడ్లో వంగమొక్కలు పెట్టి, జాగ్రత్తగా నీళ్లుపోస్తూ పెంచుకుంది. ఇప్పుడే కాపుకు వచ్చి చక్కని పొడుగాటి వంకాయలు కూరకు సిద్ధమైనాయి. రేపుప్రొద్దున కోసుకొందాం, ఆయనకు, పిల్లలకు వంకాయకూరంటే చాలా యిష్టం అనుకొన్నది. ప్రొద్దున్నే వెళ్లి చూస్తే కాయ లన్నీ మాయమై పోయాయి. చివళ్లు మొండిగా, రెమ్మలు కొమ్మలు విరిగిపోయి, చెట్లన్నీ నానా

చిందరవందరగా వున్నాయి. గొడ్లను కాసే బుడ్డాడిని కేకవేసి, "ఇంతెందు కయిందిరా, నీ వెక్కడ చచ్చావు" అని గర్జించింది. "అమ్మగారూ, మన గేదెల్ని బందోబస్తుగానే కట్టివేశాను. చీకటిపడుతుండగా ప్రక్కింటి రామమ్మగారి గేదె కట్టుత్రాడు తెంపుకొని వచ్చి చెట్లన్నీనాశనం చేసింది. వంకాయలన్నీ తినేసిం"దని చెప్పాడు. "రాత్రే ఎందుకు చెప్పలేదురా వెధవకుంకా" అంటే, "అమ్మగారూ, అప్పటికే బాగా చీకటిపడింది. నేను ఇంటికి వెళ్దామని బైలుదేరాను. చప్పుడైతే వెళ్లి చూచాను. నన్ను చూడటంతోనే ఆదొంగ గేదె పారిపోయింది. మీకు చెప్పుదామంటే మీరు కనపడలేదు, లోపలున్నారు కాబోలు. అక్కడికి పిల్చాను. మీరు పలకలేదు. మరీ పిలుస్తే కోప్పడతారు, ఈ సంగతి చెప్తే 'నీవేమి చేస్తుండినావురా, ఆగేదె నెందుకు పట్టుకొని కట్టివేయ లేదురా' అని నన్ను తిట్టి నిలబెడతారని భయపడ్డాను. అప్పటికే బాగా చీకటిపడింది. మా పల్లె దూర మాయె. తినేసిం దేమో తినేసి పోయె. రేపు ప్రొద్దున చెప్పుదామనుకొన్నాను. నేను చెప్పే లోపలే, మీరు దొడ్లోకి వచ్చారుకదా" అన్నాడు. ఎక్కడలేని కోపం వచ్చి, ఎంతో కష్టపడి పెంచుకొంటే ఆ ముద నష్టం ముండ రామమ్మ చండాలంగేదె తనపొట్టను పెట్టుకొందికదా అని రాజమ్మకు ఏడుపు వచ్చింది. ఏడుపుతో రోషం కలిగింది. వెంటనే దభాలున ఇంటి వీధితలుపును త్రోసుకొని బైటికి వచ్చి, రామమ్మ ఇంటిప్రక్కగా నిల్చుండి, తిట్టటం మొదలుపెట్టింది. ఏమిటా అని రామమ్మ బైటికి వచ్చి రాజమ్మ తనను తిట్టిపోస్తున్నదని తెలుసుకొని, "ఎందు కట్లా నోరు పారవేసుకొంటున్నావే, పెంటముండా" అని అడిగింది. రాజమ్మ రెచ్చిపోయి, "ఓసి లంజా, ఏం ఎరగనట్లు మా ట్లాడతావేమే? నిన్న సందె చీకటిలో మీ గేదె మా దొడ్లో దూరి మా వంగచెట్లన్నీ పాడుచేసి వంకాయలన్నీ తినివేసిందికదే! అటువంటి దొంగగేదె నెందుకు పెట్టుకోవాలి? పెట్టుకొన్నదానివి దానిని బందోబస్తుగా ఎందుకు కట్టివేయకుండా ఉండాలి, పొరుగిళ్ల దొడ్లలో దూరి చెట్లూ అవీ నాశనంచేయటానికా? అసలు తేరతిండి తిని రావటానికి నీవే

పలు పూడదీసి మా దొడ్లోకి తోలావేమో! అటువంటి గుడిసేటి దానవు నీవు" అని బారలు చాస్తూ ఆడిపోసింది. రామమ్మ ఊరుకుంటుందా? "నీవే గుడిసేటిదానవు. అది పసర మయ్యో. దాని దుంప తెగ, పలుపు తెంపింది కాబోలు. మేము కావాలని నీ దొడ్లోకి తోలుతామా" అని రెట్టించింది. ఈ పోరు పెద్ద రగ డైంది. వాళ్లు వీళ్లు వచ్చి సద్దారు.

ఊళ్లో తగాదాలు వచ్చాయి. పార్టీలు పడ్డారు. వెంకయ్య, సుబ్బయ్యలు ఊళ్లో పెద్ద ఆసామీలు. ఒక రంటే మరొకరికి గిట్టదు. ఏ సాకు మీదనో తగాదా పడుతుంటారు. ఈ సంవత్సరం పంటకాల్వలకు నీరు తగినంత రాలేదు. పైన వర్షాలు లేవు. ఊడ్పులు పడటం లేదు. ఎట్లో తంటాలుపడి ఏ కొంచెమో ఊడ్చినా, మానలు ఎండిపోతున్నాయి. ఇట్లుండగా, కాల్వ బాగా వచ్చిందని వెంకయ్యకు తెలిసి తొందరగా నౌకరులను పంపి, కాలవకు అడ్డం కట్టించి, నీటిని తన చేలకు మళ్లించాడు. ఇద్దరు నౌకర్లను కాపలా వుంచి, ఎవరినీ అడ్డకట్టు తెంపించనీయవద్దు అని ఆజ్ఞా పించాడు. ఏ వూరికో వెళ్లియుండిన సుబ్బయ్య ఝామున్రాత్రి ద్దెక్కిన తర్వాత ఇంటికి తిరిగి వచ్చాడు. సంగతి తెలుసుకొని, ఎగిరిపడి, తన నౌకర్లను "ఏమైనాసరే, వెంకయ్య కట్టించిన అడ్డాన్ని తీసివేసి, మనచేలకు గళ్లు తీయండిరా" అని పంపాడు. అడ్డం దగ్గర, ఇద్దరి నౌకర్లు కేకలు వేసుకొని, త్రోసుకొని కుమ్ములాడుకొన్నారు. సుబ్బయ్య నౌకరు సాహసించి కాలవలో దిగి అడ్డాన్ని తీసివేయ టానికి ప్రయత్నించగా, బుర్రమీద కర్రలు పడ్డాయి. బుర్ర నెత్తురు చిమ్మించింది. ఇంటికిపోయి సుబ్బయ్యతో "వాళ్లు మొండికేసి అడ్డకట్టను తీసివేయనీయలేదు, పైగా కొట్టారు, రక్తంకూడా వచ్చిం"దని చెప్పాడు. ఇకేం సుబ్బయ్య కెక్కడలేని రోషం త్రోసుకొని వచ్చింది. తన పార్టీవాళ్లను పిలిచి "వెంకయ్య పొగరు చూచారా, ఇక మనలను ఊళ్లో ఉండనిస్తాడా? అదేదో ఇప్పుడే తేల్చుకోవా" లన్నాడు. వాళ్లు కర్రలతో, కత్తులతో బైలు దేరారు. ఈ సంగతి తెలుసుకొని వెంకయ్య తన పార్టీవాళ్లతో కర్రలు, బల్లాలు తీసుకుని చేరాడు. బూతులు బండలు, సవాళ్లు

గివాళ్లుగాక, వాళ్లమీద వీళ్లు వీళ్లమీద వాళ్లు కలబడి కర్రలతో మోదుకొని, కత్తులతో నరుకుకొని, బల్లాలతో పొడుచుకొని, రణయుద్ధంచేశారు. కొంతమందికి చావుదెబ్బలు, పోటులు తగులగా, ఇంక కొందరు పీనుగులే అయ్యారు. పార్టీ కక్షలు, చేలకు నీటిని గురించిన తగాదాలు శతపోరైంది.

పోరు బైటివాళ్లతోనేనా, ఇంటిలో పోరుండదా అని అడగ వచ్చును. ఇంటిలో మాత్రం ఎందు కుండదూ? వేమనయో గేమన్నాడు, "ఇంటిలోని పోరు ఇంతంతకాదయా" అనలేదా? ఏదో వొకవిధంగా భర్తకు భార్యపోరుంటూనే వుంటుంది. తన చీరెలు చిరిగిపోయాయి క్రొత్తచీరెలు తెమ్మనో, పిల్లలకు బట్టలు లేవు పండుగలు దగ్గరకువస్తున్నాయనో, మావాళ్లింట్లో పెళ్లిగదా బోసిమెడతో వెళ్లమంటారా అనో, చివరకు ఎన్నిసార్లు చెప్పాను ఇంట్లో వెచ్చాలయిపోయాయని చెవి నెక్కించుకోరేమనో, ఏదో రూపంలో భార్య పోరుపెడుతూనే వుంటుంది. చిన్నపిల్లల పోరు తల్లికెటునూ తప్పదు. సెనగపప్పు కావాలనో, బఠాణీలు కొని పెట్టుమని, "అడుగో, వేరుసెనగకాయలవాడు కేకవేశాడు, ఒకఅణా ఇవ్వవే, కొని తెచ్చుకొంటా"మనో తల్లిని పిల్లలు పోరుపెడుతూనే వుంటారు. ఇక పెరిగిన కొడుకులు పంచిపెట్ట మనో, సరిగా పంచి పెట్టలే దనో, లేక నీ కూతుళ్ళకు దోచిపెట్టి మాకు లేకుండా చేస్తున్నావనో శతపోరు పెడ్తారు. దుష్టులైన కొడుకులు తండ్రిని కొట్టిన, చంపిన దృష్టాంతరాలు (ఇన్ స్టెన్సెస్) ఉన్నాయి. ఇట్టివి కూడా పోరులు, శతపోరులే.

వాచాలత్వం

వాచాలత్వం అంటే సొల్లువాగుడు. అసంగతం, అనవసరం, అధికం అయిన దానిని సొల్లువాగుడంటాం. మన పురాణాల్లో ఈ లక్షణాలున్నా, అవి ఏ నీతులనో, ధర్మాలనో నెపంతో

చెలామణి అవుతాయి. కట్టుకథలు సొల్లువాగుడే అయినా, ఆ కథ లేవో సందర్భాలలో చెప్పినవి కనుక వాని నంతగా అసందర్భాలు, అనుచితాలు అనలేం. పిట్టకథలు కూడా ఈ వర్గంలో చేరినవే. దేనినో దృష్టిలో పెట్టుకొని, ఏ ఆదర్శాన్నో, ఏ ప్రాత ఆచారాన్నో ఉద్ఘాటిస్తున్నట్లు చెప్పిన ఈ పిట్టకథలు కూడా ఆ పురాణధోరణికి సరిపోతవి కనుక, పురాణపారాయణంలో కలసిపోతవి. రామాయణంలో కట్టుకథలు, పిట్టకథలు కొన్ని లేకపోలేదు. కబంధుడు మొదలైన గంధర్వులు తమ శాపవిమోచన మైన తర్వాత, తమ పూర్వజన్మవృత్తాంతాలని చెప్పిన కథలు అతిశయోక్తులతో కూడి కట్టుకథల వలెనే ఉంటవి. అహల్య భర్తశాపంచేత రాయియై పడివుండిన దని, రాముని పాదం సోకినంతనే స్త్రీయై నిలిచిం దని చెప్పటం కట్టుకథయే. శివధనుస్సును సభాస్థలిలోకి తీసుకొని రావటానికి ఏడు వేలమందో, పది వేలమందో కావలసివచ్చింది. బాలుడైన రాముడు అంత బరువుగల దానిని అవలీలగా ఎడమ చేతితో ఎత్తి నిలబెట్టినా డనటం, ఖరదూషణాదులను 24 వేల మందిని ఒంటరిగా కొలదికాలంలో ఎకాఎకిని సంహరించా డనటం కట్టుకథలక్రిందే వస్తవి. ఒక్కబాణంతో ఏడు మద్దిచెట్లను ఛేదించాడు. ఆ బాణం ఒకదాని నుండి మరొకదానికి వరుసగా ఏడు ముదిరిన చెట్లనుండి దూసుకొనిపోయి, తిరిగి రాముని బాణసంచిలో చేరిందని చెప్పటం కట్టుకథో, పిట్టకథో అనే చెప్పాలి. రావణుని పది తలలను నరికినవెంటనే, అవి తిరిగి మొదటిరూపంలో మొలుచు కొనివచ్చే వని, రావణుని కడుపులో అమృతభాండం ఉండిన దని చెప్పటం పిట్టకథే. హనుమంతుడు నూరు యోజనాల సముద్రాన్ని ఎకాఎకిని దూకా డని, భగభగ మండుచున్న అగ్నిలో సీత ప్రవేశించి, చెక్కుచెదరకుండా బైటికినచ్చిం దన్న సంగతులు పిట్టకథలే. ఇక, మహాభారతంలో చాలా కట్టుకథలు, పిట్టకథలున్నాయి. వీనిని అసలు కథావస్తువులో చిలవలు పలవలుగా మిశ్రమం చేశారు కాబట్టి, ఏదో ఉదాహరణంగానో, ధర్మస్వరూపాన్ని తెలిపేదిగానో, నీతిని బోధించేదిగానో చెప్పటం బట్టి అంత ఎబ్బెరికం అనిపించక బోవచ్చును. కాని, కట్టుకథ.

లని ఒప్పుకోవాలి. అసలు మహాభారతం ఈ చిల్లర మల్లర కథలకు పుట్టిల్లుకాకపోతే, అది ఇతిహాసం అయివుండదు.

ప్రస్తుతకాలానికి వద్దాం. మన పూర్వులు, అనగా క్రీస్తుశకం తర్వాతవారు, ఎంత వాచాలుగో నేను చెప్పలేను. కాని, ఈ ఆధునిక యుగంలో వాచాలత్వం పెరిగిందనే చెప్పాలి. సామాన్యంగా విద్యావంతు లీకాలంలో అధికప్రసంగు లౌతున్నారు. వారి అసంగత సంభాషణలు వివాదాలకో, వినోధాలకో దారి తీస్తున్నవి. వారి అనవసర చర్చలు, గోష్ఠిరూపం నుండి గ్రుద్దులాటరూపం ధరిస్తున్నవి. సామాన్యంగా విద్యావేత్తల, శాస్త్రజ్ఞుల అభిభాషణలు, ప్రబోధములు అనవసర ధోరణులలో చెప్పే విషయానికి సంబంధం లేకుండా, అనుచితాలుగా వుండవు. ముఖ్యంగా వారు ముందుగా ఆలోచించుకొని, అవసరమైతే వ్రాసుకొని, ఇచ్చే ఉపన్యాసాలను వాచాలత్వం అనలేము. కొంత సందర్భశుద్ధిలేక, అనవసర దీర్ఘంగా వున్నా అవి సొల్లువాగుడు క్రిందకు రావనే తలంచాలి.

చదువంతగా లేక, రాజకీయ దుమారంలో ఎండుటాకులు పైకిలేచినట్లు రాజకీయ ప్రముఖులైన, తగిన సంస్కారంలేని వాళ్లు అమాయకులైన వారిని ఉబ్బించటానికో, మోసగించటానికో చెప్పే మాటలు, ఊకదంపు ఉపన్యాసాలు సొల్లువాగుడు క్రిందకే వస్తవి.

పల్లెటూరు వాళ్లలో ఈ వాచాలత్వం జాస్తిగానే వుంటుంది. ఉదయం దంతధావనానికో, సాయంత్రం చల్లగాలికో చెరువుగట్టున చేరిన రైతులు సొల్లువాగుడు సాగిస్తారు. ఆ వెంకి సుబ్బడితో లేచిపోయిందనో, ఆ పిల్లను ఫలానావాడు చెరిచాడనో, ఎల్లయ్య జొన్నచేలో నర్సడు, మంగి తొంగారనో, పుల్లయ్య సుబ్బిని దొంగచాటుగా వాటేసుకొని డొంకలోకి లాక్కుని పోయాడనో, తనకు పండింది 20 బస్తాలైతే, 30 బస్తాలు పండిందనో లేక ఫలానావాని గిత్తలతో పోటీపడేవి ఎక్కడా లేవనో సొల్లుప్రగల్భాలు వాగుచుంటారు.

అనర్థాలకు దారితీయకపోయినా, మొత్తంమీద వాచాలత్వం హర్షించవలసింది కాదు.

ఈర్ష్యాసూయలు

ఈర్ష్య (ఎన్వి) ఒకరిని గురించి చుప్పనాతించటం. అసూయ (జెలసి) ఒకరిని అనుమానించటం. మొదటిది ఎదుటివాని సిరికో, హెచ్చుస్థాయికో, పలుకుబడికో, పెద్ద ఉద్యోగానికో ఓర్వలేకపోవటం, తత్కారణంగా అతనియందు మత్సరం పూనటం. రెండోది భార్య లేక తనప్రియురాలు, ఇతరులతో సాంగత్యం పెట్టుకొనుచున్నదేమో అని అనుమానపడి ఆమెను దూషించటం, దండించటం.

రెండూ చెడ్డవే. ఈ రెంటిలో ఏది ఎక్కువ చెడ్డదో పరిస్థితులను బట్టి, ఆవేశం హెచ్చుతగ్గులను బట్టి ఉంటుంది. మొదట ఈర్ష్యను తీసుకొందాం. తాను బీదవాడై, జీవనం గడవనిస్థితే ప్రక్కనున్న మేడలో హాయిగా, దర్జాగా జీవితాన్ని గడుపుచున్న వ్యక్తిని చూస్తే కడుపు మండుతుంది. తాను నౌకరుగా ఉండి తన సంపన్నుడైన యజమాని తనకు చాలీ చాలని జీతం ఇస్తుంటే, వ్యథతో ఓర్వలేనితనం కల్గుతుంది. సామాన్య జీవితం గడుపుతున్న వ్యక్తికి తనవంటి పొరుగువాడు రాజకీయ నాయకుడ నని చెప్పుకుంటూ డాబులు పోతుంటే, పైగా, ఆ పంథాన అవి ఇవీ సంపాదించుకుంటుంటే మత్సరం కల్గుతుంది. తనకంటె ఎక్కువ చదువని అవతలివాడు హెచ్చుస్థాయి ఉద్యోగి అయి, అధికారం చెలాయిస్తుంటే క్రోధం కల్గుతుంది. కవికో, పండితునకో తా నాశించినపేరుప్రతిష్ఠలు రాక, ఇంకొకడు మహాకవిని, పండితోత్తమున్ని అని చెప్పుకొని విర్రవీగుచూ బ్రతిమాలో బామాలో వాళ్లు వీళ్లచేత సభలు, సన్మానాలు చేయించుకొంటే తప్పకుండా ఓర్వలేనితనం పుట్టుకువస్తుంది. ఆలాగే కళాకారులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల విషయంలో కూడా. అందరి విషయంలో అనికాదు, ఈర్ష్య కల్గటానికి వీరి విషయంలో కూడా అవకాశమున్నదని. ఈర్ష్య అనేది స్పర్ధ. అది పోటీ కాదు కదా! ఈ

ఓర్వలేనితనం బంధువుల్లో ముఖ్యంగా జ్ఞాతుల్లో మన మెక్కువగా చూస్తాం. వారిలో కొందరు తమ చేతగానితనం వల్లనో, చెడు అలవాట్ల వల్లనో, దురదృష్టం వల్లనో దిగజారిపోతారు. కొందరు తమ తెలివితేటలు, చాకచక్యం వల్లనో, మోసం, కుట్ర వంటి అవినీతి పద్ధతుల వల్లనో, అదృష్టం కలిసివచ్చో పైకెగబ్రాకుతారు. మొదటివారికి రెండో వారి యందు చుప్పనాతితనం, మత్సరం జనిస్తుంది. ఎక్కడనుండో వచ్చి బుజాన మూటలు వేసుకొని వీధుల వెంట తిరిగి అమ్ముకొనినవాళ్లు ఏ వ్యాపారమో, మోసమో చేసి కొలది సంవత్సరాలలో వేలుబెట్టి ఎకరాలెకరాలు భూమిని కొంటే ప్రక్కనున్నరైతులు తప్పకుండా ఈర్ష్యపడతారు. ఊరివెంట తిరిగి మలం తిని, దొంగతనంగా చేలలో ప్రవేశించి, దొరికినదానిని భక్షించి, బ్రతికి పెరిగే పందులను పెంచినవాళ్లు పందులపెంటను, పందులను హెచ్చుధరలకు అమ్ముకొని, ధనవంతులై, రైతుల నుండి వేలకువేలు పోసి భూములను కొనేవారి విషయంలో కూడా ఈర్ష్య కల్గుతుంది.

ఇక రెండోది అసూయ (జెలసి). ఇది ముఖ్యంగా పురుష స్త్రీ సంబంధమైనది. తన భార్యయందు, ప్రేయసియందు కాంక్ష పురుషుని కుంటుంది. భార్యయందు ప్రీతి లేకపోయి, ఆమె సాంగత్యం నచ్చకపోయి, వేరే ఉంపుడుకత్తెను పెట్టుకొన్నా, లేక చెదురుమదురు ప్రేయసీలతో వ్యభిచరించినా భార్య ఇతరులతో సంభోగించకూడ దని గట్టిప్రయత్నం చేస్తాడు. తాత్కాలిక ప్రేయసి విషయ మెట్లున్నా, ఉంపుడుకత్తె విషయంలో కూడా తనకు తప్ప ఇతర పురుషులతో సంబంధం పెట్టుకోకూడ దని మిక్కిలి శ్రద్ధవహిస్తాడు. వాళ్లు పరపురుషునితో రమిస్తున్నా రేమో అని అనుమాన పడుతుంటాడు. ఏదైనా అలికిడి కలిగితే వాళ్లను దూషిస్తాడు, దండిస్తాడు. గట్టి అనుమానమే కల్గినా, దాఖలా దొరికినా, చివరకు వాళ్లహత్యకు కూడా వెరువడు. ఇంగ్లీషు నాటకకర్త షేక్స్పియరు వ్రాసిన ఒక నాటకంలోని ఒథెల్లో, తన భార్య డెస్డెమోనా, అయాగో అనేవానితో సంబంధంపెట్టు కొన్నదని అనుమానంకలిగి ఆమెను చంపనే చంపుతాడు. ఇది అసూయ (జెలసి) ఎంత దారుణమైనదో తెల్పే ప్రముఖ గాథ.

ఈర్ష్య అంటే ఉడుకుబోతుతనం అనే అర్థం ఉన్నది. తల్లినో, తండ్రినో కొడుకో, కూతురో ఏదో అడిగితే వాళ్ళివ్వకపోగా పైగా చివాట్లుపెడితే ఉడుకుబోతుతనం కల్గుతుంది. ఆలాగే అన్నతమ్ములు, అక్కచెల్లెళ్లు కీచులాడి ఉడుకుబోతుతనంతో ఒకరి బట్టలు మరొకరు చింపుకొనవచ్చును. చేతగానితనం చేత అసహాయస్థితిలో కోరినది దొరకలేదని ఉడుకుబోతుతనం రావచ్చును.

అసూయ అంటే అపనమ్మకం, కోపం అని కూడా చెప్పవచ్చును. డబ్బిస్తే ఎగగొట్టుతాడేమో అని, ఏదో కొని పట్టుకురమ్మని రూకలిస్తే కొంత కాజేస్తాడేమో అని, దొంగబేరం, దొంగమాటలు చెప్పుతున్నాడేమో అని, నిజం చెప్పక దాచివేస్తున్నాడేమో అని, తనమీద ఏమైనా కుట్రజేస్తున్నాడేమో అని అపనమ్మకం కల్గవచ్చును. తన కేదైనా అన్యాయం, అపకారం జరిగితే సహజంగా కోపం వస్తుంది. అవుత వనుకొనిన పనులు జరుగకపోయినా, ఆశించిన కోర్కెలు సఫలం కాకపోయినా, తనమీద వ్యతిరేకభావం కల్గి అపనిందలు వేసినా కోపం వస్తుంది. కాని, ముఖ్యంగా ఈర్ష్య (ఎన్వి) అంటే ఓర్వలేనితనం, అసూయ (జెలసి) అంటే అనుమానం అని అర్థాలు చెప్పుకోవాలి.

౧౫

సహాయంపొంది శత్రువైనాడు

మధ్యతరగతికి చెందిన వెంకట్రావు కాలేజిలో చదువుచున్నాడు. అకస్మాత్తుగా తండ్రి చనిపోవటంవల్ల ! ఇంటికి చేరవలసి వచ్చింది. తన కొక తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్లున్నారు చిన్నవాళ్లు. జ్ఞాతులు, బంధువు లున్నా పట్టించుకోరు. వాళ్ల సంసారాలు ఈదుకోవటంలోనే వాళ్లకు సరిపోతున్నది. పైగా, ఈ రోజుల్లో పూర్వంలాగు అభిమానా లెక్కడ చచ్చాయి? పల్లెటూళ్లలో ఇచ్చకాలు చెప్పేవాళ్లేగాని, సాయాలు సున్న.

పైగా ఒకళ్లు చూస్తే మాత్రం ఆస్తిపాస్తులు సరిగా వుంటవా? కాలేజి చదువు మానటం తప్పలేదు. వచ్చి పొలం, పుట్రా, గొడ్డు, గోదా చూచుకోవటం ప్రారంభించాడు. చేతులు కాళ్లు పుంజుకొని మూడు నాలుగేళ్లలో స్థిమితపడ్డాడు. ఇంతలో రాజకీయాలు ఉద్ధృత మయ్యాయి. గాంధీజీ నాయకత్వంక్రింద ఉద్ధృతం పల్లెటూర్లకు ప్రాకింది. పల్లెటూళ్లలో కూడా రాజకీయ వాదుల మంటూ బైలు దేరుతున్నారు. నాయకుల మంటూ జనాన్ని ఆకర్షించటం మొదలుపెట్టారు. పలుకుబడి వృద్ధిచేసుకొని ప్రజా నాయకుల మౌదామని తహతహ లాడుచున్నారు. ఇదంతా చూచేటప్పటికి, వెంకట్రావుకు ఆలోచనలు మొదలుపెట్టాయి. డొక్కాడనివాళ్లు, చదువు సంధ్యలు లేనివాళ్లు నాయకుల మంటూ ఊరేగుతున్నారు. కొద్దోగొప్పో ఉన్నవాణ్ణి, కాలేజి చదువు కొంత వరకైనా చదివినవాణ్ణి అనామకుడనుగా ఉండిపోవలసిన దేనా? మనం కూడా కాంగ్రెసు బురఖా వేసుకొని రాజకీయాల్లో చొరబడదాం. పదిమందిలో పలుకుబడైనా కల్గుతుందికదా! దేశభక్తి, జాతి పురోగతిమాట దేవుడెరుగును, ముందు పలుకుబడి సంపాదించవచ్చును, ఊళ్లో పదిమందిని కూడగట్టుకోవచ్చును అని అనుకొని, ఖద్దరు బట్టలు కట్టట మారంభించాడు. ముందు కాంగ్రెసు శిబిరాలలో వాలంటీరుగా చేరాడు. ఊళ్లో గ్రామ కాంగ్రెసు కమిటీని ఏర్పాటు చేశాడు. పదిమందినీ కూడగట్టుకొని క్రమేపి ఫిర్కా, తాలూకా కమిటీలలో జొరబడ్డాడు. పెద్దల నాకర్షించాడు. జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడైనాడు. రాష్ట్ర కమిటీలో చేర్చ బడ్డాడు. ఇంకేమి, పదిమందీ తనచుట్టూ మూగట మారంభ మైంది. తా నిప్పుడు కాంగ్రెసు నాయకుడు. ఛోటా నాయకు డైనా, నాయకుడేకదా! పైగా దేశసేవాతత్పరులం, ప్రజల కోసమే పాటుబడుతున్నాం, మా సర్వస్వం ధారబోస్తున్నాం అనే బడానాయకుల ప్రాపు లభించింది. ఇక తన పలుకుబడి కేమి తక్కువ? జిల్లాలో ఏ పనైనా తన చేతిలోనే వున్నది.

వెంకట్రావు ఊళ్లోనే బసవయ్య అనే సన్నకారాసామి వున్నాడు. చిన్నచిన్న మట్టి కాంట్రాక్టులను చేసికొంటూ ఎట్లో జీవితయాత్రను కొనసాగిస్తున్నాడు. చదువుకొన్నది

మూడోక్లాసు వరకే అయినా, లెక్కా డొక్కా కొంత తెలిసిన వాడు. కుయుక్తులు నేర్చుకొన్నాడు. కంట్రాక్టరు కా మాత్రం తెలియటాలు, తెలివితేటలు లేకపోతే బ్రతుకగలడా? వెంకట్రావు రాజకీయ పురోగతి, పెరుగుచున్న పలుకుబడి చూస్తునే వున్నాడు. అతన్ని ఆశ్రయిస్తే తన కేవైనా మంచి కంట్రాక్టులు, పెద్ద కంట్రాక్టు లిప్పించగలడు. ఎంతకాదన్నా కొంత దూరబంధుత్వ మున్నదికదా, మొగమాటపడకపోతాడా అనుకొని అతడు ఊళ్లోకి వచ్చాడని తెలిసి ఒక ఉదయం కొన్నిపండ్లు, ఒక పూలదండ పట్టుకొని అత నింటికి వెళ్లాడు. అప్పటికే వాళ్లూ వీళ్లూ వచ్చి వెంకట్రావు దర్శనంకోసం వేచియుండినారు. ఉపాయాలు తెలిసిన వాడు కాబట్టి, వాళ్లు వెళ్లేవరకు ఒక వారగా ఉండిపోయాడు. వెంకట్రావు ముందు చావడిలోనుండి ఇంట్లోకి వెళ్లిబోవుచుండగా కొద్దిగా దగ్గాడు. ఇంకా ఎవరో వున్నారని వెంకట్రావు చూడగా బసవయ్య ముందుకు వచ్చి మెల్లో పూలదండ వేసి, పళ్లు చేతి కందించాడు. వెంకట్రావు నవ్వుచు, "ఇదేమి టీ రోజున ఎప్పుడూ లేనిది? నీవు కూడా కాంగ్రెసులో చేరావా క్రొత్తగా" అన్నాడు. "లేదన్నా, నే నెంత కొద్దివాడనైనా, నీకు బంధువు డనేకదా. నీ వింత గొప్పనాయకుడ వైతే, ఆమాత్రం గౌరవించ వద్దా? నేను మొదటినుండీ కాంగ్రెసువాదినే. చూడు నా ఖద్దరు బట్టలు. ఈరోజున క్రొత్తగా కొన్నవికావుకదా" అన్నాడు. వెంకట్రావుకు బసవయ్య బంధువర్గంలోనివాడని గుర్తుకు వచ్చింది. బసవయ్యను బాగా ఎరిగివున్నా, తాను రాజకీయ హడావుడిలో పడినతర్వాత, ఎవరు బంధువులో, ఎవరు స్నేహితులో పట్టించు కోవటంలేదు. తా నందరికి సమానుడే. వా రందరూ తన సహాయులే, సహచరులే, అనుచరులే. కాని, త నింటికి వచ్చి తన నింతగా మెచ్చుకొంటున్న బసవయ్యను చూస్తే కొంత అభిమానం కల్గింది. ఇంతలో, అతని తల్లి వచ్చి చూచి, "నీవా బసవయ్యా, చాలాకాలానికి కనపడ్డావు. పిల్లా జెల్లా బాగున్నారా? పరాయి వానివలె బైటనుంచున్నావెందుకు? రా, లోపలి"కని, లోపలి హాలులోకి తీసుకొనివెళ్ళి, కాఫీ తెస్తా నుండమన్నది. "అబ్బే. వద్దు పెద్దమ్మా, ఇప్పుడే తీసుకొని వచ్చాను. అన్న ఊళ్లోకి

వచ్చాడంటె చూచి వెళదామని వచ్చాను. మిమ్మలను చూచి చాలాకాలం అయిందికదా '' అని అక్కడి కుర్చీలో కూలబడ్డాడు. ఆ మాట ఈ మాట మాట్లాడి ఆమెగా రింట్లోకి ఏదో పనిమీద వెళ్లిపోయింది. ఎదురుగా కూర్చుని వున్న వెంకట్రావు బసవయ్యను, '' విశేషా లేమిటి? ఏం పని చేస్తున్నా '' వని అడిగాడు. '' అన్నా, నాకు నీమాదిరిగా పొలం పుట్రా లేదుకదా! ఏ కుంటో, ఎకరమో ఉంటే అరడజను పిల్ల లున్నవాణ్ణి, ఎలా సరిపోతుంది? ఏవో చిల్లరమల్లర కాంట్రాక్టులు చేసుకొని జీవనం గడుపుకొంటున్నాను'' అన్నాడు. ''అలాగా'' అని వెంకట్రావు ఊరుకొన్నాడు. సుముఖంగా వున్నాడు, ఇదే సమయమని బసవయ్య ''అన్నా, నీవు గొప్పవాడవు కదా, నీకు బోలెడంత పలుకుబడి వున్నది. కనికరించలేవా ఈ బీద బంధువుణ్ణి'' అని దీనమొగం పెట్టి అడిగాడు. వెంకట్రావు ఆలోచననుండి తేరుకొని, '' బసవయ్యా, నేను ప్రజల మనిషిని. నీవు కాంగ్రెసువాడివి కూడాను. అందరికి చేసినట్లే నీకుమాత్రం ఎందుకు చెయ్యను? ఏవిధంగా నా సాయ్యం కావా''లని అడిగాడు. '' ఏమీ లేదన్నా, పిల్లలు పెరిగివస్తున్నారు. నలుగు రాడపిల్లలు కూడాను. వాళ్లి బట్టలు గిట్టలు, చదువు సంధ్య లటుంచి, నా చిల్లర కాంట్రాక్టుల లాభం ఇంటి తిండికైనా సరిపోవటంలేదు. నీవు దయదలిస్తే ఏ మంచి కాంట్రాక్టులైనా ఇప్పించగలవు. మాకు జీవనోపాధి కల్పించిన పుణ్యం నీ కుంటుం '' దని మనవిపూర్వకంగా చెప్పుకొన్నాడు. వెంకట్రా వంతా విన్నాడు. ఇతడు మాటలు నచ్చేటట్లు చెప్పుతాడు. కాంట్రాక్టరు కాబట్టి, ఏవో తెలివి తేటలో, కుయుక్తిలో ఉంటాయి. చేరదీస్తే మన కేమైనా ఉపయోగపడవచ్చును అని ఆలోచించి, ''సరే బసవయ్యా, ఎక్కడేమైనా మంచి కాంట్రాక్టు చూచుకొని, ఎవరికి చెప్పితే పనౌతుందో తెలుసుకొనిరా'' అని పంపివేశాడు.

మొదట చిన్నకాంట్రాక్టులు, తర్వాత మధ్యరకంవి, తర్వాత కొంచెం పెద్దవి వెంకట్రావు సిఫార్సులతో చేతికందాయి. పదులు, వందలు, వేలు లాభాలు వచ్చాయి. మధ్యరకం పనులు చేస్తున్నప్పుడు ఒక చిన్నగుమాస్తాను పెట్టుకొన్నాడు. పెద్దవి

వచ్చినప్పుడు సూపర్‌వైజర్ని కుదుర్చుకొన్నాడు. ఒక రిద్దరు మేస్త్రీలు చేతిక్రిందకు వచ్చారు. కూలీజనం "దొరగారూ" అంటూ తనచుట్టూ మూగటం పరిపాటైపోయింది. ఊళ్లో పదిమంది బసవయ్య పెద్దకంట్రాక్ట రయ్యాడ్రోయ్ అని చెప్పుకో సాగారు. కొందరు "బసవయ్యగారూ" అని గౌరవించటం మొదలు పెట్టారు. బసవయ్య తన పాతకొంప పూడదీసి డాబా కట్టించాడు. పదెకరాలు మాగాణి కొన్నాడు. కొందరు రాజకీయ పెద్దలతో పరిచయమైంది. ముఖ్యంగా తన పనుల సంబంధమైన ప్రభుత్వ ద్యోగులతో స్నేహం ఏర్పడ్డది. పెద్దలను పొగడ్తలతోను, పండ్లు, పూలదండలు వగైరాతోను మెప్పించగా, ఉద్యోగులను పరసెంటేజిలతో తృప్తిపరచాడు. తనప్రభ సాగిపోతున్నది. వేలతో తృప్తిపడతాడా తనవంటి తెలివితేటలు, చాకచక్యం కలవాడు! కక్కుర్తిపడే ఒకరిద్దరు రాజకీయవేత్తలను ఏవేవో ఆశలు పెట్టి తనవాళ్లను చేసుకొన్నాడు. వెంకట్రావును పొగడ్తలతోను, ఆయన తల్లి పూర్వకాలం అభిమానంతోను సుముఖుణ్ణిగానే వుంచుకొన్నాడు. ఇతర రాజకీయ నాయకులతో లాలోచిపడి చేతులు కలిపింది వెంకట్రావుకు తెలియనిస్తే కొంప మునగదా! ఆ పిచ్చిపని చేస్తాడా? ఉద్యోగుల పరసెంటేజిలు పైకి పొక్కనిస్తాడా? వెంకట్రావుకు ఇతర రాజకీయాల వాళ్ళని ఆశ్రయిస్తున్నా డంటే చిరాకుకలిగి తనకిచ్చే సాయం తప్పిస్తాడేమోగాని, ఉద్యోగుల విషయమై తెలిసినా పట్టించుకోడు. వాళ్ళు, అతనంటే భయ భక్తులు చూపిస్తారు కదా! ఈ రకంగా పెద్ద పెద్ద కాంట్రాక్టులే సంపాదించ కల్గాడు. లక్షలు లాభం కళ్లకు కనబడుతున్నది. డాబాను పెంచి పైన మేడవేశాడు. తన పిల్ల లిప్పుడు ధనవంతుని బిడ్డ లయ్యారు. ఇప్పుడు తా నొక ప్రముఖుడు. పదిమందీ తన చుట్టూ చేరుచున్నారు. స్తోత్రపాఠకులు, యాచకులు, మీరిది చేసిపెట్టండి, అది చేసిపెట్టండని ప్రార్థేయపడుచున్నారు. చేస్తానని, చేసి కొంతమందిని కూడగట్టుకొన్నాడు. ఊళ్ళో పలుకుబడి పెరిగింది; ప్రముఖుడైనాడు. ఒకరికి వంగివంగి దణ్ణాలు పెట్టటం, లొంగివుండటం ఇప్పు డవసరంలేదు. తానే దణ్ణాలు పెట్టించు

కొంటున్నాడాయె. తన నెక్కడెక్కడవాళ్ళో ఆశ్రయిస్తున్నారాయె.

పంచాయితీ రాజ్యం అంటూ ఒక పెద్ద గాలిదుమారం వచ్చింది. ప్రతి గ్రామంలోనూ పంచాయితీలు పెట్టాలన్నారు. ఎన్నిక లన్నారు. వెంకట్రావుకు బుద్ధిపుట్టింది గ్రామపెత్తనం చేజిక్కించుకోవాలని. ఇంతవరకు తనమాటే చెల్లుతున్నా, తానే ప్రముఖుడుగా వుంటున్నా అది కాంగ్రెసు నాయకుడుగా. ఇప్పుడు పంచాయితీకి చాలా అధికారాలిచ్చారు. ప్రెసిడెంటయితే మరీ మంచిది. తనపెత్తనం గట్టిపునాదిమీద స్థిరపడుతుంది అనుకొని తనపార్టీ సన్నిహితులకు తన కోరిక్కను తెలిపాడు. ప్రచారం మొదలైంది. కొలది రోజులు గడిచాయి. ఎవరో వచ్చి, "మీకు పోటీ వుండదనే అనుకొన్నాం. ఆ కంట్రాక్టరు బసవయ్య లేడూ, అతడు కూడా మీవార్డులోనే నుంచుంటున్నాడట. ప్రచారం మొదలుపెట్టా" డని చెప్పాడు. వెంకట్రా వాశ్చర్యపడి, ఇది నిజమైవుండ దనుకొని బసవయ్యకు కబురంపాడు. వెళ్దామా, వద్దా అని తటపటాయించి, వెళ్లకపోతే అతనికి భయపడిన ట్లవుతుంది, వెళ్లి చూద్దాం అనుకొని వెళ్లాడు. వెంకట్రావు, "ఇదేమిటయ్యా బసవయ్యా, నువ్వు నా వార్డులోనే నుంచున్నావట? అంతగా నుంచోవాలంటే మీ ప్రక్క లేదా" అన్నాడు. "మా ప్రక్క మా బావమరది నుంచుంటానని పట్టుబట్టాడు. నా భార్య వాళ్లూ, 'బావమరిదిమీద నీకు పోటీ ఏమిటి? ఊళ్లో పలుకుబడి కలవాడివి, నీ వెక్కడైనా గెలుస్తావు. ఆ వెంకట్రావు పెద్ద కాంగ్రెసు నాయకు డయ్యె, ఈ చిన్నదాంట్లో జోక్యం కలిగించు కొంటాడా' అని మావాళ్లు నూరిపోస్తే ఈ ప్రక్క నిల్చున్నాను. తీరా మా టిచ్చిన తర్వాత, నీవు కావాలంటున్నావని తెలిసి ఆశ్చర్యపడ్డాను. నేనే వచ్చి 'నీకెందు కీ చిన్నపని. నీ వెట్లయినా ఈ యూరికి పెద్దవు. పంచాయితీ మెంబరయినంతమాత్రాన హోదా పెరుగుతుందా? నావంటి చిన్నవాళ్లకు ఆశవుంటుంది కాని' అని చెప్పుకొందాం అనుకుంటున్నాను. ఇంతలోకే నీ కబురు వచ్చింది. ఏమంటావు?" అన్నాడు. వెంకట్రావు, వీ డెంత నక్కజిత్తులమారివాడు అని చకితుడయ్యాడు.

కోపం ముంచుకొని వచ్చింది. "బసవయ్యా, ఏదో బంధువుడవు, అమ్మ అభిమానిస్తున్నది, లేనివాడవు, సాయంచేస్తే సుఖజీవనం చేస్తావు, కృతజ్ఞుడవుగా వుంటావు అనుకొంటే నాతోనే పోటీకి దిగి, ఏవేవో సాకులు చెప్పుతూ పైగా నన్నే మానుకో మంటావా? మెంబరు అయితేనే గాని ప్రెసిడెంటును కాను. గ్రామస్థులకు అవసరమైనవి, ఉపయోగపడేవి చేయవలసిన పనులు చాలా వున్నవి. ఏదో కొంత అనుభవం సంపాదించాను కదా, ప్రజాసేవ చేస్తున్నాను కదా, మన గ్రామాన్ని బాగుచేయాలని నేను ఆశిస్తుంటే నీ వెదురు నిల్చుంటా నంటావా? కాంట్రాక్టులు చేసుకొంటున్నావు. మస్తుగా సంపాదించావు, సంపాదించు కొంటున్నావు. వానితో సరిపెట్టుకోక, చేసిన సాయమైనా గుర్తు పెట్టుకోక నన్ను వ్యతిరేకిస్తావా" అని గట్టిగా మాట్లాడాడు. బసవయ్యకు కూడా తాను ప్రెసిడెంటును కావాలనే గాఢవాంఛ యున్నదని, వెంకట్రావు మెంబరుగా వస్తే తన కా అవకాశ ముండదని తన వార్డులోనే పోటీపెట్టాడని వెంకట్రావు వూహించుకో లేదు. వెంకట్రావు కోప్పడటం బసవయ్య పట్టుదల నెక్కువ చేసింది. "నీ వట్లా కోప్పడతావేమిటి? నీ వేదో సాయంచేశావని నీకు లొంగి వుండ మంటావా ఏమి? నీ కున్నట్లే నాకు మాత్రం కోర్కె లుండవా? నీ వేదో గ్రామా న్నుద్ధరిస్తా నంటున్నావు. నేను మాత్రం చెయ్యలేనా? నీవు రాజకీయ నాయకుడవే కావచ్చును. ఏ పని ఎట్లు చేయించాలో నాకు తెలిసినట్లు మాటలతో కాలం బుచ్చే నీ కేమి తెలుస్తుంది? నా అనుభవంలో సగమైనా నీ కుందా" అంటూ విసవిస నడచిపోయాడు. వెంకట్రావు నిర్ఘాంతపోయాడు. మనుష్యుల్లో ఇటువంటి కృతఘ్ను లుంటారు కాబోలు. సాయం పొంది ఎదురు తిరుగుతారు అనుకొని తనప్రచారం కొనసాగించు కొన్నాడు. ఊళ్లో గాలిదుమారం చెలరేగిన ట్లయింది. ఎక్కడ చూచినా గుంపులు గుంపులుగా, మతాలు మతాలుగా ప్రచారాలు, ఇంటింటికి తిరుగుళ్లు, దూషణలు ప్రారంభమై, కేకలు బొబ్బలతో వృద్ధిపొంది కొట్లాటల్లోకి దిగింది.

ఆ వూళ్లోని పురోహితుడు పేరయ్య వెంకట్రావు కుటుంబానికి కూడా పురోహితుడే. ఆయన సాత్వికుడు. ఒక విధంగా అమాయకుడు. బాబూ, నాయనా అంటూ జరుపుకుపోతున్నాడు. పెద్దకొడుకు తండ్రివంటి మంచివాడే కాని రెండో కొడుకు శంకరయ్య సంస్కృతం వగైరా చదువుకొన్నానని, కవిత్వం వ్రాస్తానని తనపేరుకు దీక్షితు లని తగిలించుకొని శంకరదీక్షితు లని చెప్పుకుంటున్నాడు. ఎలెక్షన్ల ప్రస్తావన రావటానికి కొంత కాలంక్రితం వెంకట్రా వింటికి వెళ్లి "బాబుగారూ, నే నొక చిన్న కావ్యం వ్రాశాను. బాగా కుదిరింది. మీకు అంకిత మిద్దామని బుద్ధిపుట్టింది" అన్నాడు. "నా కెందు కయ్యా అంకితం, గింకితం. ఆ అభిలాషున్నవాడి కిచ్చుకోరాదా" అన్నాడు. "అట్లుకాదు వెంకట్రావు బాబుగారూ, మీరు గొప్ప కాంగ్రెసు నాయకులు. ఈ వూళ్లోకి మీ రసలు పెద్దలు. ఊరి పేరు బైటకు తెచ్చారు. మీ ఇంటి పురోహితుడి కొడుకుని మీ కివ్వక, మరియొకరి కిస్తే ఏం రాణింపుగా వుంటుంది? నేను చదువుకొన్నందుకు, కవినైనందుకు నా కావ్యం మీ రంకితంపొందితేనే సార్థకమౌతుం" దని ప్రార్థేయ పడ్డాడు. వెంకట్రావు మెత్తపడి "సరే, అట్లే కాని" మ్మన్నాడు. "బాబుగారూ, కావ్యం సాఫీ వ్రాసి యుంచాను. అచ్చొత్తించా" లన్నాడు. "ఆ పని పూర్తిచేసుకొనిరా" అని వెంకట్రావు జవాబిచ్చాడు. "ఏం పెట్టి అచ్చువేయించమంటారు? మా పురోహితబ్రాహ్మణులకు ఒక పూట గడిస్తే రెండోపూట గడవదని మీకు తెలిసేవున్నదికదా! మా నాయన సంపాదన అంతంత మాత్రం. పిల్లా జెల్లా జాస్తి. మీ రేదైనా ఇస్తేగాని అచ్చుపడ" దన్నాడు. అసలు సంగతర్థమైంది వెంకట్రావుకు. అయినా నోరు జారాను. ఇక తప్పదని ముద్రణ కెంత ఖర్చవుతుందో తెలుసుకొని డబ్బిచ్చి పంపాడు. చిన్న పుస్తకం కాబట్టి త్వరలోనే ముద్రణయింది. శంకరదీక్షితులు చేతులు నలుపుకొంటూ ఒక కాపీని తెచ్చి చూపించి, "దీని నిట్లా మీ చేతి కిస్తే మీ రంకితం పుచ్చుకొన్న ఘరానా కనబడదు. ఏ మంత్రిగారినో ఆహ్వానించి మన సమీపం గుడివాడలో ఏ మంచి హాలులోనో సభ నేర్పాటుచేసి మంత్రిగారి సమక్షంలో నా అంకితాన్ని మీరు పొంది, ఆయనచేత ఆవిష్కరింప

జేస్తే చాలా బాగుంటుంది. మీ హోదాకు తగిన ట్లుంటుంది" అని చెప్పుకుపోయాడు. వెంకట్రా వాలోచనలోపడ్డాడు. ఈ బ్రాహ్మడు తన లాభంకోసం తనను బోలెడు ఖర్చు పెట్టమంటున్నాడు. మంత్రిని పిలవటం, సభ పెట్టటం మాటలతో అవుతుందా? చాలా ఖర్చు పెట్టా లనుకొని, "ఎందుకయ్యా అంత శ్రమ? నాకెక్కడ తీరుబడి చచ్చింది? మంత్రుల కేమిలే, నే నెరుగనివారా? అయినా, దుబారా ఖర్చెందుకు? చక్కగా మా యింట్లోనే అంకిత మివ్వవచ్చునుకదా? అంకితం అని ఏవేవో పొగడి పుస్తకంలోనే ముద్రింపించితివికదా! ఇక పుస్తకం చేతికివ్వటమేకదా. మన వూళ్లోవాళ్లను పదిమందినీ పిల్చి, పని పూర్తిచేసుకొందాం" అని తేల్చి చెప్పాడు. పాపం, శంకరదీక్షితులకు నిస్పృహ కొట్టుకువచ్చింది. అంకితం అనే నెపంతో ఎన్నో ఆశలు పెట్టుకొన్నాడు. అయినా, ఆయ నట్లు అంటుంటే తాను చేసే దేమీ లేదనుకొని "సరే, మీ ఇష్ట" మన్నాడు. కొలదిరోజులు గడిచిన తర్వాత సభ అంటూ తంతు ఏర్పాటుచేసి, అంకితం జరిపించి ఖద్దరు చాపు, పదిరూపాయలు శంకరదీక్షితులు చేతిలో పెట్టి సరిపుచ్చాడు. దీక్షితులకు మండుకు వచ్చింది. తా నింత ఆశ్రయించి, ఇన్ని ఆశలు పెట్టుకొంటే, ఇంత చిన్నచూపు చూస్తాడా, ముదక ఖద్దరు బట్టలతో, ముష్టి పదిరూపాయలతో సరిబుచ్చుతాడా అని దుఃఖంవచ్చినంతపనై, ముఖం మాడ్చు కొంటూ వెళ్లివస్తా నన్నట్లు తలాడించి బిరబిరా వెళ్లిపోయాడు. ఇక ఆ యింటి గుమ్మం త్రొక్కలేదు. కొన్నాళ్లకు పంచాయితీ ఎలెక్షను గందరగోళం వచ్చిపడింది. వెంకట్రావు, బసవయ్య నీ వెం తంటే నీ వెంత అని కుమ్ములాడుకొంటున్నారు. వెంకట్రా వెళ్లైనా ఓడిపోతేగాని తన క్రోధం చల్లారదు. అతగాడికి బుద్ధి రావాలంటే బసవయ్య గెలవాలి, తాను కూడా అందుకు శాయశక్తులా తోడుపడాలి అని నిశ్చయించుకొని, బసవయ్య పార్టీలో దూరాడు, "నేను ప్రచారానికి తోడుపడతాను. నా చదువు వృథాపోనిస్తానా. ఇదిగో దీనిని కరపత్రంగా ముద్రింపించి ఊరంతా పంచిపెడదాం. వెంకట్రావు బండార మంతా ఇందులో బైటబెట్టాను. కాంగ్రెసు బురఖాతో, నాయకుడ ననే ప్రగల్భా

లతో అతని పక్షపాతం, కుంచితబుద్ధి దీనిలో కడిగేశా" అని నచ్చచెప్పి, బసవయ్యచేత దానిని అచ్చువేయించి కరపత్రాలను మేగఫోను సాయంతో ఊరంతా తిరిగి తానే స్వయంగా పంచిపెట్టాడు.

చాలా తీవ్రమైన పోటీ ఊరంతా జరిగింది. తలలు బ్రద్ద లవలేదు గాని ఇంచుమించు అంత ఘర్షణలు జరిగాయి. చావుదప్పి కన్నులొట్టపోయినట్లు వెంకట్రావు, అతనికి మద్దతు నిచ్చిన ఇతర పోటీదారులు గెల్చారు. మొత్తంమీద వెంకట్రావుకే కొంత మెజారిటి లభ్యమైంది. వెంకట్రావే ప్రెసిడెం టయ్యాడు. ఎంతకాదన్నా వెంకట్రావు చాలాకాలంనుండి పలుకుబడిలో వున్నాడయ్యె, క్రొత్తగా బరిలోకి వచ్చిన బసవయ్య, అతని మద్దతుదారులు ఎందుకు సమమౌతారు? పైగా బసవయ్య అన్ని సంచులు గ్రుమ్మరించలేకపోయినా, వెంకట్రావంత లేనివాడు కాదు కదా! అతని మద్దతుదార్లల్లో ఒకరిద్దరు డబ్బుఖర్చుపెట్టటానికి వెనుదీయలేదు. సరే, ఎట్లాగో వెంకట్రావు గెలిచి బైటబడ్డాడు. ప్రెసిడెంటు పదవిని పొందాడు.

హడాహుడి సర్దుకొన్నతర్వాత వెంకట్రావు సంగతులు నెమరువేసుకొన్నాడు. బసవయ్య ఎంతపనిచేశాడు! ఈ బక్క బ్రాహ్మడు శంకరయ్య కెందు కింత విరోధభావం? పుణ్యానికి వెళ్లితే పాప మెదురైనట్లున్నది. తాను సాయంచేయకపోతే బసవయ్య ప్రబలుడయ్యేవాడేనా? తాను డబ్బివ్వకపోతే శంకరయ్య తనపుస్తకం అచ్చువేయించుకొనగల్గేవాడేనా? ఏమోలే అని సహాయంచేస్తే శత్రువులై కూర్చున్నారు అని నిట్టూర్చాడు.

౧౩

నన్ను పుట్టించ మన్నానా ?

"ఒరే రామూ, నీ వీ ఉదయం వాళ్లి కృష్ణుణ్ణి కొట్టావట. పైగా వాడి కలం లాక్కొచ్చావట. మొన్ననేమో, ఆ ప్రక్కింటి లక్ష్మణుడితో పోట్లాడి వాడి చొక్కా చింపేసి, పిడిగుద్దులు గుద్ది,

జుట్టు పీకావట. ఏమిటిరా ఈ గల్లంతు ? మాకు చెడ్డపేరు తీసుకొని వస్తున్నావు. మమ్మలను వీధిలోకి లాగుతున్నావు. ఈ దౌర్భాగ్యం పను లేమిటి ? మా కడుపు చెడబుట్టావురా '' అని తండ్రి జానికయ్య గట్టిగా చివాట్లుపెట్టగా, రాముడు ఎదురు తిరిగి, ''వాళ్లు మంచివాళ్లా, నేను చెడ్డవాణ్ణా ? కడుపు చెడబుట్టావంటున్నావు. నన్ను పుట్టించ మని నే నేడ్చానా ? కావాలని నా అంతట నేను పుట్టానా ? మీ తృప్తికొరకు మీరు కన్నారు'' అని దబా యించటం మొదలుపెట్టాడు. ఇంతలో తల్లి సుందరమ్మ వచ్చి, ''ఏమి టా దుడుకుతనం, ఎం తెంత మాట లంటున్నావు ? భార్యా భర్తలం గనుక సంసారంచేయటం తప్పుతుందా, బిడ్డలు పుట్టకుండా ఉంటారా ? నీవంటి వెధవ పుట్టాలని మేము కోరుకొన్నామా ? పుట్టక పుట్టక నీవంటి దౌర్భాగ్యుడే పుట్టాలా మా కర్మ కాక పోతే ? పుట్టినప్పుడు అందరి బిడ్డలవంటివాడే అనుకున్నాం గాని నీవంటి పొగరుబోతు, దౌష్ట్యంచేసేవా డవుతాడని ఎవ రూహించారు'' అని మందలించింది.

ఇం కొకసారి తండ్రి ''ఏరా, నీవు బడిలోకి సరిగా వెళ్లటం లేదట. పాఠాలు బాగా చదవటంలేదట. ఇంటివద్ద చేసుకురమ్మన్న పనిని ఎగగొట్టుతున్నావట. బోలె డంత డబ్బు పోసి చదువు చెప్పిస్తుంటే ఇ దేమి పనులురా'' అని అడిగితే రాముడు ఉద్రిక్తుడై, ''నాకు చదువు చెప్పించం డని నేను బ్రతిమాలానా ? మీ దిలాసా కొరకు, మీ కొడుకు చదువుచున్నాడని గొప్పలు చెప్పు కొనటానికి మీరు నన్ను చదివిస్తున్నారు. పైగా డబ్బు ఖర్చవు తున్నదని గోలపెడుతున్నారు'' అని ఎదురుచెప్పి, గిర్రున తిరిగి ధుమధుమ లాడుతూ బైటికి వెళ్లిపోయాడు.

కాలం గడచిపోయింది. రాముడు పెద్దవాడైనాడు. ఎట్లూ తప్పదని తలిదండ్రులు నానా అవస్థ పడి, సంబంధం కుదిర్చి పెండ్లి చేశారు. భార్య కాపురానికి వచ్చింది. అయినా, రాముడు తన ఆకతాయితనాన్ని పోగొట్టుకొనలేదు. గిల్లి కజ్జాలు తెస్తూనే ఉన్నాడు. చదువు కొద్దో గొప్పో అబ్బినా, ఏ చిన్న ఉద్యోగమైనా

చేయటంలేదు. ఇంకొక పనైనా ముట్టడు. తండ్రికి తానొక్కడే కొడుకైనా ఇంచు కంతైనా సాయపడడు. తినటం, తిరగటం, ఇంటికి వేళకు, పాళకు రాక భార్య భోజనం, ఇబ్బందికి ఒక్కొక్కప్పుడు పస్తుకు కారణమౌతున్నాడు. చీటికి, మాటికి భార్యను తిట్టటం, కొట్టటంవంటి దాష్ట్యాలు సాగించాడు. "ఏమిరా, ఇదేమి ఘోరం? ఇంటి పట్టున ఉండవు, వేళకు, పాళకు రావు, పైగా భార్యను హింసిస్తున్నావు" అని తలిదండ్రులు కోప పడితే, "నా కెందుకీ భార్యను అంటగట్టారు? నేను కావాలని చేసుకున్నానా? మీ స్వంత సంతోషం కోసం కోడలు కావాలని మీరు ఉబలాటపడటంవల్ల ఈ దీనిని తెచ్చుకొన్నారు" అని వాదంచేసి, దులపరించుకొని వెళ్లిపోయాడు.

ఈ రోజుల్లో మగ, ఆడ పిల్లలు పెరగగానే తామేమి చేసినా తలిదండ్రులు ఒప్పుకోవాలని, తాము చెప్పిన మాట, ఆడిన ఆట, పాడిన పాట ఆమోదించాలని, తాము పూర్తి స్వేచ్ఛతో తా మిష్టం వచ్చినట్లు సంచరించాలని కోరుకుంటున్నారు. అమలులో పెట్టటానికి ప్రయత్నిస్తున్నారు. తలిదండ్రు లేమైనా అభ్యంతరం చెప్పితే, "మమ్మల నెందుకు పుట్టించారు? పుట్టించిన తర్వాత మా కోర్కెలు మీరు తీర్చాలి. మా దిలాసాలకు మీరు డబ్బివ్వాలి. మా నడవడులకు మీ రడ్డు రాకూడదు. మా స్వతంత్ర ప్రవృత్తికి మీరు తోడుపడాలి. ఏది మంచో, ఏది చెడో మాకు తెలిసినట్లు మీ కెట్లు తెలుస్తుంది? మా సంతోషం, మా తృప్తి మీ కర్థంకావు. మా ఇచ్చవచ్చినట్లు మేము మా జీవితం గడుపు కొంటాం. ఇది మంచిది ఇది చెడ్డది, ఇది చేయాలి ఇది చేయగూడదు అని మీరు ధర్మపన్నాలు వల్లించకూడదు. మీరు చేయగలిగినంతవరకు ధనం, పలుకుబడి, సాయం మా కందించాలి. మా బ్రతుకు మమ్మలను బ్రతకనివ్వాలి. మా జీవితాన్ని మీ కిష్టం వచ్చినట్లు మీ దిలాసా కొరకు నడపా లనుకోవటం శుద్ధ వెర్రితనం అంటున్నారు.

కృతఘ్నత

గోపాలయ్య ఆ వూరిలో మోతుబరి రైతు. సౌమ్యుడు. దానధర్మాలు చేసే స్వభావం కలవాడు. ఉదయం గ్లాసెడు పాలు తీసుకొని చుట్ట గాల్చుకుంటూ తన ఇంటి ముందు వరండా అరుగు మీద కూర్చుని వున్నాడు. ఎట్లో జీవనం గడుపుకొనుచున్న సన్న కారు రైతు రంగయ్య తన పెద్దకుమారుడు కృష్ణారావును వెంట బెట్టుకొని చేతులు నలుపుకుంటూ గమిడి దాటివచ్చి గోపాలయ్య కెదురుగుండా నిల్చున్నాడు. ఆలోచనలో మునిగియున్న గోపాలయ్య అలికిడి విని, తలెత్తి రంగయ్యను చూచాడు. "రంగయ్యా, రా, ఇటు కూర్చో" అని రెండవవైపు అరుగు చూపించి, "వీడు మీ పెద్దబ్బాయి కాదూ? ఏం చదువుచున్నా" డన్నాడు. "అదే బాబూ, ఆ సంగతే మీతో మనవిచేసుకోవాలని వచ్చాను. ఈఊళ్లో హైస్కూలున్నది కాబట్టి రెక్కలు విరుచుకొని ఏదోవిధంగా పదో క్లాసు వరకు చెప్పించాను. మంచి మార్కులతోనే పాసయ్యాడు. మనం లేని వాళ్లం, ఇంకా తమ్ముళ్లు, చెల్లెళ్లున్నారుకదా, ఇక్కడితో చదువాపి ఏ కొద్ది ఉద్యోగమైనా చేసుకోరా అంటే, దిగులుపడి అన్నం సరిగా తినటంలేదు. వాళ్లమ్మ దగ్గర గోడుగోడు మని ఏడుస్తున్నాడట. వాళ్లమ్మ 'వాడికి చదువు అబ్బుతున్నది, ఏవిధంగానైనా పైచదువులు చదివిస్తే, ఏమో వాడి అదృష్టం ఎట్లున్నదో! పెద్ద ఉద్యోగస్థుడు కాకపోయినా, గౌరవంగా బ్రతుకుతూ, మనకు కూడా పేరు తెస్తా'డని ఒకటే పోరు. ఎటుచూచినా దారి కనపడటంలేదు. ఏమైనా సాయంచేస్తాడేమో అని కొంత బంధుత్వం వున్న ఆ రామయ్య నడిగాను. 'అసలే నే నిబ్బందిలోవున్నాను, నావల్లకా' దన్నాడు. చిన్ననాటినుండి స్నేహంగా వుంటున్నాము కదా అని, ఆ వీరయ్య నడిగాను. 'అన్నా, నా విషయం నీకు తెలియదా? ఏదో కొంచెమో గొప్పో ఉన్నదన్నమాటేగాని నా గంపెడంత సంసారం నీకు తెలుసుకదా! పైగా మా పెద్దాడు కాలేజిచదువంటూ వందలు వేలు తగలేస్తున్నాడు. మా పెద్దమ్మాయి

వెళ్లికి వచ్చి కూర్చుంది. ఈరోజుల్లో వేలు కట్నం కావాలంటారు. నే నేమీ సాయం చెయ్యలేను. నీ వేమీ అనుకోవద్దు'అని మర్యాదగా సాగనంపాడు. ఇక ఊళ్లో మావంటి బీదవాళ్లను కనికరించేది, ఏదో కొంత సాయం చెయ్యగలిగేది, ధర్మాత్ముడవు నీ వొక్కడవే కనిపిస్తున్నావు. నీమీద గంపెడంత ఆశ పెట్టుకొని వచ్చా" నని ప్రాధేయపడ్డాడు. గోపాలయ్యది జాలిగుండె. తనకు పిల్లా జెల్లా వున్నా, వా ళ్లింకా చిన్నవాళ్లు. భూములుగాక ఏదో కొంత వడ్డీకి తిరుగుతున్నది. పోనీలే, రంగయ్య మంచివాడు. కుర్రవాడు అభివృద్ధికి వస్తే ఫలానావారివల్ల పైకివచ్చానని సంతోషిస్తాడు. ఒకరికి సాయం చేయటం మంచిపనేగా అని సమాధానపరచుకొని, "సరేలే రంగయ్యా, కుర్రవానిని ఆలాగే కాలేజిలో చేర్పించు. ఫీజులు వగైరా నేను చూస్తానులే" అని భరవసా ఇచ్చాడు. రంగయ్య సంతోషం పట్టలేక గభేలునలేచి గోపాలయ్య పాదాలకు నమస్కరించి, "నీ మేలెప్పుడూ మరచిపో"నని, కొడుకుచేత దణ్ణాలు పెట్టించి వెళ్లిపోయాడు.

గోపాలయ్యకు కృష్ణారావు కాలేజిలో చేరటాని కయ్యే ఖర్చుతోనే బాధ్యత తీరలేదు. బిడ్డ పుట్టినా ఇం కొకటి పుట్టినా మంత్రసానికి తప్పదన్నట్లు, తీరా కృష్ణారావు కాలేజి చదువుకు ఒప్పుకొన్న తర్వాత హాస్టలుకని, వానికని, వీనికని వందలివ్వక తప్పలేదు. ఈవిధంగా కాలేజి చదువు నాలుగు సంవత్సరాలు గోపాలయ్య చేతి చమురు బాగానే వదిలింది. అయినా, గోపాలయ్య బాగా వున్నవాడు కాబట్టి, ఏటేటా ఆదాయం వచ్చేవాడు కాబట్టి బాధపడలేదు. ఏదోలే, ఆ కుర్రవాడు బి. ఎ. మంచి స్థాయిలోనే పూర్తిచేశాడు, అదే పది వేలు. ఒకనికి ఇంత అన్నం పెట్టిన ట్లయిందని తృప్తిపడ్డాడు.

కొన్ని నెలలు ఉద్యోగంకోసం తిరిగినా, రెండో క్లాసులో బి. ఎ. డిగ్రీని సంపాదించాడు కాబట్టి దగ్గ రున్న పట్నంలో, తహసీల్దారు ఆఫీసులో గుమాస్తాగా కృష్ణారావుకు ఉద్యోగం దొరికింది. తన కున్న కొద్దిభూమిలో ఒక కుంట అమ్మవలసివచ్చినా, కొడుకు పాసై ఉద్యోగస్థుడైనందుకు రంగయ్య ఉబ్బిపోయాడు. తనకున్న మాగాణితోబాటు తన చేను ప్రక్క-ఆసామి భూమిని కొంత

కాలుకు తీసుకొని, రాత్రింబగళ్లు కష్టపడి కుటుంబరథాన్ని మరీ అంత ప్రయాసపడకుండా లాగుకొని వచ్చాడు. ఇక ఫరవాలేదని ఊపిరి వదిలాడు.

కాలం దొర్లి పోయింది. గోపాలయ్య బిడ్డలు ఎదిగి వస్తున్నారు. వ్యవసాయం ఖర్చులు, ఇంటి ఖర్చులు బాగా పెరిగి పోయాయి. అయినా ఆయన కేమీ ఇబ్బంది లేకుండా సుఖజీవనమే చేస్తున్నాడు. అప్పుడప్పుడు రంగయ్య వచ్చి ఏవో కొడుకూసులు చెప్పి దణ్ణంపెట్టి పోతున్నాడు. చదువుకొనే రోజుల్లో కృష్ణారావు ఇంటికి వచ్చినప్పుడల్లా గోపాలయ్యను దర్శించి పోతూనే ఉండేవాడు. గోపాలయ్య "అబ్బాయీ, నీ చదువు బాగా సాగుచున్నదా" అంటే "అంతా మీదయ" అంటుండేవాడు. కాని ఉద్యోగంలో చేరిన తర్వాత ఇంటికి రావటం తక్కువే, గోపాలయ్యను దర్శించటం అరుదే. అరుదుగా ఇంటికి వచ్చినా, ఉదయం ఏ 10, 11 గంటలకో వచ్చి మధ్యాహ్నం ఏ 3, 4 గంటలకో బైలుదేరి వెళ్లిపోయేవాడు. గోపాలయ్యని చూడటానికి వ్యవధి ఎక్కడుంటుంది?

కృష్ణారావుకు ఉద్యోగ హోదా పెరిగిన కొద్దీ అతనికి దర్జా పెరిగింది. తాను ఉద్యోగస్థుడ ననే అహం పెరిగింది. సుఖం, తర్వాత భోగలాలసత్వం పెరిగింది. అద్దెగదిని విడిచిపెట్టి మొదట ఒక చిన్న ఇంట్లోకి, తర్వాత మంచిదైన మిద్దెలోకి మారాడు. ఖరీదుగల కుర్చీలు, సోఫాలు, మేజాబల్ల ఏర్పరచుకొన్నాడు. ఆ పల్లెటూరుకు, పడిపోయేటట్లుండే ఆ చిన్న పెంకు టింటికి, వడిలి పోయిన కూరగాయలతో, ముతకబియ్యంతో, రుచిపచిలేకుండా వండే వాళ్లమ్మ తిండికి వెళ్లటం అసహ్యమనిపించింది. మస్తుగా ఆస్తే గాక, వడ్డీలమీద వడ్డీలు లాగే గోపాలయ్యవద్దకు చేతులు కట్టుకొన్నట్లుగా వెళ్లటం, ఆయన తన్నుద్ధరించినట్లు ధీమాగా ప్రశ్న లడగటం తలకొట్టిన ట్లనిపించింది. తా నా వూరే వెళ్లకపోతే, ఈ హీనత్వం కల్గదుకదా అనుకొన్నాడు.

ఈమధ్య అతని తండ్రి వచ్చి "నీకు పిల్లనిస్తా మని వాళ్లూ వీళ్లూ తిరుగుతున్నారు. ఫలానా వూళ్లో ఫలానా ఆసామి 15 వేలు కట్న

మిస్తా నంటున్నాడు. పిల్ల కొంచెం నలు పనుకో. చదువు సర్వ సామాన్యమైనా. ఇంటిపనులన్నీ తెలుసునట. ఆ సంబంధం కుదిరితే మన కష్టాలు గట్టెక్కుతాయి. నీ పెద్దచెల్లెలు, నీ రెండోచెల్లెలు పెళ్లీడుకు వచ్చారు. వాళ్లకు చెరి ఐదువేలిచ్చి ముడిపెట్టామా, నా కే దిగులుండదు. నీ తమ్ముళ్ళింకా చిన్నవాళ్లు. ఇప్పట్లో వాళ్లకు పెళ్లి పేరంటాలుండవు. పైగా ఇప్పుడిప్పుడే పనిపాటల్లో అక్కరకు వస్తున్నారు. వాళ్లకు నీకువలె చదువు చెప్పించే స్తోమత లేదు. పైగా వాళ్లకు చదువు మీద ధ్యాసకూడా లేదు" అని చెప్పుకు వచ్చాడు. "మీ అమ్మ గట్టిగా నిన్ను ఇంటికి తీసుకురమ్మన్న" దని చివరిమాటగా అన్నాడు. కృష్ణారావు అంతా సావధానంగా విన్నాడు. ఒక నిట్టూర్చి, "నాన్నా, నా పెళ్లి కిప్పుడేమి తొందర వచ్చింది? ఇప్పుడు మా ఆఫీసులో మిక్కిలి తొందర పనులున్నాయి. ఊపిరి పీల్చుకొనటానికి, కాలు కదపటానికి వీల్లేకుండా వున్నది. తర్వాత వీలుచూచుకొని వస్తానని అమ్మకు చెప్పు" అని సమాధానపరచి పంపివేశాడు.

తాను ఆలోచనలో పడ్డాడు. తా నింత కష్టపడి చదువు కొన్నది, తన పెళ్లాం డబ్బును వాళ్లకు ధారపోయటానికా? అదటుంచి పిల్ల నలుపట. చదువు సంధ్యలు లేవట. పైగా, ఆ వూరు మోటూరు. అక్కడివాళ్లు వట్టి పాతరకాలు. మా కుటుంబ పరిస్థితులు తెలిసినవాళ్లు పిల్ల నిస్తామని, అంతకంటె ఎక్కువైనవాళ్లు ముందుకు రారు గాని, మరి నా ఉద్యోగార్జన, హోదా, నా జీవిత పద్ధతులకు చక్కని పిల్ల, చదువుకొన్నది, ఇంకా ఎక్కువకట్నం తెచ్చేది రావాలికదా! కాబట్టి, నేను కుటుంబం అని దేవుళ్లాడకుండా నా స్వంత ప్రయత్నం నేను చేసుకోవా లను కొన్నాడు. తండ్రి రెక్కలు ముక్కలు చేసుకొని ఎవరెవరో నాశ్రయించి చదువు చెప్పించిన మాట వాస్తవమే. అయినా, ఆ మురికి కూపంలోనే వుండ మంటే ఎట్లా? తనకు మాలిన ధర్మం వున్నదా అని నిశ్చయానికి వచ్చేశాడు.

గోపాలయ్యకు ఇతరచోట్ల పెద్దపొలా లున్నాయి, ఒక దూరప్రదేశంలో, ఒక మారుమూల రెండెకరాల చెక్క, పెద్దలు

సంపాదించిం దున్నది. చాలా సంవత్సరాలక్రితం దానిలో మెరకదీసి ఒక ప్రక్క దిబ్బపోయించాడు. ప్రక్కచేను చిన్న ఆసామి చౌకగా ఇస్తా డేమో కొందామని ఉబలాటపడి, "మామా, నీ కెన్నో భూము లున్నవి. ఆ దూరపు చెక్క లేకపో తేనీ కేం తక్కువాతుందీ? నీకు దానిలో వచ్చే ఆదాయం చాలా తక్కువకదా! బీదవాణ్ణి, ఏదో రకంగా నా కిప్పించవే" అని అడిగాడు. "అది గాదురా వెంకయ్యా, మా తాత లెప్పుడో దాన్ని సంపాదించారు. దానిలో ఫలితానికి ఆశపడికాదు. పెద్దలు సంపాదించింది నా చేతులారా పోగొట్టుకోవటం ఇష్టంలేదురా" అని ఖచ్చితంగా చెప్పివేశాడు. కొంతకాలం గడచిన తర్వాత వాళ్ల నౌకరు వచ్చి, "అయ్యా, మన దూరం పొలం ఆ చెక్కవున్నదే, దానిలోని మన దిబ్బను తనప్రక్క గజం, గజంన్నర తెగ్గొట్టి, ఆ తెగ్గొట్టి నంతవరకు సరిహద్దుగట్టును ముందుకు జరిపి, వెంకయ్య తనచేలో కలుపుకొన్నాడు. మనగట్టుమీదుండే రెండు తాటిచెట్లు కనపడటం లేదు. వెంకయ్య వాటిని పడగొట్టి తోలుకుపోయినట్లున్నది" అని భయపడుతూ చెప్పాడు. "అయితే, మీ రేమిచేస్తున్నారురా" అనడిగితే, "అయ్యగారూ, మేము మన ఇతరపొలాల్లో మెరకా పల్లాలు సరిచేస్తున్నాము. గట్లు పెట్టుకుంటున్నాం. అది బీదపొలంకదా ఈ ముఖ్యమైన పొలాల్లో పని పూర్తి అయిన తర్వాత దాని పని చూచుకోవచ్చనుకొన్నాం. నాకు రాత్రి దారిలో కనపడి సుబ్బన్న చెప్పాడు. మీ చవిటిచెక్కను వెంకయ్య కలుపు కొంటున్నా డని. ఈ ఉదయం వెళ్లి చూస్తినికదా, దిబ్బ నరికి వున్నది. గట్టు గజం, గజం న్నర ముందుకు జరిపి క్రొత్తగా పెట్టిన ట్లున్నది. వెంకయ్య కనపడలేదు. సరాసరి మీ వద్దకు పరుగెత్తుకొని వచ్చా" నని చెప్పుకొన్నాడు. గోపాలయ్య ఆశ్చర్యపడి, ఎంతపని చేశాడురా అనుకొని, "సరే, సాయంత్రం అటు వస్తాను, మీ రొకరిద్ద రటు రండి" అని నౌకరుని పంపివేశాడు. సాయంత్రం వెళ్లి చూడగా, తన నౌకరు చెప్పినట్లుగానే వున్నది. దిబ్బ నరికినట్లు, ముందుకు జరిపి క్రొత్తగట్టు పెట్టినట్లు స్పష్టంగా కనపడుచున్నది. ప్రాతగట్టుమీది తాటిచెట్లుందు కింకా వుంటవి?

వాని ఆనవాలు మాత్రం అంత స్పష్టంగా ఎట్లా కనపడుతుంది ? ఆ గుంటలు పూడ్చాడయ్యే. వాని కేం పోయేకాలమో. అయినా చుట్టుప్రక్కల వైతులకు తెలియదా, సరిహద్దుగట్టు నానుకొని నాచేలో తాటిచెట్లున్నవని అని కోపంతో ఇంటికి చేరాడు. వెంకయ్యకు వెంటనే కబురంపాడు. ఇంట్లో లేడని జవాబు వచ్చింది. మర్నాడు ఉదయం కబురు చెయ్యగా బంధువుకు జబ్బుచేస్తే ఊరికివెళ్లాడు, ఎప్పుడు వస్తాడో తెలియదని ఆయన భార్య చెప్పిందని వెళ్లివచ్చినవాని సమాచారం. తొందరపడకూడదని రెండు మూడురోజు లాగి, తిరిగి కబురు చెయ్యగా ఇంకా రాలేదని ఆడంగులు చెప్పారని, తిరిగివచ్చినవాడు చెప్పాడు. ఇదేమిటా అనుకొనుచుండగా ప్రక్కింటాయన వచ్చి, "బావా, వెంకయ్య ఊళ్లోనే ఉన్నట్లు తెలిసింది. నీకు మొగం చూపించటానికి జంకి, ఇంట్లోనే వుండి లేడనిపించుచున్నా" డని చెప్పి, తనపనిమీద వెళ్లిపోయాడు. ఇక వెంకయ్య తన ఎదుట పడడని, దూరం పోలం అవటంవల్ల చాటుమాటుగా తన చేనుకు వెళ్లి తన దురాక్రమణను సర్దుబాటు చేసుకొనచుండవచ్చని గోపాలయ్య తలంచాడు. తన నౌకర్లు ఇతరచోట్ల పనులుండి అక్కడకు వెళ్లటం లేదుకదా ! బీదచెక్కకు కాపలా ఏమని పెట్టం? సరే, ఇది మార్గంకాదని, కరణానికి కబురంపాడు. కరణం "నాకు తెలియ"దని బొంకి చక్కావెళ్లిపోయాడు. ఆ యూరి మునసబు కూడా బాగా వున్న వైతే. కారణాంతరాలవల్ల తనకు, మునసబుకు పడటంలేదు. ఇంచుమించుగా మాటలు లేనట్లే. ఆ సందు చూసుకొని కరణానికి నిర్లక్ష్యం. అసలు కరణం మద్దతు లేనిదే వెంకయ్యవంటి చిన్నాసామి ఇంత ధైర్యం చెయ్యగలడా అని ఆలోచనలోపడ్డాడు.

అదృష్టం కలసివచ్చి రంగయ్య కొడుకు కృష్ణారావు డెప్యూటి తహసిల్‌దారుగా నియమింపబడ్డాడు. తహసిల్‌దారు 4 నెలల సెలవులో వెళ్లిపోగా, ఆయన స్థానంలో తహసిల్‌దార య్యాడు. ఈసంగతి తెలిసిన గోపాలయ్య, కృష్ణారావు ఈ తాలూకాలోనే నెలనుండి పనిచేస్తున్నాడుకదా, అతని సాయం పొంది ఈ బెడద

తప్పించుకొంటే బాగుంటుం దనుకొన్నాడు. తా నింతవరకు ఏ తగాదాలోనూ దిగలేదు. ఏ కోర్టూ ఎక్కలేదు. ఏ వకీలునూ ఆశ్రయించలేదు. ఇప్పు డీ చిన్న భాగ్యానికి తగాదా ఎందుకు? కరణం, మునసబులు అతడికి అండగా వుండవచ్చును. బలవంతంగా తిరిగి తనభూమిని తా నాక్రమించుకో ప్రయత్నిస్తే, రగ డౌతుం దనుకొన్నాడు. రంగయ్యకు కబురు పంపి, అతనితో విషయం వివరంగా చెప్పి, "నీవు వెళ్లి నీ కొడుకు కృష్ణారావును ఒకసారి తీసుకొనిరా. అత డిప్పుడు తహసిల్ దారుకదా! అతడు మునసబు కరణాలను మందలించి, వెంకయ్యను చివాట్లు పెడితే వెంకయ్య గట్టుతీసి మామూలుచోట పెడతాడు. దిబ్బ తవ్వింది కొంచెమేగా, ఆ చవిటి మట్టి మనకే ముపయోగపడుతుంది? తాటిచెట్లున్నామా, వాని సిగ తరగ, మనకు వందలున్నాయికదా! వా డేదో గడ్డి తిన్నాడు. ఆ దరిద్రపుగొట్టును తిననియ్" అని చెప్పి పంపాడు. రంగయ్య కొడు కింటికి వెళ్లి సంగతులు చెప్పి, "గోపాలంగారికి మనం ఋణపడియున్నాం. ఒకసారి మన ఊరు వచ్చి గోపాలంగారి పనిని చక్కబెట్టవలసిం" దని చెప్పాడు. కృష్ణారావుకు తనను కలసికొమ్మని గోపాలం కబురు పంపటం నచ్చలేదు. తన హోదా నైనా గుర్తించకుండా తన నౌకరు నైనట్లు తనకు కబు రంపాడు. నా చదువుకు సాయంచేసినా, తాను ఆస్తిపరుడననే అహంకారం, నేను లేనివాడ ననే చులకన సహింపరాని దని అనుకొని, తండ్రితో "నా కిప్పుడు పని తొందరగావున్నది. పైగా కాంపుకు వెళ్లాలి. నేను రావటానికి వీల్లేదు. ఆయనను నాకు పిటీషను పెట్టుకోమను. నేను కాంపుకు వచ్చినట్లు వచ్చి ఆయన ఫిర్యాదును విచారిస్తాను" అని మొండిగా సమాధానం చెప్పి తండ్రిని పంపివేశాడు. కొడుకు ధోరణి నచ్చకపోయినా, చేసే దేమీ లేక నిస్పృహతో తండ్రి తిరిగి వెళ్లాడు. రంగయ్య చెప్పింది విని గోపాలయ్య చకితుడైనాడు. ఎంతలో మారిపోయాడు కృష్ణారావు! ఉద్యోగంవల్ల తల తిరుగుతుం దంటారు. తహసిల్ దారు పని

అతనికి నిషా ఎక్కించి ఉంటుంది. అదీ చూద్దాం అనుకొని, తన గుమాస్తాచేత పటేషను వ్రాయించి పంపించాడు.

నెలరోజులకు అకస్మాత్తుగా కృష్ణారావు మధ్యాహ్నం ఊళ్లోకి జీప్‌లో వచ్చి సరాసరి మునసబు ఇంటికి వెళ్లి, కరణాన్ని పిలిపించి విషయం అడిగాడు. వాళ్లు "వెంకయ్య అమాయకుడైన బీదరైతు. ఆస్తిపరుడైన గోపాలయ్య దురాశచేత ఈ ఫిర్యాదు చేశా"డని చెప్పారు. కరణాన్ని "మషాయతుచేసి తేల్చలేక పోయావా" అని అడిగితే, కరణం, "అయ్యా, అ దేదో పూర్వం సన్నాసిరకమైన మెట్ట. దాని సంబంధమైన లెక్క డొక్క సరిగా లేదు. మా ఫీల్డు బుక్కులో అంతుపట్టటంలేదు" అని మనవిచేసు కొన్నాడు. కాఫీ ఫలహారా లైన తర్వాత, "సరే, అక్కడికి వెళ్లి చూద్దాం. గోపాలయ్యకు, వెంకయ్యకు కబురంపండి అక్కడికి రమ్మని" అని చెప్పి జీపులో మునసబు కరణాల నెక్కించుకొని తన జవానుతో బైలుదేరాడు. బైలుదేరే ముందు మునసబు నాయకుణ్ణి పిలిచి గోపాలయ్యకు, వెంకయ్యకు చెప్పమని బెతాయించాడు. గోపాలయ్యకు తనింటికి కృష్ణారావు వచ్చి ముందుగా తనను కలసుకోలేదని కోపం వచ్చినా, తప్పదని బైలు దేరాడు. వెంకయ్య తనకు మునసబు, కరణాల అండున్నదని ధైర్యంతో పొలంవైపుకు నడిచాడు. జీపు పొలానికి చేరుకున్న ముప్పావుగంటకు గాని గోపాలయ్య, వెంకయ్య అక్కడకు చేర లేదు. ఈలోపుగా కరణం తగాదా స్థలాన్ని చూపుతూ, "అయ్యా, ఇక్కడ తాటిచెట్లుండిన వన్నాడని మీ రన్నారుగదా! తాటిచెట్లు ఉండి వుంటే గుర్తులు కనపడవా? ఈకాలంలో గట్లను బలం చేసుకొంటారు. గరికుంటే చెక్కివేస్తారు. ఇది క్రొత్తగట్టు కాదు. వెంకయ్య అణగారిపోయిన గట్టును క్రొత్తగడ్డతో పేర్చి బలంచేసుకొన్నాడు. దిబ్బ నరికినట్లు కనపడటంలేదు. ఆ ప్రక్కారి గొడ్లు తిరుగుతూ కొమ్మలతో కుమ్మి దిగత్రొక్కినట్లున్నవి. గోపాలయ్య ఈప్రక్క కెప్పుడూ రాడు. నౌకర్లమాట నమ్మి మీకు ఫిర్యాదు చేసివుంటా"డని వినయంతో చేతులునలుపుకొంటూ మనవి చేసుకొన్నాడు. కృష్ణారావుకు కరణం చెప్పిన మాటల్లో నమ్మకం

కుదర లేదు. చూస్తే గట్టు క్రొత్తగా పెట్టినట్లే వున్నది. గోపాలయ్య ఫిర్యాదు వెళ్లిన తర్వాత వెంకయ్య తన చేనంతా గడ్డి విరవటంచేత, స్పష్టంగా దురాక్రమణ కనపడకపోయినా, గడ్డి విరవటంలో తాటి చెట్లుండిన గుర్తులు స్పష్టపడకపోయినా దిబ్బను చూస్తే గట్టి అను మానమే కలుగుతున్నది. కాని, గోపాలయ్య గీర్వాణానికి విరుగుడు వెయ్యాలి. తాను తహసిల్ దారంటే తాలూకా కంతటికి అధికారన్న మాట. తాను అతని తాబేదారన్నట్లు కబురు పంపుతాడా? నా తడాఖా చూపిస్తేనేగాని తలమీది కళ్లు క్రిందకు దిగవని అను కొన్నాడు. న్యాయమో, అన్యాయమో గోపాలయ్యకు బుద్ధిచెప్పా లని నిశ్చయించుకొన్నాడు. ఇంతలో గోపాలయ్య, వెంకయ్య అక్కడకు చేరుకొన్నారు. వెంకయ్య మామూలు కంటె ఎక్కువ బీదరికాన్ని సూచించే బట్టలతో, వంగివంగి దణ్ణాలు పెట్టుచు, చేతులు కట్టు కొని తహసిల్ దారుగారికి కొంచెం దూరంగా నిల్చున్నాడు. గోపాలయ్య ముభావంగా చూస్తూ కృష్ణారావుకు ఒకప్రక్కగా వుండిపోయాడు. కృష్ణారావు అతని వంక సూటిగా చూడక, వెంకయ్య నేమో కొన్ని ప్రశ్న లడిగి, తలూపి, గోపాలయ్యను చూచి చూడనట్లు చూచి, మునసబు కరణాలతో మాట్లాడు తున్నట్లు, "గోపాలయ్యగారి పిటీషనులోని ఫిర్యాదు నాకు నిజమని తోచటంలేదు. నా కెక్కడా వారు పిటీషనులో చెప్పినట్లు 15, 20 సెంట్లు కాదు కదా, ఒక్క పిసరైనా వెంకయ్య దురాక్రమణచేసినట్లు అనుకోను. కరణం యిద్దరి చేలను మపాయతు చేసి, ఎవరి భూమి ఎంతవరకో తేల్చవలసి యుంటుంది. అలా పరిష్కారం కాకపోతే, గోపాలయ్యగారు సివిల్ కోర్టులో దావావేసి తన హక్కును రుజువుచేసుకొనవచ్చును. నాకు ఆఫీసులో వేరే పను లున్నవి. నేను వెంటనే వెళ్లిపోవా" లని జీపెక్కి చ్రరున వెళ్లిపోయాడు. గోపాలయ్య నిర్ఘాంతపోయాడు. కరణం, మునసబులు మునిమునినవ్వులు కురిపించుకున్నారు. వెంకయ్య సరే, సంతోషంతో పొంగిపోయి గంతులు వేసినంత పని చేశాడు.

ధ ఫాలాక్షుడు

మహేశ్వరుడను శంకరుడు సదాశివుడు, శివంకరుడు. భక్తులకు సులభసాధ్యుడు. ఎల్లప్పుడు శుభముల నొసగువాడు. సౌఖ్యములను చేకూర్చువాడు. చందనము వంటి చల్లని, మెత్తని మనస్సుతో భక్తుల కోర్కెలను తీర్చువాడు. మోక్షము నొసంగు వాడు. అట్టి శుభంకరుని, మోక్షప్రదాయనుడిని ఫాలాక్షుడు అనగా అగ్నినేత్రు డంటా రెందుకు? ఫాలమందు మూడవ కన్నున్నది. నిజమే. అది అగ్నిగుండ మని ఎందు కనుకోవాలి? ఆ మూడో కన్ను నిజంగా అగ్నిపర్వతంవంటిదైతే త్రిపురాధిపతులను జయించుటకు, వారి పురాలను దగ్ధంచేయటానికి శంకరుడంత కష్టపడవలసిన అవసర మేమి వచ్చింది? భూమిని రథంగా, చంద్ర, సూర్యులను రథచక్రాలుగా, బ్రహ్మను సారథిగా చేసుకొనట మెందుకు? పాశుపతాస్త్రమును ప్రయోగించట మెందుకు? అగ్నిపర్వతంనుండి ఉద్భవించే మహాగ్నిజ్వాలలవలె తన ఫాల నేత్రమునుండి అగ్నినర్వాన్ని కురిపించి త్రిపురాలను, వాని అధిపతులను దగ్ధంచేసి యుండవచ్చును కదా! పైగా ఒక్క మన్మథుని విషయములో తప్ప, తన మూడవ కన్నును మరెవరి యందును ఉపయోగించినట్లు కనపడదు. కాబట్టి, ఫాలనేత్రం అగ్నినేత్రం గాక, జ్ఞానేత్ర మనుకోవాలి. మన్మథుడు తన తపస్సును భంగం చేయాలని చిలిపిచేష్టలు చేయగా, అట్లు చేయకూడదని ఫాలనేత్రం నుండి ప్రవహించిన జ్ఞానంతో అతనిని మించి, కడిగి, పరిశుద్ధుణ్ణి, బుద్ధిమంతుణ్ణి చేశాడు. మహేశ్వరుడు జ్ఞానేత్రంచేతనే రుద్రుడైనాడు. అనగా మంచి చెడులను తెలుసుకొని, ధర్మాధర్మ విచక్షణ చేసే న్యాయాధిపతి (జడ్జి) అయినాడు. అందువలన శివుడు శుభప్రదాత, జ్ఞానప్రసాదితుడు, మోక్షమొసంగేవాడేగాని ఫాలభాగమందున్న మూడవ కంటిలో అగ్నిని నిలబెట్టుకొని, వారిని వీరిని దహించివేసేవాడు కాడు.

రతి

రతి అనగానే సంభోగ మని చప్పున అనుకుంటాం. అంతే గాని అది తూక సంబంధమైన దని గాని, మన్మథుని భార్య అని గాని అనుకొనం. దీనికి యోని అని కూడా అర్థం. ఆ అర్థం మనకు స్ఫురించదు. అసలు రతి మాటకు ప్రీతి, అనురాగం అనే అర్థా లున్నవని మనకు తోచదు. నిజానికి రతి అంటే స్త్రీ పురుష సంయోగమని సామాన్యార్థమైనా, అదే మామూలుగా అందరకు తెలిసిన అర్థమైనా నా మట్టుకు నాకు ప్రీతి, అనురాగా లనే అర్థాలే ఎక్కువ నచ్చుతవి. ఈ రెండు మాటలను అనేక సందర్భాలలో ఉపయోగించవచ్చును. తల్లి, తండ్రి, గురువు విషయంలో పూజించటం అనే అర్థం లోను, దేవుని యెడల భక్తి అనే భావంలోను, బిడ్డల యందు, స్నేహితులను గురించినప్పుడు ఆప్యాయత అనే అర్థంలోను, భార్యను గురించినప్పుడు ప్రేమ అనే దృష్టితోను ఉపగించియోచటాని కనుకూలపడతవి. మరిన్ని, ప్రీతి అనే మాటకు ఇష్టం అనే అర్థం చెప్పుకోవచ్చును. నాకు బెండకాయ కూర ఇష్టం, కోడి మాంసం బలే ఇష్టం, చేప లంటే అంతకంటే ఇష్టం, వంకాయ కూడా ఇష్టమే అనేటప్పుడు వాని యందు మన ప్రీతిని తెల్పుచున్నట్లు ప్రత్యేకంగా అనురాగం అని మన మనుకుంటే బిడ్డలు, భార్య, తాను మోహించిన స్త్రీ మరెవరైన ఉంటే ఆమె, దీని కతుకుతారు.

రతి అనగా నా ఊహాపథంలోకి చప్పున వచ్చేవి రక్తి, రంజన, మనోజ్ఞం, మనోహరం, ఆనందం అనే భావాలు. నిజానికి సంగమం లేక సంభోగం మనస్సును రంజింపజేసి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని ఇచ్చేదేకదా! అయితే స్త్రీ పురుష సంయోగాన్ని తెల్పే అర్థంకంటె, ఎక్కువ విస్తృత భావాన్ని రతి సూచిస్తుందని నా గట్టి అభిప్రాయం. ఇక యోని అనేది సంభోగానికి సంబంధించిందే కాని, మోటు సరసం అవుతుంది. పోతే, రతి లేక రతీదేవి

సంయోగానికి ప్రేరేపించే కాముని భార్యయేకదా! అన్ని జీవులను మన్మథుడు ప్రేరేపిస్తే, అతణ్ణి రతీదేవి ప్రేరేపిస్తుంది. ఆమె సంభోగరుచి మరిగి నే నొక్కడనే ఆనందిస్తే చాలదు, పదిమందీ ఉద్రేకాలను పొందిక్రింది మీద లవ్వాలని ఉత్సుకతతో,ముచ్చటతో తనకు ఊరకనే దొరికేవికదా అని పుష్పాలను బాణాలుగా కురిపిస్తుంటాడు. నేను చెప్పదలచుకొన్నది రతీదేవి నంతగా ఈ సందర్భంలో పాటించ నవసరంలేదని.

మిగిలింది పచ్చల తూకంలో ఒక బరువు అని, మణుగులో 25-వ వంతని అర్థాలు నాకు నచ్చవు. ఆ తూకాలు ఆ యా వ్యాపారులకు ఉపయోగపడతవి. అంతే. అవే భావాన్ని, ఆవేశాన్ని, ఆర్ద్రతను కలిగించవు. కాబట్టి మనం రతి అంటే ఆనందాన్ని, ప్రీతిని, అనురాగాన్ని ప్రసాదించే దనే అర్థంలోనే దానిని హృదయానికి హత్తుకొందాం.

౧౬

రమణీయం

హృదయాన్ని స్పందింపజేసి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించేది రమణీయం. అంద చందాలతో మనస్సును రంజింపజేసి ఆకర్షించేది రమణీయం. కన్నులకు పండుగ చేసేది, హాయిని, ఉల్లాసాన్ని అందించేది రమణీయం. ఉత్సుకతను, చల్లని మనో నిశ్చలతను ఒసంగేది రమణీయం. ఇంత రసపూరితమైనది, భావ గర్భితమైనది, పులకలెత్తించేది, మాధుర్యాన్ని ప్రసాదించేది మరొక పదం లేదు. ఈ పదాన్ని తలచుకొంటేనే స్వర్గంలో వున్నట్లవుతుంది. అనుభవిస్తే ఇక చెప్పనక్కరలేదు.

రమణీయం ముఖ్యంగా ప్రకృతికి చెందిం దనుకుంటాను. అందమైన స్త్రీలు రమణులైనా, రామణీయకం ప్రకృతి సొమ్మే. చిత్రవిచిత్ర గుల్మలతాదులతో, రంగురంగుల పుష్పనికుంజాలతో,

వృక్షాల చిగురుటాకులతో, వెల్లివిరిసే పొదలతో, ఆకాశా న్నందు కుంటున్నవో అన్నట్లున్న మిక్కిలి ఎత్తైన వృక్ష సంతతులతో, పచ్చిక బయళ్లతో, గుబురుగా పెరిగిన రకరకాల దారులతో, సంకీర్ణమైన పర్వతశ్రేణులతో, జలజల మని పారెడు సెలయేరులతో, మంద మారుత ప్రసారాలతో, రకరకాల పక్షుల మంజుల కూజితాలతో హాయిని గొల్పి కన్నుల కానందాన్ని, చెవులకు మాధుర్యాన్ని, మనస్సుకు ఉల్లాసాన్ని కలిగించే ప్రకృతి రామణీయకం ఎంతని చెప్పగలం!

రమణీయ మంటే సొగసైన దని నిఘంటువు చెప్పుచున్నది. సొగ సనగానే చక్కని స్త్రీ స్ఫురిస్తుంది. ఆమె అవయవాల సొగసు, ఆమె నడక సొగసు, ఆమె మాట సొగసు, ఆమె వర్తన సొగసు, చక్కని పొందికలతో లావణ్యపూరిత ముఖకవళికలతో, వెన్నెలవలె హాయిని గొల్పే మందహాసంతో, మధురమైన వాక్కులతో, సున్నితమైన చేష్టలతో, వయ్యారమైన నడకతో చూడటంతోనే, సమీపించటంతోనే, మాట్లాడటంతోనే హృదయాన్నాకర్షించి వశపరచుకొనే శక్తి సొగసుకత్తెదే.

రమణీయాన్ని రమ్య మంటారు కూడా. రమ్యం విషయం వేరే చెప్పనక్కరలేదు. సిసలైన రమ్యాలు స్త్రీలు. "తొయ్యలుల కంటె రమ్య వస్తువులు లేవు" అని భర్తృహరి అంతటివాడే ఉద్ఘాటించగా, కాదనటానికి మన మెవరం? పోతే, రమణీయానికి ఒప్పిదమనే అర్థం కూడా వున్నది. ఈ ఒప్పిదాని కనేకార్థాలున్నవి. చక్కదనం, మనోహరం, అలంకారం అనే అర్థాలేకాక యుక్తము, వేడుక అనే అర్థాలు కూడా వున్నవి. యుక్త మనగా తగిన దనికదా! సొగసైన రమణితో సహవాస మెంత యుక్తం! పురుషుని కంత కంటె కావలసిన దే మున్నది? ఈ రోజుల్లో స్త్రీ పురుషునితో సమానం (ఒక్కపిసరైనా ఎక్కువ గాకపోతే). ఇందిరమ్మను చూడండి అని ఎదురొక్కంటున్నారు నారీరత్నాలు. పైగా ఇప్పుడు అంతర్జాతీయ స్త్రీ సంవత్సర మయ్యే. కాబట్టి యుక్తాన్ని స్త్రీకి తగిన పురుషుడుగాకూడా ఎంచుకుందాం. వచ్చిన నష్ట మేమీలేదు. పైగా సమాన ప్రతిపత్తిలో స్త్రీ పురుషు

లుంటే పోట్లాడుకొన్నా, కొట్లాడుకొన్నా, కొగిళ్లలో మునిగితేలినా సమాన ఉజ్జీలుగా వుంటారు. ఇక వేడుక విషయ మంటారా, సమానంగా చిందుపడితేనే అందం. ఒక రొక విధంగా అడుగు వేసి మ రొకరు మరొక రకంగా అడుగువేస్తే, రసాభాసమే గాకుండా అభాసు కూడా అవుతుంది. ట్యూనును బట్టి ఒకరి కొకరు సహకరించుకొని, నృత్యం చేయకపోతే (ఈ రోజుల్లో నగరాల్లో చదువుకొన్నవాళ్లు డానుచేస్తుంటారుకదా!) ఒకరి పాదాలు మ రొకరు త్రొక్కరా? నృత్యం మాట దేవుడెరుగుగాని, ముందు త్రొక్కిన బాధ భరించ వద్దా? కాబట్టి ఆటపాటల్లో, అనగా వేడుకల్లో, పురుష స్త్రీ జంటలు సమాన ఫాయిలోనే ఉండాలి కాని పురుషుని గంతులు, ఎగురులు స్త్రీనృత్యంతో సమాన మగునా? స్త్రీ నృత్య లాలిత్యం, అభినయం హావ భావాలతో ఏ పేరు పెట్టి చెప్పినా పురుషుని మోటు త్రైదాలు, శివతాండవ పూనికలు సరితూగ కలవా? అసలు ఈ రెంటిని పోల్చగలమా?

రమణీయం ఒక పక్షంలో ప్రకృతికి చెందుతుంది. రెండో పక్షంలో స్త్రీకి అనువర్తిస్తుంది. మీసాలు, గడ్డాలు, మెలితిరిగిన కండలుకల పురుషులు అందంగానే ఉండవచ్చునుగాని రమణీయులు మాత్రం కాదు. ఈమధ్య బ్రహ్మశ్రీ దువ్వూరి వెంకట రమణ శాస్త్రిగారు కంకరరాళ్లవంటి వ్యాకరణ సూత్రాలకు వ్యాఖ్యానాలు వ్రాస్తూ, ఆ పుస్తకానికి "రమణీయం" అని పేరు పెట్టారు. నేతిబీరకాయలో నేయి ఎంత వుంటుందో వ్యాకరణ సూత్రాల వ్యాఖ్యలలో అంతే రామణీయకం ఉంటుంది. నే నిక్కొందు కంటున్నా నంటే, రమణీయం అనగా హాయి నిచ్చేది, రంజింప జేసేది, ఉల్లాసా న్నిచ్చేది, కన్నులకు పండుగ జేసేది, హృదయోన్మీలనపరచేది కాబట్టి, వీనిని కల్పించ కల్గేవి రెండే—ప్రకృతి, స్త్రీ. అందుకనే ప్రకృతిని స్త్రీగాను, స్త్రీని ప్రకృతిస్వరూపిణిగాను పెద్దలు చెప్పుతారు. రమణీయమునకు జై. మున్మాటికీ జై.

ఇలా

రంగు, వాసన, రుచి

వండిన కూర కంచం ముందుకు రావటంతోనే, దాని రంగు కంటి కింపుగా వుండాలి. దాని నుండి వచ్చే వాసనను ముక్కు పరిమళంగా గ్రహించాలి. నోటిలో వేసుకొనగానే జిహ్వాకు రుచి అనిపించాలి. అప్పుడు కూర బాగా వున్నట్లు, చక్కగా పచనం చేయబడినట్లు అర్థమౌతుంది. ఈవిధంగా తయారుకావా లంటే వేయవలసిన వస్తువు లన్నీ, ద్రవ్యా లన్నీ వేయాలి. వానిని సరిపడు నట్లుగా, సరియైన పాళ్లలో వేయాలి. ఎక్కు-వసేపు పొయ్యిమీద ఉంచి అడు గంటించినా, మాడబెట్టినా, లేక తగినంతసేపు పచనం చేయకపోయినా కూరకు సరియైన రంగు, సువాసన, రుచి రాదు. పై హంగులన్నీ అమర్చితేనే కూర మంచి దౌతుంది. ఈ సుగుణాలను అమర్చుకుంటుంది.

ఐతే, కూర లన్నిటిని ఒకేవిధంగా పచనం చేయటం కూడదు. ఏ కూర కే వస్తువులు వేయాలో ఆ విధంగానే వేయాలి. వంకాయ కూరకు తప్పకుండా పచ్చిమిరప, అల్లం, కొతిమీర వెయ్యాలి. మెంతి వంకాయ కూరకు వేయించిన మెంతి పొడి నమర్చాలి. ఉల్లి వంకాయ కూరకు చింతపండు పడాలి. కొందరు బెల్లం కూడా చేర్చుతారు. ఇం కొక రకమైన వంకాయ కూరలో నూరిన పచ్చి కొబ్బరినో, లేక కొబ్బరి పాలనో కలుపుతారు. బెండకాయ కూరైతే పచ్చిమిరప వేయరు. అల్లం వేయరు. కొతిమీర కూడా అవసర ముండదు. అరటి, బంగాళదుంప కూరలలో పచ్చిమిరప, కొతిమీర వేస్తారు. అల్లం కూడా వేస్తారు. ముఖ్యంగా బంగాళా దుంప కూర్మాలో అల్లంతోపాటు (అల్లం మసాలా దినుసుల్లోదే కదా) ఇతర మసాలా దినుసులు అనగా బిరంజి ఆకులు, ఏలకులు, లవంగాలు వెయ్యాలి. ఏ యే కూరకు ఏ యే దినుసులు వెయ్యాలో ఆవిధంగా వేసి వండితే కూరకు పై జెప్పిన లక్షణాలు అబ్బుతవి. చూచీ చూడటంతోనే, వాసన తగిలినంతనే, కూర బాగా కుదిరిందని తోస్తుంది. నోటిలోకి పోగానే నోరూరి, రుచి

అనుభవంలోకి వస్తుంది. ఇక్క- డొక విషయం చెప్పాలి. ఏ కూరగాయకైనా దాని సహజ వాసన వుంటుంది. దాని ఉడుకు పక్వానికి వచ్చినప్పుడు కూర సువాసన గుప్పున బైట బడుతుంది. కూర తయారైందని వెంటనే పొయ్యినుండి తీసి తెస్తే ఆ సువాసన నిలిచి భోక్తముందుకు రాగానే గుబాళిస్తుంది. ఈ సహజ వాసన అన్నిరకాలు అనగా మత్స్య మాంసాదుల్లో కూడా వుంటుంది. వంట పక్వానికి వచ్చినప్పుడు సువాసనను వెదజల్లుతుంది.

ఈ పై సలక్షణాలు కాయకూరల విషయంలో మాత్రమే అనుకో కూడదు. కోడిగ్రుడ్లు, మాంసం, చేప, రొయ్య విషయంలో కూడా ఈ సుగుణా లుండాలి. కోడిగ్రుడ్డును తీసుకొందాం. పులుసైతే వేసిన వుల్లి చక్కగా ఉడకాలి. చింతపండు పులుసు నల్లగా వుండ కూడదు. పచ్చిమిరప (బొత్తిగా వడిలిపోయినవి) పడకూడదు. అల్లం మరీ ఎక్కువ గాకుండా వుండాలి. కొతిమీర క్రుళ్ళిపోయినది కాకుండా వుండాలి. ఇవి తగిన పాళ్లలో పడితే కూర నల్లగాను, ఉల్లిబద్దలు పచ్చిగాను, అల్లంముక్కలు కొట్టవచ్చి నట్లుగాను, కొతిమీర దిక్కులేనిదిగా నుండక, కూర కళ్లకింపుగా వుంటుంది. మంచి వాసన వస్తుంది. జిహ్వాచాపల్యం నాలుకను లాగుతుంది. మాంసం కోళ్లనుండి, బాతులనుండి, పిట్టలనుండి, గొర్రెలనుండి, మేకలనుండి, పందులనుండి, దుప్పులు, కణుజులు, జింకలు, అడవిగొర్రెలు మొదలైనవానినుండి దొరుకుతుంది కదా! ఈ మాంసాలను ఏ యే రకం మాంసాన్ని ఏ యే విధంగా వండాలో తెలిసుండాలి. కోడిమాంసం వండినట్లు బాతుమాంసం వండకూడదు. కోడిమాంసం పులుసు వండ వచ్చును. ఎక్కువ రుచికి తుగిమిన పచ్చికొబ్బరో, కొబ్బరిపాలో కూడా కొంచెం తగిలించవచ్చును. మరిన్ని, మసాళా తగుమాత్రం వేసి చక్కగా వేపుడు చేయ వచ్చును. అయితే బాతు పులుసుకు పనికిరాదు. దానికి నీచువాస నున్నది. అది పోవటానికి మజ్జిగతోనో, నీరుల్లితోనో కడిగి, మసాళా కొంచె మెక్కువగానే వేసి దోరగా వేయించాలి. కొందరు వంటవాళ్లు బాతుల కుండే నీచుతిత్తిని తీసివేస్తారు. అప్పుడు వేపుడు కూర ఇంచుమించు కోడిమాంసం వేపుడు కూర వలెనే రుచిగా

వుంటుంది. బాతుల్లో చిలువ వంటి నీటిబాతులు, పరజ, చుక్క-వంటి ఎగిరే అడవిబాతు లుంటవి. వీనిని వేపుడు కూరగానే వండాలి. వీని మాంసానికి మామూలు పెంపుడు బాతుల మాంసం కంటె నీచువాస నెక్కువ. అందువలన వీనిని మజ్జిగ వగైరాలతో ఇం కెక్కువగా శుభ్రంచేయాలి. మసాలా దినుసులు కూడా కొంచె మెక్కువగానే వేయాలి. అడవి పావురాలు, పచ్చపావురాలు, కంచికోళ్లు మొదలైన అడవి పిట్టల మాంసం నీచుగా వుండదుకాని, వీని మాంసం కూడా వేపుడు కే పనికివస్తుంది. మసాలా కోడి మాంసంలో వేసేదాని కంటె కొంచె మెక్కువే వేయాలి.

గొర్రె, మేక మాంసం ఒక విధంగానే పచనం చేయ వచ్చును. అయితే మేక మాంసం ఎక్కువ గట్టిది. ఎక్కువ ఉడుకును కోరుతుంది. రుచులలో తప్పక భేద మున్నది. మాంసం కూరలలో నీరుల్లి మిక్కిలి తక్కువ వేయాలి. వెల్లుల్లి ఎక్కువగా వేసినా ఫరవాలేదు. మసాలా రెండు రకాల మాంసంలోను సమానంగానే వుండాలి. మాంసానికి అల్లం చాలా తక్కువ పడాలిగాని, వేపుడులో వెల్లుల్లి బాగానే పడాలి. పులుసులో గాని, వేపుడులోగాని కొంచెం పసుపు పడాలి. నిజానికి కాయ కూరల్లోనైనా, మాంసాదుల్లోనైనా రంగుకు, ఒంటికి మంచిదని పసుపు వాడుతారు. ఎక్కువ మోతాదులో పడితే పసుపు వాసన వస్తుంది కాబట్టి జాగ్రత్తగా సరిపడునంత మాత్రమే వెయ్యాలి. అడవి జంతువుల మాంసాన్ని సామాన్యంగా వేపుడు కూరే చేస్తారు. పులుసు కూర నా కనువభంలేదు. దుప్పి, జింక మాంసం మా టటుంచి, కణుజు మాంసం మాత్రం తప్పకుండా వేపుడే చెయ్యాలి. నిజానికి ముందు దానిని ఖండఖండాలుగా సగం వేపుడు (రోస్టు) చేసి, దానిని నిల్వవుంచుకొని, చల్లబడియున్న దానిని ముక్కలు ముక్కలుగా కోసి, అప్పటి కప్పుడు వేయించు కొనవచ్చును. ఊరపంది మాంసాన్ని చింతపండు వేసి పులుసుగా వండంగాని, దాని వారు చమురు వలన వేపుడు కూరగా తయారు చేసినా, గుజ్జుగానే వుంటుంది. అడవి పంది మాంసాన్ని మామూలు

పంది మాంసం వలెనే వేపుడు చేస్తారు. అయితే కొన్ని చోట్ల ముఖ్యంగా వేటాడి పెద్ద పందిని తెచ్చుకొన్నవాళ్లు, దాని వారులను చిక్కని చింతపండు రసంలో వండబెట్టి ఊరగాయో అన్నట్లు 15, 20 రోజులైనా, రోజుకు కొంతచొప్పున (నంజుకొని) తింటారని ఒకాయన చెప్పాడు. ఆయన ఫూరికి వెళ్లియుంటే ఒక ముక్క రుచి చూపించేవాడే, ఎట్లా వుంటుందో నాకు తెలిసేది. అదృష్టం లేక ఆ అవకాశం నాకు కలగలేదు. ఏ మాంసం అయినా దేనికి తగ్గట్లు దానికి దినుసులు పడితేనే రంగు, వాసన, రుచి వస్తుంది.

చేపలలో రకరకాలున్నవికదా! వానికి తగిన వాసన వాని కుంటుంది. బొచ్చెచేప నీచువాసన, పండుగప్ప చేప కుండదు. మట్టగుడిసి వాసన వేరు. కొరమేలు వాసన వేరు. మాగచేప వాసన వేరు. వాలగచేప వాసన వేరు. ఈ వివిధాలైన వాసనలు వంటలో పక్వించి, దేనికి తగినట్లది పరిమళ మిస్తుంది. చేపలుగా ఆకారభేదాలు గాక, వండిన కూరగా రంగుభేదాలు, వాసన, రుచి భేదాలుంటవి. వండే భేదాలుంటవికూడా. బొచ్చిచేపను పులుసే వెయ్యాలి. పండుగప్పను వేపుడే చెయ్యాలి. అప్పుడే వాని అందచందాలు బైట పడుతవి. బొచ్చెలో చింతపండు పులుసు, అల్లం, పచ్చిమిరపలతోబాటు నూనె ఎక్కువగానే పడాలి. కొతిమీర పైన చల్లితే ఇంకా సువాసన వస్తుంది. పండుగప్పకు అల్లం పచ్చిమిరప పడ్డా, కొంచెమే వేసినా, వేయకపోయినా నూనెలో చక్కగా ముదురు కాకుండా, లేత కాకుండా బంగారు రంగు వచ్చునట్లు వేయించాలి. బొచ్చె పులుసులో పసుపు వేయకపోయినా, పండుగప్ప వేపుడులో ఒక చిటికెడు పసుపు వేస్తే రంగు మరింత బాగా వస్తుంది. బొచ్చె పులుసు కూరకు దాని సువాసన దాని కున్నది. కాని, చక్కగా వేయించిన పండుగప్ప సువాసన గుబాళించి నోరూరచేస్తుంది. ఈ విధంగానే ఇతర చేపరకాల పక్వాన్ని విషయం అనుకోవాలి.

ఇక రొయ్యలున్నాయి. వీనిని పులుసుగాను, వేయించి వండవచ్చును. అయితే చిన్నరొయ్యను కలగలుపు కూరగా అనగా ఏదోసలోనో, వంకాయలోనో మిశ్రమ కూరగా వండ-

వచ్చును. రామములగలో వండితే బాగా వుంటుంది. పీచు రొయ్యను గోంగూరలో వండితే, భలే బాగుంటుంది. రొయ్య పులుసులో కూడా అల్లం, పచ్చిమిరప తప్పనిసరి. లవంగాలు, ఏలకులు వంటి వనవసరం. అయితే ఉల్లిబొందు, మరిన్ని సోయకూర వేస్తే మిక్కిలి రుచి కలుగుతుంది. వేపుడులో కూడా అల్లం, పచ్చిమిర పెట్లున్నా ఉల్లిబొందు, సోయకూర కలిస్తే రుచి రెట్టింపవుతుంది. చెప్పిందే తిరిగిచెప్ప నవసరంలేదుకాని, పైన చెప్పిన దినుసులు సరియైన పాళ్లలో వేసి జాగ్రత్తగా పచనంచేసి సకాలంలో దించివేస్తే మంచి రంగు, సువాసన, రుచి తప్పకుండా వస్తవి.

సరే, కూరలను గురించి పైన తెలుసుకున్నాం. అయితే, ఈ రంగు, వాసన, రుచి కూరలతోనే సరా అని అడగవచ్చును. ఈ మూడూ మనుష్యులకు కూడా వర్తిస్తవి. అవయవపొందిక లుండవచ్చునుకాని చూడటంతోనే చప్పున ఆకర్షించేది రంగు. మసిబొగ్గువంటి శరీరవర్ణం చప్పున విముఖత్వం కలిగిస్తుంది. నిమ్మ పండు పచ్చ, గులాబి రంగు, దబ్బపండు రంగు, ఎరుపు తెలుపు మిశ్రమ రంగు వర్ణం గలవారిని చూస్తే వెంటనే ముచ్చటౌతుంది. సౌమ్యంగా, సరసంగా, ఆప్యాయంగా మాట్లాడబుద్ధౌతుంది. తీరా కాల (కృష్ణ) వర్ణుడు దేహసౌష్ఠవం, ఉత్తమ లక్షణాలు కల వ్యక్తి రావచ్చును. ఆకర్షణీయమైన రంగు గల వ్యక్తి అవయవ లోపాలు కలిగి కుచ్చిత మనస్సు కల్గినవాడై ఉండవచ్చును. రంగు, అవయవపొందికలు, సొగసు స్త్రీ పురుషులకు సమానంగా వర్తిస్త వని వేరే చెప్పనక్కరలేదు. రంగునే ఆదిలో వర్ణం అనేవారు. వర్ణప్రభావమే ఆర్యసంఘంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య భేదాన్ని నిర్ణయించింది. అనార్యులను శూద్రులను గావించింది వారి కృష్ణవర్ణమే. రంగు, అంటే వర్ణమే, ఆర్య సంఘంలో వర్గాలకు, కులాలకు దారితీసింది. కాబట్టి మానవుల విషయంలో కూడా ముందు రంగుకు ప్రాధాన్యం వచ్చింది.

ప్రతి స్త్రీకి, పురుషునికి సహజమైన శరీరగంధం, లేక వాసన, వుంటుంది. ఇది సహజమైనదే గాని, అత్తరు వంటి సువాసన ద్రవ్యాలు పూసుకొనటంవల్ల, మల్లె గులాబివంటి పరిమళమిచ్చే పుష్పాలను ధరించటంవల్ల వచ్చింది కాదు. ఈ సహజగంధం పుట్టుకతోనే వచ్చేది. పెంపకంవల్ల, పరిస్థితులవల్ల, నివాసప్రదేశం వల్ల సహజ శరీరగంధం చప్పున బైటబడకపోయినా పైపూతలు, అలంకారాలు మాసి లేక సమసిపోయినప్పుడు, అసలువాసన తెలుస్తుంది. మన ప్రాచీన కవులు, ఆధునిక కవుల్లో కూడా చాలామంది స్త్రీని వర్ణించేటప్పుడు పుష్పగంధి, చందనగంధి వంటి విశేషణాలను తగిలిస్తారు. మన భారతంలో మత్స్యగంధి ఉండనే వున్నది. ఆమె పల్లెకారి పడుచు. చేపలను పట్టకపోయినా, వెళ్లే వచ్చే వారిని నదిని దాటించే పడవను నడుపుకొను యువతిగా పరిణమించినా, ఇంటి చేపల కంపు ఆమె కంటిం దనుకోవాలి. ఇది సహజం కాకపోవటంచేతనే, పరాశరుని వరం వల్ల అనే మిషతో ఆమె అసలువాసన అనగా కస్తురివాసన బైటపడింది. కాబట్టి ఏ వాసన అయినా, సహజ శరీరగంధం ప్రతి పురుషునకూ, ప్రతి స్త్రీకి ఉంటుంది. మంచివాసన వుంటుంది. చెడువాసన వుంటుంది. మంచివాసన ఆకర్షిస్తే, చెడువాసన విముఖుణ్ణి చేస్తుంది. రకరకాల పరిస్థితులవల్ల అనగా జన్మ, పెంపు, సంస్కృతి, పరిసరాల భేదాలవల్ల, ఒకే కులంలో ఒకేరకం సంపదలో వున్నవారిలో కూడా శరీరగంధ భిన్నాలుంటవి. ఇక వేరువేరుగా, హెచ్చు తగ్గులుగా పెరిగి, భిన్నభిన్న కులాలుగా రూపొందినవారి శరీరగంధం భిన్నభిన్నంగా వుండటంలో ఆశ్చర్య మేమున్నది? కాబట్టి రంగుతోబాటు శరీరగంధం కూడా ముఖ్యమైనది.

ఇక రుచి. మాట రుచి, పోజుల రుచి, ఆలింగనం రుచి, ముద్దుల రుచి, సంభోగం రుచి, ఇన్నిరకాల రుచులు, స్త్రీ పురుషుల మధ్య వుంటవికదా! మాటలు మెత్తగా, మృదువుగా, మంజులంగా, ప్రీతిగా, ప్రేమపూరితంగా ఆరంభమై ఒకరి నొకరు ఆకర్షించునట్లు చేయునుకదా! వయ్యారం, సొగసు వెలగబోయటం ఒకప్రక్క, తీపి, దర్పం మరొకప్రక్క ఆకర్షణీయం కావా? ఇవి శరీరాలను

దగ్గరకు చేర్చలేవా? శరీరాలు దొరకబుచ్చుకొనే దగ్గరకు వచ్చి, కౌగిలింతలకు దారితీయవా? కౌగిలింతలో చిక్కిన స్త్రీని పురుషుడు ముద్దుపెట్టుకోకుండా ఉంటాడా? స్త్రీ మట్టుకు పెదిమల నందించ కుండా రెచ్చిపోతే ప్రతిముద్దు లివ్వకుండా ఉండగలదా? ముద్దులలో సౌఖ్య మనుభవించిన వయసుకాండ్రు అంతటితో ఆగిపోతారా? కలయికకు, అందువలన కలిగే ఆనందానికి తహతహ లాడరా? కాబట్టి రుచి మనుష్యులకునూ వర్తిస్తుంది. ఎట్టి సందేహం లేదు.

మానవుని (స్త్రీ, పురుష) భోజన తృప్తికి, శరీరానందానికి రంగు, వాసన, రుచి—ఈ మూడూ అవసరం.

౧౯

ఎందరో మహానుభావులు

"ఎందరో మహానుభావులు" అనగా చప్పున త్యాగయ్య జ్ఞాపకం వస్తాడు. "వారందరికీ నా వందనములు" అని సాగిస్తే త్యాగరాజే అని ధృవపడుతుంది. ఆ కర్ణాటక సంగీత కళా మూర్తి ఏకాగ్రచిత్త శ్రీరామభక్తుడు. నేను సామాన్యుడను, ఎంతమందో భక్తులైన మహాత్ములున్నారు అని వినయ విధేయత లతో తన ఇష్టదైవానికి చెప్పుకొన్నాడు. ఆ పరమ భాగవతోత్తముని సహజ వినయ సంపదల్లనిపించిందాయనలో. తన ఆరాధ్యదేవుడు రావణ సంహారం కోసం మానవరూపం ధరించిన సాక్షాత్తు మహావిష్ణువాయె. ఆయనను తలచుకొన్నప్పుడు తానణువు కంటె అల్పుడుకదా! శ్రీరామచంద్రుని తాను పరోక్షంగా కీర్తిస్తున్నాడు, ఆరాధిస్తున్నాడు. ఆయన అలికిడి కోసం, దర్శనం కోసం, మధురవాక్కు కోసం తపిస్తున్నాడు. అవి తనకు దుర్లభ మాయె. మరి శ్రీరామచంద్రుని సమక్షానే మెలగటం, వారి జగన్మోహనాకారం ఎల్లప్పుడూ చూచుచుండటం, వారి మృదుమధుర వాక్కులను నాలకించుచుండటం, వారి పాదాల నంటుకొని పరిచర్యలు చేయటం, వారి ఆజ్ఞల నెరవేర్చటం ఎంత

పుణ్యం చేసుకొన్నారో శ్రీ హనుమంతులవారు! మహానుభావుడు కాబట్టే, ఆ అదృష్టం వారికి కలిగింది. మహాఋషి, ఆదికవి శ్రీ వాల్మీకులవారు, బ్రహ్మమానస పుత్రుడు, దేవర్షి నారదమహా ముని శ్రీరామస్మరణ, సంకీర్తనలు చేసిన మహానుభావులు కదా! శ్రీరామచంద్రప్రభువు స్వంత చేతులతో దహనంచేయించుకొన్న జటాయువు ఎంత పుణ్యవంతుడు, మహానుభావుడు! ఇటువంటి మహానుభావులు నా శ్రీరామచంద్రస్వామిని సేవించగా, సామాన్యమానవుడ నైన నే నొక లెక్కా, పత్తా అని తలపోసి "వారందరు మహానుభావులు, వారి కందరికీ నా వందనములు" అని సంకీర్తించాడు.

భక్త త్యాగరాజు ఎందరో గొప్ప వారున్నారు శ్రీరామ భక్తులు అనుకొన్నాడు. సరే, మనం ఎల్లప్పుడూ మహానుభావు డనే పదాన్ని గొప్పవాడు, మహాత్ము డనే అర్థంలోనే వాడ తామా? ఎకసక్కానికి, వేళాకోళానికి కూడా వాడమా? ఎవడైనా దుర్వ్యయంచేస్తే " వాడికేం మహానుభావుడు, ఎన్ని ఖర్చులైనా చేస్తా"డనమా? అయిష్టమైనవాడు వస్తుంటే, "ఆ మహానుభావుడు వస్తున్నాడుంటా" అని ప్రక్కనున్నవానితో అనమా? నే నింత చేశానను, అంత చేశా నని డాబే వానిని అసహనంతో, అపహాస్యంగా "నీకేం మహానుభావుడివి, నీవెనై్ననా చేస్తావ్" అనమా? ఈ సందర్భాలలో గొప్పవాడని అన్నట్లు గాక, నిరసించినట్లు కాదా? అయితే పెద్దల విషయంలో మహానుభావు డంటే గొప్పవా డనో, మహాత్ము డనో చెప్పాలి. త్యాగరాజు భక్తుల నెంచాడు. అందులో శ్రీరామభక్తుల నెంచాడు. శివుని పూజించే భక్తు లున్నారుకదా! వారు కూడా మహానుభావులు కదా! మరిన్ని బ్రహ్మజ్ఞానులు, యోగులు, సిద్ధులు మహానుభావులే. మతప్రతిష్ఠాపకులు, ప్రబోధకులు, ప్రవక్తలు, ఋషుల వంటి విజ్ఞానవేత్తలు, శాస్త్రవేత్తలు, సరస్వతి అవతారాలో అనిపించే మహాకవులు, మహాపండితులు మహానుభావులే. మానవసేవలో, దేశసేవలో జీవితాన్ని అర్పణచేసినవారు మహానుభావులు కారా? సంఘాన్నుద్ధరించినవారు, పతితులను రక్షించి కాపాడి

ఆదరించినవారు తప్పకుండా మహానుభావులే. దేశస్వాతంత్ర్యం కొరకు పోరాడినవారు, దానిని సాధించినవారు, దానిని కాపాడే వారు, వ్యక్తిస్వాతంత్ర్యాన్ని నిలబెట్టేవారు, ప్రజాభ్యుదయం కొరకు పాలించేవారు తప్పకుండా మహానుభావులే. తమ సంపదను బీదసాదల కుపయోగించినవారు కూడా ఈ కోవకే చెందుతారు. ఏందరో మహానుభావులు, వా రందరికీ నా వందనములు.

10

చెణుకులు

సుగ్రీవుడు, వాలికంటె తక్కువ బలశాలి, యుద్ధ నిపుణుడు. కర్ణుడు, అర్జునుని యంత శస్త్రాస్త్రప్రాటవం, సవ్యసాచిత్వం, యుద్ధము నందు నిల్వగల శక్తి (స్టామిన) లేనివాడు. సుగ్రీవుడు, కర్ణుడు సూర్యుని బిడ్డలు. వాలి, అర్జునుడు ఇంద్రునికి జనించినవారు. సూర్యుడు ఆదిత్యుడు, తేజోరాసి, త్రిమూర్త్యాత్మకుడు. ఇంద్రుడు దేవతల రాజు మాత్రమే. అయినా ఇంద్రునివల్ల కలిగినవారు సూర్యసంజాతులకంటె హెచ్చు ప్రతిభను కలిగియుండటం ఆశ్చర్యకరమే. అయితే సాక్షాత్తు మహావిష్ణువు అవతారమని చెప్పబడిన శ్రీకృష్ణుడు ఇంద్రునికంటె తక్కువస్థాయి కలవానివలె ఉపేంద్రుడనబడ్డాడు కదా! మరిన్ని సూర్యుడు కూడా ఒక దేవతయే కదా! అనగా ఇంద్రుని అధికారంలోనివాడే కదా అని సరిపెట్టుకోవాలి.

ప్రచండుడైన సూర్యుని పూజించినట్లు, స్తోత్రించినట్లు చల్లని చంద్రుని ఆరాధించం. పైగా విరహిణులు దూషిస్తారు. అందువల్ల మంచివాని కంటె దుష్టుడే గౌరవించబడతా డని చెప్పాలి.

క్రైస్తవులు ఆదిమ (ఒరిజనల్) పాప మున్నదని, ప్రతి మానవునకు పుట్టుకతోనే పాపం సంక్రమిస్తుందని, ఆ పాపాన్ని ఏసుక్రీస్తు తన రక్తంచేత ప్రక్షాళనం చేశాడని నమ్ముతారు. జన్మతో వచ్చే ఈ పాపం హిందువులకు కూడా వర్తిస్తుందా?

హిందువుల వివాహాదికాల్లో "పాపోహం పాప సంభవాం, పాపాత్మానాం" అని పురోహితులు మంత్రం చదువుతారు. క్రైస్తవులనుండి హిందువుల కర్మకాండలోకి ఈ పుట్టుక పాపం ప్రవేశించిందా, లేక హిందువుల నుండి క్రైస్తవ సిద్ధాంతంలోకి జొరబడిందా? అయితే పాపాలను తనరక్తంచేత ప్రక్షాళనచేసిన ప్రవక్త హిందూమతాచార్యులలో వున్నట్లు లేదు.

అన్నం సరిగా ఉంటే, కూర ఏదైనా ఫరవాలేదు. అన్నం చెడితే, ఎంతమంచి కూరున్నా భోజనం తృప్తి నివ్వదు. స్త్రీకి అన్నం వండటం చేతకాకపోతే గృహిణి కానేరదు.

అంధత్వం అన్ని దోషాల్లోకి ఎక్కువ చెడ్డది. ఏ అవయవ లోప మున్నా, ఇంద్రియలోప మున్నా సంబాళించుకొనవచ్చును. కాని కన్ను లేకపోతే కలియుగమే లేదు కదా!

పిల్లి పులి కాలేదు. పెకింగీస్ గ్రేట్ డేన్ కాలేదు. నక్క గురుపోతు కాలేదు. జాతి ఒకటైనా, సహజ సంపద లేకపోతే సమానత్వం రాదు. అది వుంటే సిపాయి సేనాధిపతి కావచ్చును.

ముఖాని కందం తిలకం. ముంజేతుల కందం గాజులు. కంఠాని కందం ముత్యాల సరాలు. రొమ్ముల కందం తారహారం. మరి పిరుదుల కందం బిగువైన లాగు, వదులు లంగా, అల్లిబిల్లి చీర కాదు.

స్త్రీ నిజమైన అందం ఆమె స్నానంచేసి ఒంటికి చుట్టుకొన్న చీరతో బైటికి వచ్చినప్పుడే కనపడుతుంది.

భార్యాభర్తల మధ్య సమానత్వ ముండా లంటారు. ఇది కలలో కూడా నిజం కాదు. భార్య అణుకువ కలదైతే భర్త విజృంభిస్తాడు. భర్త అసమర్థుడైతే భార్య చెలాయిస్తుంది.

స్త్రీకి పునాది మాతృత్వం. పతివ్రతాధర్మ మని చెప్పబడే పురుషభానిసత్వం కాదు.

స్త్రీ సాంగత్యం కోరని పురుషుడు పుంలింగం కల్గిన మగవాడు మాత్రమే. ఆమె సాహచర్యం లేనివాని జన్మ నిరర్థకం.

మగవాడు తన తప్పు నొకప్పు డైనా ఒప్పుకుంటాడు. ఆడది ఎప్పుడూ ఒప్పుకోదు.

మగవాళ్లమధ్య పోట్లాట తాటియాకు మంట వంటిది. గప్పున మంట లేచి చప్పున ఆరిపోతుంది. ఆడవాళ్లమధ్య కీచులాట చింతనిప్పు వంటిది. నెమ్మదిగా కాలుతూ, నిగురు గప్పినా లోపల రాజుతూనే వుంటుంది.

స్త్రీ తన పురుషునితో అబద్ధం చెప్పి, లేదని డబాయిస్తుంది. పురుషుడు తన స్త్రీతో నిజంచెప్పినా గదమాయించలేడు.

మగవానితో ఆడది కల్లబొల్లిమాటలు చెప్పి నమ్మిస్తుంది. మోహావేశునకు ఆ మాటలే బెల్లపు మాటలు.

రతి వలన స్త్రీ సౌందర్యం తరగదు, చెడదు. మనోవ్యథ దానిని కుంచించివేస్తుంది.

దేవీస్తుతి చాలావరకు ఆమె సౌందర్య వర్ణన. ఆ జగన్మాత కచ, కుచ, నాభి, కటి, వదన, నేత్ర ఆదిగా గల సర్వాంగ వర్ణన. ఆమె అనిర్వచీయ సౌందర్యవతిగా పురుషుడు వాంఛించవలసిన స్త్రీగా నుండునేమి? మానవుని స్త్రీ సౌందర్య పిపాస ఆ పరాశక్తి స్తవంలో కూడా ప్రతిబింబింపబడవలెనా?

రామాయణంలో అధర్మ యుద్ధం కానరాదు. తాటకి సంహారం ముఖాముఖి యుద్ధం. అలాగే ఖరదూషణాదుల విషయంలో కూడా. వాలిని చంపటం యుద్ధంచేసి కాదు. దొంగ చాటున, వాలికి తెలియకుండ, రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడు పడిపోయినప్పుడు యుద్ధవిరమణ, రావణుని రథం ధ్వంసమైనప్పుడు ఇంకొకరథం పొందుటకవకాశం, రథంలేని రాముడు హనుమంతుని వాహనంగా ఉపయోగించుకొనుటకు వీలు వగైరా కల్గినవి. భారతయుద్ధం అధర్మ యుద్ధం. భీష్మ్రని శిఖండి నడ్డంపెట్టుకొని చంపటం, అబద్ధమాడి గురుని చంపటం, పదిమంది చుట్టుముట్టి బాలుని అభిమన్యుని చంపటం, క్రుంగిన రథాన్ని లేవదీసుకొంటున్న కర్ణుని చంపటం మొదలైనవి అధర్మ యుద్ధం అని తెల్పుతవి.

విధవస్త్రీని గంగాభవాని లేక భాగీరథీసమాన అంటారు. గంగ పరమేశ్వరుని జటాజూట నివాసి. ఆ మృత్యుంజయుని భార్య. కనుక ఆమె కెన్నటికిని వైధవ్య ముండదు. కాశీ విశ్వేశ్వరుని పాదసన్నిధిముందుండు గంగ కంతకు ముందే వుండదు. పాతాళగంగ నిత్య నూత్న యౌవన, బహు భర్తృక కావచ్చును గాని, విధవ మాత్రం కాదు.

దశావతారాలలో నొకడైన బుద్ధుని నాస్తికు డంటా రేమి? బుద్ధుని భగవంతునిగా పూజించే బౌద్ధులు నాస్తికు లెట్లౌతారు?

పితృత్వం అనిశ్చితం, మాతృత్వం నిస్సందేహం. అందుకనే శాతకర్ణిని గౌతమీపుత్ర శాతకర్ణి అంటారు.

కవి రచించిన దెల్ల కావ్య మవుతుందా? కవి యనుపేరు నీటికాకికి కూడా వున్నదికదా!

ఇప్పుడు జరిగేది పతివ్రతం కాదు, పత్నీవ్రతం.

పురుష పూజ తృప్తిని కలిగించవచ్చును. స్త్రీ పూజ ఆనందాన్నిస్తుంది.

శివుని ధ్యానిస్తాము, గౌరిని పూజిస్తాము. శాక్తేయులు మొదలు, ఆదిశంకరుని వరకు భగవతి నారాధించినవారే.

కవులు శుకవాణి, పికవాణి, కలకంఠి అంటారు. ఈ కీచు గొంతుల కంచె తాంబూర, వీణ లేక వాయులీనం మంజుల నాదాలు మెరుగు కావా? అయినా నాకు జిల్లు కలిగిన బొంగురు గొంతులే యిష్టం. మంజులం జిలుగు వల్ల కలిగినట్లు, సన్నటి స్వరంవల్ల కల్గదు. కీరవాణి పట్టిపట్టినట్లును, పికవాణి ఆత్రుత పడుచున్నట్లును ఉంటవి.

మనస్సుపోతే స్త్రీసౌందర్యాన్ని పిచ్చెత్తేవరకు వర్ణింప వచ్చును. ఆ సౌందర్యారాధనలో మునిగిపోవచ్చును. మనస్సును దిటం పరచుకొంటే, స్త్రీ అక్క డొక ముద్ద, ఇక్క డొక ముద్ద, అక్క డెగుడు దిగుడు, ఇక్క డెగుడు దిగుడు గల మాంసం ముద్దల విగ్రహమే.

ఈగ పుం డెక్క డున్నదో తెలుసుకొంటుంది, మనకు తెలియజేస్తుంది. మనిషి పుండు ఈగ కెంతో, ఎద్దు పుండు కాకి కంత. 'ఎద్దు పుండు కాకికి ముద్దా' అంటాము. మనిషి పుండు ఈగ కంతేకదా!

కుల, వర్ణ విభేదం, వివక్షత లేకపోతే యువతీ యువకుల సాంగత్యానికి విశేషావకాశాలుంటవి. యువతి వివాహమాడే అవకాశాలు చాలా పెరుగుతవి. వరుల కొరకు పోటీ తగ్గితే, వరకట్నం అదంత టది దిగజారిపోతుంది. ఇంకొకటి, రకరకాల

పిల్లలు, వివిధాకర్షణగల పడుచులు, విడి విడి భాగాలుగా విడిపోయి యుండని జాతులలో విచ్చలవిడిగా దొరుకుతారు.

సౌందర్యోపాసకు డైన తండ్రి తన రక్తం పంచుకొన్న కూతురు, పరపురుషునివల్లనైనా చక్కని బిడ్డలను కంటే సహించ గలడు. కాని, కోడలు వ్యభిచరించి, దేవతామూర్తులను కన్నా సహించలేడు. కూతురు బిడ్డలను ముద్దు మురిపెం చేయగలడు. కోడలి బిడ్డలను దగ్గరకు రానీయలేడు.

వయస్సు మళ్లినా, ముసలితనం వచ్చినా, మగవాడికి ఆడది అవసరం. ఆడది లేనప్పుడు పుస్తకాలు చదవటం, తనకు తోచింది వ్రాసుకొనటం కొంతవరకైనా ఉపశమనం కల్గిస్తవి. వృద్ధాప్యంలో సాహచర్యం మాత్రమే కోరినా, పురుషత్వం ఉన్నంతవరకు మగవాడు సాంగత్యాన్నే కాంక్షిస్తాడు.

ముసలి ఎద్దును జోరీగలు ముసురుకొన్నట్లు, ముసలివానిని ఈగలు ముసురుకొంటవి.

స్త్రీ స్నేహం మృదు మలయ మారుతం వలె, గులాబి సున్నిత సువాసన వలె హృదయోల్లాసం కల్గిస్తుంది. పురుష స్నేహం వడిగల్గిన తూర్పుగాలి వలె, ఘాటైన సంపంగి లేక పారిజాతం వలె మనస్సుకు ఉత్సుకతను కల్పిస్తుంది.

భక్తులు లేనిదే భగవంతుడు లేడంటారు. అయితే భక్తులనే భగవంతుడు భయపెడ్తాడు. సాహెబొకడు, తన గుళ్లో చేరి, తన విగ్రహం మీద కాళ్లు పెట్టి విశ్రమిస్తుంటే అతణ్ణి ఏమీ చేయలేక, అమ్మవారు పూజారిని లేవగొట్టి, "సాహెబు కాళ్లను తీసివేయించు, లేకపోతే నీ పని పడ్తా" నందట. మన దేశంలో ఎన్నో గుళ్లు, సోమనాథ దేవాలయం వరకు కొల్లగొట్టి, ధ్వంసంచేసినవాళ్లు ప్రబలులయ్యారే గాని, క్షీణించి పోలేదు.

మన హిందువులు పురుష, స్త్రీ దేవుళ్లకు ఆపాదించిన మహత్తు వారి సౌందర్యం. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, లక్ష్మి, భగవతి, సరస్వతి వారికి ప్రత్యక్షమయ్యేది ముఖ్యంగా మహా సౌందర్యమూర్తులుగానే. వారి స్తోత్రం వారి అవయవ ఉత్తమ లక్షణాలు, పొందికలు, ఆకర్షణలను గురించే.

సకాలంలో గాక నెత్తికివచ్చినప్పుడు ఆదరా బాదరా పడే వారు, బహిర్భూమికి వెళ్లి ప్రక్షాళన కొరకు నీటికోసం తహతహ లాడుతూ దిక్కులు వెదికేవారివంటి వారు.

ఆడది బొంకితే, గోడకట్టినట్లుం దంటారు. నమ్మక తప్పదంటారు. అయితే ఇది అన్నిసందర్భాల్లో నిజంకాదు. వట్టి చప్పగా కూర వుంటే, ఉప్పు వేశానని డబాయించినా ఎవరైనా నమ్ముతారా?

ద్రౌపది తన ఐదుగురు భర్తల చిత్తవృత్తినిబట్టి ఎవరికే విధమైన భోజనంగాని, సరదాలుగాని, పడకగాని ఇష్టమో తదనుకూలంగా వ్యవహరించేదట. ఇది ఇంగితంగల గృహిణిని జ్ఞప్తికి తెస్తుంది. మామ, భర్త, బిడ్డల విషయంలో వేర్వేరు విధాలుగా తగినట్లు కోడళ్లు నడుచుకొని, ఎవరి కిచ్చే భోజనం వారి కివ్వటం సమంజసమే. మామ కిచ్చింది ఇతరులకు లేక పోయినా, ఇతరుల కిచ్చింది మామకు లేకపోయినా బాధ వుండదు.

సహజ ప్రతిభ లేనివానికి కీర్తికాంక్ష ఎక్కువ. పదిమంది చేత మెప్పుపొందాలని తహతహ లాడుతాడు. నిజమైన ప్రజ్ఞావంతుడు ఇతరుల పొగడ్తకు ఎదురుచూడడు సరికదా, వాని కించుకంతైనా ఉబ్బి తబ్బిబ్బు కాడు.

ఋణగ్రస్తుడు, అప్పిచ్చినవాని ఋణవిముక్తి కొరకు, తన ముందు జన్మలో ఋణదాత కుక్కగానో, కొడుకుగానో పుట్టి ఋణం తీర్చుకొంటా డని సామాన్యంగా అంటారు. కాని, ఈ మధ్య చినఓగిరాలలో జరిగిన వ్యాసపీఠంవారి విజ్ఞాన సభలలో ఒక స్వామివారు, "బాకీవున్నవాడు తండ్రిగా పుట్టి, అప్పిచ్చినవాడు కొడుకుగా పుట్టగా, అతనిని పెంచి పెద్దవానిని జేసి ఋణం తీర్చుకొంటా"డని చెప్పారు. ఈ రెంటిలో ఏది సమంజసమైన అభిభాషణ?

చను విస్తే చంక కెక్కుతా రంటారు. ఎవరు? మగపిల్లలు. ఆడపిల్ల లైతే నెత్తికే ఎక్కుతారు.

మానవుడు చిరకాలం జీవించాలని ఆశపడతాడు. అయితే సర్వావయవాలు, సర్వేంద్రియాలు సక్రమంగా పనిచేస్తుండి, తన కాళ్లమీద తాను నిలబడగల శక్తి ఉంటే తప్ప, అతనికి సుఖ శాంతు లుండవు. ఇతరుల మీద ఆధారపడవలసివస్తే, సుఖ

జీవనానికి బదులు దుఃఖపూరిత జీవితం ఈడ్చుకొనవలసి వస్తుంది. ఆ స్థితికంటె మరణమే మేలు.

విఖ్యాత కథానికుడు, నవలాకారచయిత కీ. శే. బుచ్చిబాబు వైద్యుని సలహాలు పాటించేవాడు కాదట. "బ్రతికి నన్నాళ్లు హాయిగా, తృప్తిగా బ్రతకాలి, అవి తినకూడదు, ఇవి బ్రతాగ కూడదు, చేయగూడదు అని నిర్బంధ నియమాలను పాటించాలనే బ్రతుకు బ్రతకట మెందుకు, దానివల్ల ప్రయోజన మేమిటి" అనే వారట. ఆవిధంగానే సుఖ సౌఖ్యాల ననుభవించి దాటి పోయారు. సుఖంలేని జన్మ శుద్ధ దండుగ.

మిగడ తనంతటతాను రుచినిస్తుంది. వెన్నతోడుంటేగాని రుచి నివ్వదు. మిగడ బిడ్డవంటిది. వెన్న యువతి లేక యువకుడు వంటిది.

పెరుగన్నంలో మిగడ రుచిని కల్పిస్తుంది. పాలన్నంలో రుచిని కల్పించేది పంచదారగాని మిగడ కాదు.

గొల్ల కృష్ణుడు వెన్నకుండల కెగబడి బొక్కేవాడట. తినాలని ఆత్రపడేవానికి, తేరసొమ్ము తింటేనే చాలనుకొనేవానికి రు చేమి తెలుస్తుంది ?

చీకటిలో కళ్లజోడు పెట్టుకొన్నా, నీతి నియమాలు లేనివానికి చదువున్నా ఒక్కటే. వ్యర్థం. నీతి నియమాలు సామాన్యార్థమున సంఘపరమైనవి. కాని, ఆలోచిస్తే. నిజానికవి వ్యక్తిగతంమాత్రమే.

ఆదర్శం, అహింస మంచివే. దుష్టుని విషయాన, శత్రువునెడ అవి పనికిరావు.

పాత్రమైన దానం, పరిస్థితుల నెరిగిన నడవడి మేలు.

జీవితాన్ని మానవసేవకు, సంఘాభ్యుదయానికి అంకితం చేసినవారికి స్వోత్కర్ష, తాను పట్టిన కుందేటికి మూడుకాళ్లే అనే మూర్ఖత్వం ఉంటే, మేలుకు బదులు కీడు కల్గుతుంది.

తాను ఆదర్శమూర్తి నని నమ్మేవాడు మూర్ఖుడు. ఇతరులను తన ప్రతిబింబాలుగా మలచ ప్రయత్నించువాడు పరమ మూర్ఖుడు. తా నెంతో పవిత్రుడ ననుకొనే గర్వి, భగవత్సృష్టిలో నీచాతినీచమైన పందివంటివాడు.

మతావేశంతో మతిచెడినవాడు (ఫానటిక్) ఏకైక విశ్వనాథుడగు భగవంతునికి ద్రోహం (బ్రేటే) చేస్తాడు.

మగవాడు మనస్సులో దాచుకొంటే ముందుకు సాగిపోలేడు. మగువ మనస్సు విప్పితే అగచాట్లు పడుతుంది.

శుచిగా వుండటం (క్లెన్లీనెస్) కంటె దైవభక్తి (గాడ్‌లీనెస్) ఎక్కువ. దాని కంటె ఎక్కువ ఉల్లాసంగా (లైవ్లీనెస్) వుండటం.

పిల్లలకు, ముసలివాళ్లకు తిండి ఆశ ఎక్కువనవచ్చును. కాని, పడుచువాళ్లకు ఎక్కువతిండి, ముసలివాళ్లకు ఎక్కువరుచులు కావాలి.

వయస్సు మళ్లినకొద్దీ వాంఛలు ఎక్కువౌతాయి. కొందరికి స్త్రీవాంఛ కూడా పెరుగుతుంది. ఆరిపోయే దీపానికి కాంతి ఎక్కువకదా!

కొందరు గృహిణులు ఉదయం వ్యవధి చాలదని, రాత్రి కాగానే ప్రాంగణం ఊడ్పించి, కల్లాపి చల్లించి, ముగ్గులు వేయించుతారు. ఇట్టిది, ఉదయం పడకనుండి ఆలస్యంగా లేస్తానేమో అని, సాయంత్రమే పళ్లు తోముకొనటం వంటిది. రాత్రి పాచి, సంజె పాచి కాదు సరికదా, ఉదయపాచి అంతకంటె కాదు. ఉదయ పాచి, సాయంత్ర పాచి సరైనవి. రాత్రి పాచితో ఉదయపాచి మానివేయటం రాత్రి నిద్రలో తయారైన పాచి నోటిని ప్రక్షాళనం చేయనటువంటిదే.

అనాచారం వాళ్లూ వీళ్లూ చేస్తే సదాచార మవదు. పదిమంది కలిసి దొంగతనం చేస్తే సమర్థనీయ మవుతుందా?

కోడిపుంజు అకస్మాత్తుగా, బలవంతంగా పెట్టను త్రొక్కి తర్వాత కూజితంతో చక్రభ్రమణం చేస్తుంది. పురుషుడు స్త్రీని ముందు లాలించి, ప్రేమవాక్యాలు పలికి, రసోద్దీపకశృంగారచేష్టలు చేసి, కరగించి, రమిస్తాడు. మానవునకు, కోడిపుంజుకు ఇంకో విషయంలో కూడా భేద మున్నది. అకారణంగా అంతకు ముందు ముక్కుమొగ మెరుగని ఎదురుపుంజుమీదకు దుమికిపోట్లాడుతుంది. మనుష్యుడు ఏదో సాకులేనిది ఎదుటివాని మీద కలియబడలేడు. మరొకటి పెట్ట గ్రుడ్లను జాగ్రత్తగా పొదిగి, పిల్లలను వేయికళ్లతో పెంచి, అవి పెద్దవవగానే పొడిచి తరిమివేస్తుంది. మానవస్త్రీ బిడ్డలు వయస్సు మళ్లినవారైనా చిన్నపిల్లలుగానే ఎంచి లాలిస్తుంది.

శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి

బి. ఎ. (ఆక్జన్) ఐ. ఆర్. ఎన్., బ్యారిస్టర్-ఎట్-లా

రిటైర్డ్ ఇన్‌కమ్‌టాక్స్ అసిస్టెంట్ కమిషనర్

వీరు 1898 జూన్ 25-వ తారీఖున మాతామహస్థాన మగు కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా, అంగలూరు గ్రామమున జన్మించారు. వీరి తండ్రి సమీప గ్రామ మగు బొమ్ములూరు వాస్తవ్యులు లింగం వెంకటరత్నంగారు. తల్లి త్రిపురనేని వెంకటాద్రిగారి కుమార్తె పున్నమ్మగారు. వీరు చిన్ననాట స్వగ్రామమగు బొమ్ములూరులోను, తరువాత బందరు, నోబుల్ హైస్కూల్, కాలేజీల లోను చదివి 1920 ఆగస్టులో ఇంగ్లండుకు ఉన్నత విద్యాభ్యాసంకొరకు వెళ్ళినారు. 1926 జూన్‌లో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమునుండి బి. ఎ. (ఆనర్సు) డిగ్రీని, 1927 జనవరిలో లండన్ లిన్‌కల్న్స్ ఇన్ నుండి బ్యారిస్టర్ పట్టాను పొందినారు. కొలదికాలం 1927-'28 లో మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా నుండి, 1929 ఏప్రిల్‌లో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటులో చేరారు. 1953 జూన్ మాసాంతమున ఉద్యోగ విరమణచేసి. అప్పటినుండి దివితాలూకా, పెడసనగల్లు గ్రామములో స్థిరనివాస మొనర్చుకొని, వ్యవసాయం చూచుకొనుచున్నారు.

వీరికి లలిత కళలయందు, సాహిత్యమునందు అభిమానము. 1961 సెప్టెంబరునుండి ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి కార్యవర్గ సభ్యులు. 1963 నుండి 1968 వరకు 5 సంవత్సరముల పాటు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమిలో సభ్యులుగా నుండిరి.

వీరి యితర రచనలు — " తాంబూలం - నైవేద్యం ", " మారిన కాలం ", " Reflections on the West ", " స్వవిషయం " - 3 సంపుటాలు, " అభిప్రాయాలు - అనుభవాలు ", " ఆదర్శాలు - అనుమానాలు ".